# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సెప్టెంబర్ 2024

25/-



## తేది 27-08-2024 గోకులాష్టమి రోజున తిరుమల శ్రీవేంకటేశ్వరునికి

# 22వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ దృశ్యమాలికలు...










# శ్రీవేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

**సంపుటి:** 17 **సంచిక:** 9

సలహాదారులు, స్ఫూర్తిదాత,
కర్త, కర్మ, క్రియ మా ప్రభు
తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు



ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
**డా॥ టి. గౌరీశంకర్**

ఫొటోగ్రాఫర్:
**పత్తి సుబ్రమణ్యం,** శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్: **సాయినాథ్, రమేష్**

**Email:** srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.readwhere.com
Phone: **040–27175050**
Cell: **9348212354**


## లోపలి పేజీల్లో


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| పురాణపురుషుడి దివ్యచరితమ్ వామన చరితమ్ | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం | 10 |
| మహాభారతంలోని మహోపాఖ్యానాలు | 21 |
| భక్తిముక్తి దాయకం – అనంతపద్మనాభస్వామి వ్రతం | 27 |
| ఉండ్రాళ్ళ తద్ది | 30 |
| విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడు | 31 |
| తిరుమల ప్రసాదాలలో కరివేపాకు ఎందుకు వేయరు? | 33 |
| రామాయణ రత్నాకరం | 36 |
| ముకుందమాల | 40 |
| శ్రావణమాసం విశిష్టత | 44 |
| మీ ప్రశ్న మా సమాధానం | 45 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 46 |
| శ్రీకృష్ణ తత్వం | 52 |
| సిద్ధి బుద్ధి ప్రదాతా.. గణేశా | 54 |
| తిరుమల సర్వస్వం | 57 |
| సేక్రెడ్ ఫుడ్స్ ఆఫ్ గాడ్ | 63 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |




# మనస్సు కట్టడి

మనిషికి మనస్సు ప్రధానమైనది. అరిషడ్వర్గాలనే కోరికలు ప్రతి మనిషిలోనూ గుఱ్ఱాల్లాగా పరిగెత్తుతుంటాయి. వీటిని అదుపు చేయుటలో మనస్సు ప్రధాన పాత్ర పోషిస్తుంది. దృఢమైన, నిశ్చలమైన మనస్సు కలిగి ఉండుట ఎంతో అవసరము. ఒకవేళ మనస్సు దృఢంగా లేనట్లయితే ఆ వ్యక్తి అరిషడ్వర్గాలనే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలకు గురై పతనమవుతాడు. కాని ఈ అరిషడ్వర్గాలనే వికారాలను జయించుట అంత చిన్నపని కాదు. వీటిని జయించుటకు చాలామందికి ఒక జీవితము కూడా సరిపోదు. అంత బలంగా ఈ వికారాలు మన జీవితంలో ప్రభావాలు చూపుతాయి. మనిషి వీటిని కేవలం సాధన వలన, భగవంతుని కృప వలన మాత్రమే సాధించగలడు. ఎంతో సాధన చేసిన మనిషి క్షణకాలములో పతనమైపోవుట కూడా ఎన్నో సందర్భాలలో ఎంతోమంది మహనీయులలో జరిగింది. అందుకని మనిషి సాధన నిరంతరం జరుగుతూ ఉండాలి. లేనిచో మనిషికి పూర్ణత్వము సిద్ధించదు. మనస్సు చంచలమైంది, క్షణ క్షణం మారుతుంది కాబట్టి సాధకుడు కేవలం భగవంతుని శక్తితోనే సాధించవచ్చు తప్ప మన స్వశక్తితో సాధించుట అత్యంత కఠినం. అట్లని సాధన లేకుండా కట్టడి చేయుట అసాధ్యం. మనస్సు పరి పరి విధాల ఆలోచనలతో పరిగెడుతుంది. అలా వెళ్ళకుండా కట్టేయుటకు ప్రయత్నించాలి. కోరికలను నశింప చేసుకోవాలి, తృప్తితో జీవించాలి. భగవంతుడు నా స్తోమత అనుసారం ఇంతే ప్రసాదించాడని భావించి ఉన్నదానితో తృప్తి చెందాలి. ఈ లోకంలో ఎన్నోరకాల రంగు రంగుల వస్తువులు, రక రకాల సుఖాలు మాటి మాటికి ఆకర్షిస్తూ ఉంటాయి, మనలను ప్రక్క మార్గంలోకి పయనించుటకు విశ్వప్రయత్నం చేస్తూ ఉంటాయి. వీటిని ఎదుర్కొనే సామర్థ్యమును సాధన ద్వారా సాధించాలి. ఇంద్రియాలకు ఏమాత్రం అవకాశం లేకుండా కట్టడి చేయాలి. అప్పుడే మనస్సును కట్టడి చేయగలము. ప్రతి మనిషికి తెలివితేటలు ఉంటాయి. కాని అవి పొర కప్పి ఉండుట వలన కష్టపడవలసి వస్తుంది. సాధన ద్వారా, భగవంతుని కృప వలన మాత్రమే ఇది సాధ్యం. లక్ష్యం పెట్టుకుని, దానికనుగుణంగా మన రోజువారీ కార్యక్రమములను నడిపిస్తూ, ప్రతి పనిలో లక్ష్యమును గుర్తు చేసుకుంటూ చేసే సాధన ఫలమునిస్తుంది. అద్దమునకు పట్టిన మసిని తుడిచినప్పుడు ఏవిధంగా మన బింబం స్పష్టంగా కనబడుతుందో, సాధన ద్వారా అరిషడ్వర్గాలను తొలగించినప్పుడు మన మనస్సు స్పష్టంగా ఉంటుంది. పట్టుదలతో, వైరాగ్యముతో ప్రయత్నిస్తే ప్రతివారు దీనిని సాధించగలరు. నిజానికి భగవంతుడు మనకు ఈ జీవితాన్ని ప్రసాదించింది సాధన చేసి మనస్సు నిగ్రహించుకొనుట కొరకే. భగవంతునిపై కాకుండా మరో విషయంపై ఆసక్తి లేకుండా జీవించువాడు ధన్యుడు, శ్రీవేంకటేశ్వరునికి అత్యంత ప్రియుడు. లోకంలో మనవారనుకున్నవారు, మనకున్న యావదాస్తి క్షణభంగురము, ఏదో ఒకరోజు మననుండి దూరమయ్యేది కాబట్టి వాటిపై ఆపేక్ష నశింపచేసుకొనుట మంచిది. శాశ్వతమైన శ్రీవేంకటేశ్వరునే శరణు వేడి, ఆది అంతము ఆయనే అనే భావముతో శరణాగత జీవితము గడుపువాడు ధన్యుడు. ప్రతి వ్యక్తి కేవలము కొద్ది కాలము సాధన చేస్తేనే భగవంతుని కృప వలన మధురమైన అనుభూతిని చవి చూడగలము. ఇక నిరంతరము సాధన చేస్తే ఆ మధురానుభూతి అనంతంగా ఉంటుంది. ప్రపంచంలోని అన్ని సుఖాలకన్నా మధురమైన సుఖమును సాక్షాత్తు భగవంతుడే ప్రసాదిస్తాడు. సాధకునికి తొలుత కొంత కష్టము కావచ్చును కాని కాలము గడిచిన కొద్దీ తినగ తినగ వేము తియ్యనుండు లాగా భగవంతుని కృపవలన మాధుర్యమును గ్రోలుచుండును. ఇదే ప్రతి వ్యక్తి నుండి భగవంతుడు ఆశించేది. సదా శ్రీవేంకటేశ్వరుని స్మరిద్దాం, జీవితాన్ని ధన్యం చేసుకుందాం.

నమో వేంకటేశాయ

**వినా వేంకటేశం న నాథో న నాథః ।**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి ।।**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**పుల్లగూర్ల సాయిరెడ్డి** (గోవిందదాసు)

Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : **93482 12354**, Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు
(రూ.లలో)


| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**
నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.
లేదా
శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను
లేదా
**Srivenkatesham**
A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు:______________________
______________________
చిరునామా:______________________
______________________
______________________
______________________
______________________
పిన్‌కోడ్:______________________
చందా వివరాలు:______________________

మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

**చందాదారులకు**
**స్వామివారి పవిత్ర పాదాలు**
**(10"x8") ఉచితం**

# శ్రీ వేంకటేశ్వర స్తుతి

శ్లో॥ భాస్వానుదేతి వికచాని సరోరుహాణి
సంపూరయంతి నినదైః కకుభో విహంగాః
శ్రీవైష్ణవా స్సతత మర్థిత మంగళాస్తే
ధామాశ్రయంతి తవ వేంకట సుప్రభాతం

తాత్పర్యం – సూర్యుడు ఉదయించినాడు. తామర పూవులు వికసించినవి. పక్షులు తమ కలకలా రావములతో (అరుపులతో) దిక్కులను నింపుచున్నవి. నీకు మంగళమును ఆశించుచు శ్రీ వైష్ణవ స్వాములు (భక్తులు) నీ ఆలయము చేరి యున్నారు. శ్రీవేంకటేశా! నీకు శుభోదయమగు గాక!

శ్లో॥ బ్రహ్మాదయ స్సురవరా స్సమహర్షయస్తే
సంత స్సనందనముఖా స్త్వథ యోగివర్యాః।
ధామాంతికే తవ హి మంగళ వస్తు హస్తాః
శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతం ॥

తాత్పర్యం – అత్రి, వశిష్ఠాది మహర్షులు, బ్రహ్మాది దేవతలు, సనందనాది యోగులు నీకు కానుకలుగా సమర్పించుటకై మంగళ ద్రవ్యములను చేతులలో ధరించి నీ దర్శనమునకై నీ ఆలయం ఎదుట నిలిచి యున్నారు. శ్రీవేంకటేశా నీకు సుప్రభాతం.

– డా॥ కె.వి. రాఘవాచార్యులు

# ముక్తిమార్గము





## కన్నడగౌళ

పోయఁ గాలం బడవికి – గాయువెన్నెల కరణిని
శ్రీయుతుఁ దలఁచుఁడీ నరులు – మాయఁబడి చెడక
॥పల్లవి॥

1. చిత్తము చేకూరుచుకొని – చిత్తైకాగ్రతను,
చిత్తజగురునిఁ దలఁచుఁడీ – చిత్తజుఁ జొరనీక
॥పోయ॥

2. బూరుగు మాఁకునఁ జెందిన – కీరము చందమున,
ఆరయ నిష్ఫలమగు మరి – యన్యులఁ జేరినను
॥పోయ॥

3. కూరిమి మా తిరువేంకటగిరి – గురు శ్రీపాదములు,
చేరిన వారికి భవములు – చెందవెపుడు నటుగాన
॥పోయ॥



భావము

నరులారా! అడవి గాసిన వెన్నెలవలె అమూల్యమైన కాలము వ్యర్థముగా పోవుచున్నది. కాన మాయకు వశులై చెడిపోక లక్ష్మీనాథుని స్మరింపుడు. చంచలమైన చిత్తమును నిగ్రహించుకొనుడు. నిశ్చల భావమును పొందుడు. మనసులోకి మన్మథుని (కామప్రవృత్తిని) ప్రవేశింపనీయక మాధవునే భావింపుడు.

మాధవుని కాక అన్యుల నాశ్రయించినచో బూరుగు చెట్టు నాశ్రయించిన చిలుకవలె మీ జన్మము విఫలమగును. తిరువేంకటగిరినాథుని శ్రీచరణము లాశ్రయించిన వారి నెప్పటికిని భవబంధము లంటజాలవు.

భావానువాదం:
శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య



## పురాణపురుషుడి దివ్యచరితమ్

# వామన చరితమ్

చిల్లర సీతారామారావు

ప్రతి సంవత్సరం భాద్రపద శుక్ల పక్షమందు శ్రవణా నక్షత్ర యుక్తమైన ద్వాదశి నాడు వామన జయంతి పర్వమును భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. మహావిష్ణువు దశావతారములలో వామనావతారము ఒకటి.

వామన జయంతి వ్రతమును ఆచరించువారు ద్వాదశికి ముందు రోజు ఉపవాసము ఉంటారు. రాత్రంతా జాగరణ చేస్తారు. జాగరణ సమయమున విష్ణుమూర్తి గాథలను పఠిస్తారు. ద్వాదశి నాడు మధ్యాహ్న సమయమున వామనమూర్తిని షోడశోపచారములతో పూజిస్తారు. శిఖ, సూత్రం, యజ్ఞోపవీతము, కమండలము ఉన్న ప్రతిమను పూజించాలని వ్రతోత్సవ చంద్రిక తెలియజేయుచున్నది. పూజానంతరము ఒక పాత్రలో పెరుగు నుంచి, ఆ పాత్రను బ్రాహ్మణునకు దానమిస్తారు. పూజ ముగిసిన తరువాత వ్రతకథను వింటారు.

క్షీరసాగర మథన సమయమున ధన్వంతరి అమృత కలశమును చేతబూని అవతరించాడు. రాక్షసులు ఒక్కసారిగా అతని మీద పడ్డారు. అతడి చేతిలోని అమృత కలశమును లాగుకున్నారు. అమృతము పంపక విషయములో రాక్షసుల మధ్య విభేదాలు పొడసూపినాయి. దేవతలు పరిస్థితిని గమనించి నిరాశకు లోనయ్యారు. సమస్యను పరిష్కరించడానికి మహావిష్ణువు మోహినిగా అవతరించాడు. ఆమె సౌందర్యమునకు రాక్షసులు ముగ్ధులు అయ్యారు. ఆమె చెప్పినట్లు వినడానికి సిద్ధపడ్డారు. మోహిని దేవతలను, రాక్షసులను విడి విడిగా కూర్చుండబెట్టింది. మోహిని తన కులుకులతో రాక్షసులను భ్రమింపచేసి దేవతలకు అమృతమును పంచిపెట్టింది. దేవతలు అమృతము పుచ్చుకొనిన తరువాత మోహిని విష్ణువు అయ్యాడు. దేవతల మోసమును రాక్షసులు సహించలేకపోయారు. దేవతలతో యుద్ధానికి తలపడ్డారు. ఆ యుద్ధములో దేవతలు విజయము సాధించారు. దేవేంద్రుడు బలి చక్రవర్తిని సంహరించాడు.

బలి చక్రవర్తిని భృగు వంశీయులు బ్రతికించారు. బలి తన సర్వ సంపదలను శుక్రాచార్యునికి అప్పగించాడు. భృగు వంశీయులకు సేవలు చేస్తూ కాలము గడపసాగాడు. బలి చక్రవర్తి సేవలకు

భృగువంశీయులు ప్రసన్నులైనారు. వారు బలిచక్రవర్తి మదిలోని కోరికను గ్రహించారు. అతడి కోరికను సఫలీకృతము గావిద్దామని సంకల్పించుకున్నారు. విశ్వజిత్తు అను యాగమును బలిచక్రవర్తి చేత చేయించారు. యజ్ఞము పూర్తి కాగానే హోమగుండము నుండి బయటకు వచ్చిన అగ్నిదేవుడు బలిచక్రవర్తికి ఒక దివ్యరథమును, ఒక దివ్య ధనుస్సును, రెండు అక్షయ తూణీరములను ప్రసాదించాడు. ప్రహ్లాదుడు ఎప్పటికీ వాడిపోకుండా ఉండే పద్మమాలను, శుక్రాచార్యులు శంఖమును ఇచ్చారు. బలి చక్రవర్తి దాన ధర్మములతో బ్రాహ్మణులను, సాధువులను సంతుష్టి పరచి వారి ఆశీర్వాదములను పొందాడు.

శుక్రాచార్యులు ఒక శుభముహూర్తమును నిర్ణయించగా బలి చక్రవర్తి ముల్లోకములను జయించడానికి అగ్నిదేవుడు ఇచ్చిన దివ్యరథము నెక్కి బయలుదేరాడు. రథము వెంట అతడి సైన్యము బయలుదేరింది. బలి చక్రవర్తి అమరావతి ప్రాంతమునకు చేరుకుని నలుదిక్కులా ముట్టడించాడు. శంఖమును పూరించాడు. ఆ శంఖారావమునకు దేవతల గుండెలు వ్రక్కలయినాయి. అమరావతిలో ఉత్పాతములు కనిపించసాగాయి. బలిచక్రవర్తి అమిత బలపరాక్రమవంతుడై వచ్చినాడని గ్రహించాడు ఇంద్రుడు. అతడిని జయించుట అసాధ్యమని గ్రహించాడు. దేవతల గురువు బృహస్పతిని దర్శించుకుని ప్రణమిల్లి ఇలా అన్నాడు. ఆచార్యా! బలిచక్రవర్తి మితిమీరిన అహంకారముతో అమరావతిని ముట్టడించాడు. ఇతడికి ఇంతకు పూర్వము లేని శక్తి ఎక్కడినుండి వచ్చింది? మనోబలము, ఇంద్రియబలము, శరీరబలమును పరిశీలిస్తే ఇతడిని గెలవడము అసాధ్యమనిపిస్తుంది. ప్రస్తుత పరిస్థితులలో మాకు కర్తవ్యమును ఉపదేశించండి. ఇంద్రా! భృగు వంశీయులు తమ తేజస్సును బలియందు నింపారు. ఇప్పుడు అతడిని ఎవరూ ఎదిరించలేరు. ఒక్క శ్రీహరి మాత్రమే ఎదుర్కొనగలడు. బలవంతులతో విరోధము కలిగినప్పుడు అణగి మణగి ప్రవాస జీవితమును గడపడము ఉత్తమము. కాలమే శత్రువు స్థితిని తలక్రిందులు గావిస్తుంది. వేదవేత్తల బలముచే ఇతడి పరాక్రమము దిన దినాభివృద్ధి చెందుతున్నది. వేదవేత్తలు ఇతడి చేత అవమానము పాలయినప్పుడు, ఇతడు సపరివారముగా నశించును అని ఉపదేశించాడు బృహస్పతి.

బృహస్పతి ఉపదేశానుసారము దేవతలు అమరావతిని వీడి అజ్ఞాతములోకి వెళ్ళిపోయారు. దేవతలు లేని అమరావతిని బలిచక్రవర్తి తన అధీనము లోనికి తెచ్చుకున్నాడు. క్రమక్రమంగా ముల్లోకములను జయించాడు. భార్గవులు బలి చక్రవర్తి చేత నూరు అశ్వమేధ యాగములు చేయించారు. బలి చక్రవర్తి కాలమున భూమికి వసుంధర యను నామము సార్థకమయింది.

**శా."అర్థుల్ వేడరు దాతలుం జెడరు సర్వారంభముల్ పండుబ్ర**
**తృర్థుల్ లేరు మహోత్సవంబులను దేవాగారాముల్ వొల్చుబా**
**గ్ణార్థుల్ విప్రులు వర్షముల్ గురియు గాలార్థంబులై ధాత్రికిన్**
**సార్థంబయ్యె వసుంధరాత్వమసురేంద్రాధీశు రాజ్యంబునన్"**

ఆ బలిచక్రవర్తి రాజ్యము చేయునప్పుడు వేడుకొను యాచకులు లేరు. దాత లెన్నటికీ తమ ధనముల గోల్పోవరు. ఆరంభించిన పనులన్నియు సఫలీకృతములు. విరోధులు లేరు. దేవాలయములందెల్లప్పుడు ఉత్సవములు జరుగుతుంటాయి. బ్రాహ్మణులు యెప్పుడు సంతుష్టులై ఉంటారు. సకాలమున వర్షములు కురుస్తుంటాయి. భూమికి వసుంధర యను నామము సార్థకమయింది.

దేవతలు అజ్ఞాత జీవనము గడపడము దేవమాత అదితికి అంతులేని వేదనను కలిగించింది. తపస్సమాధి నుండి బయటికి వచ్చిన కశ్యపమహర్షి అదితి దగ్గరకు వచ్చాడు. విచార వదనముతో ఉన్న అదితిని చూచి నీ ముఖమున విచారము కనబడుతున్నది. దానికి కారణమేమిటి? అని అడిగాడు. అదితి సమాధానమిస్తూ – "నాథా! దితి సంతతి ఆగడాలు అధికమైనాయి. వారి ధాటికి తట్టుకొనలేక నా బిడ్డలు అజ్ఞాత జీవనము గడుపుతున్నారు. నా బిడ్డలను కష్టములనుండి బయటపడవేయండి అని ప్రార్థించింది. దేవీ! నీవు భగవంతుడిని ఆరాధించు. అతడే నీ కోరికలన్నీ నెరవేరుస్తాడు. ఇంతకంటే వేరు మార్గము లేదు అని పలికాడు. స్వామీ ! భగవంతుడు త్వరగా ప్రసన్నమగు ఉపాయము సెలవీయండి అని ప్రార్థించింది. కశ్యప మహర్షి అదితికి పయోభక్షణము అను వ్రతమును ఉపదేశించాడు. పయోభక్షణము అనగా పాలవ్రతము. ఫాల్గుణ మాసపు శుక్లపక్షమున పన్నెండు రోజులు పాలు మాత్రము ఆహారముగా గ్రహించుచు పరమ భక్తి శ్రద్ధలతో భగవంతుడిని ఆరాధించు వ్రతము పయోభక్షణ వ్రతము. అదితి భక్తి శ్రద్ధలతో, నియమ నిష్ఠలతో పయోభక్షణ వ్రతమును ఆచరించింది. ఆమె వ్రతమునకు విష్ణుమూర్తి ప్రసన్నుడై, ప్రత్యక్షమై – నీ పయోభక్షణ వ్రతము నాకు సంతృప్తిని కలిగించింది. నీ కోరిక సిద్ధించుటకు గాను కశ్యప మహర్షి తేజస్సుతో నీకు తనయుడిగా జన్మిస్తాను. నీ సంతానమును రక్షిస్తాను అని పలికి అదృశ్యమయ్యాడు. భగవంతుడి పలుకులకు అదితి మురిసిపోయింది. దేవమాత అదితి కొంతకాలమునకు గర్భము దాల్చింది. క్రమక్రమంగా ప్రసవ సమయము ఆసన్నమయింది.

**మ. రవి మధ్యాహ్నమునం జరింప గ్రహతారాచంద్ర భద్ర స్థితిన్**
**శ్రవణ ద్వాదశినాడు శ్రోణ నభిజిత్సంజ్ఞాత లగ్నంబునన్**
**భువనాధీశుడు పుట్టె వామనగతిం బుణ్యవ్రతోపేతకున్**
**దివిజాధీశ్వరు మాతకుం బరమ పాతివ్రత్య విఖ్యాతకున్"**

భాద్రపద శుక్ల ద్వాదశినాడు, సూర్యుడు మధ్యాహ్నమున ప్రకాశించుచుండగా, శ్రవణా నక్షత్రపు మొదటి పాదమున, గ్రహ తారా చంద్రులు, శుభస్థానస్థితులై యుండగా, అభిజిత్తు ముహూర్తమునందు శ్రీమహావిష్ణువు అదితి కుమారుడిగా

జన్మించాడు. ఆ సమయమున దిక్కులన్నీ ప్రకాశించినాయి. సప్తసముద్రములు నిర్మలములై విలసిల్లాయి. విప్రులు, దేవతలు ఆనందించారు. పువ్వుల వానలు కురిసినాయి. భూమియంతా పుష్ప సంభూత పరాగ మధువులతో లిప్తమై సువాసనలతో నిండిపోయింది. మహావిష్ణువు ఆవిర్భవించిన కొలది క్షణములలోనే వామన బ్రహ్మచారిగా మారిపోయాడు. ప్రజాపతిని బురస్కరించుకుని యుపనయనాది సంస్కారములు చేయించినారు మహర్షులు. సవితృడు గాయత్రీ మంత్రమును ఉపదేశించాడు. బృహస్పతి జన్నిదము వేసినాడు. కశ్యపుడు మొలత్రాడు కట్టినాడు. భూదేవి జింకచర్మమును ఇచ్చింది. చంద్రుడు దండమునిచ్చాడు. అదితి కౌపీనము, కటి వస్త్రమును ఇచ్చింది. ఆకాశము గొడుగునిచ్చింది. బ్రహ్మ కమండలము నిచ్చాడు. సప్తర్షులు కుశలనిచ్చారు. సరస్వతి రుద్రాక్ష మాల నిచ్చింది. కుబేరుడు భిక్షాపాత్రను ఇచ్చాడు. పార్వతి భిక్ష వేసింది.

బలి చక్రవర్తి అశ్వమేధ యాగము చేయుచున్నాడని వామనుడు తెలుసుకున్నాడు. యజ్ఞవాటికను దర్శించుకోవాలని బయలుదేరాడు. మార్గమధ్యమున కొందరు బ్రాహ్మణులు కోరుకున్నవాటిని తెచ్చుకుంటూ సంతోషంగా కనిపించారు. మీరు ఇన్ని సంపదలను తెచ్చుకుంటున్నారు కదా! బ్రాహ్మణులు అడిగిన వెంటనే లేదనకుండా ఇచ్చు దాతలు ఉన్నారా? ఉంటే చెప్పండి అని వామనుడు బ్రాహ్మణులను అడిగాడు. వామనా! దాతలు అనేకులు గలరు. బ్రాహ్మణులు తాము కోరిన దానిని తీసుకొని తిరిగి వచ్చెదరు. కాని దానము చేయుటలో బలిచక్రవర్తిని బోలిన వదాన్యుడు మరియొకడు లేడు. భార్గవుల ఆజ్ఞతో నూరు అధ్వరములు చేయుచున్నాడు. బలిచక్రవర్తిని వేడిన అఖిల సంపదలను బడయవచ్చును అని బ్రాహ్మణులు వామనునకు సమాధానమిచ్చారు. బ్రాహ్మణుల మాటలు విని, తల్లితండ్రుల ఆశీస్సులు తీసుకుని బయలుదేరి యజ్ఞవాటికను చేరుకున్నాడు. సభలోని వారు బ్రహ్మతేజస్సుతో జ్వలించుచున్న వటువును చూచి నివ్వెరపోయారు. ఈతడు శంకరుడో, విష్ణువో, బ్రహ్మయో, సూర్యుడో, అగ్నియో అయి ఉండవచ్చును గాని, ఈ ధరణిపై నివసించు బ్రాహ్మణోత్తముడు గానేరడు అని సభాసదులు రహస్యముగా మాట్లాడుకోసాగారు. వటువు సభామధ్యమున అటూ ఇటూ తిరుగుతూ దానవేంద్రుడిని చూచి కుశ పవిత్రాక్ష సంయుతంబగు తన దక్షిణ హస్తము సాచి దీవించాడు. బలి చక్రవర్తి వటువునకు నమస్కరించి, ఉచితాసనము మీద ఆసీనుడిని చేసి, తన దేవేరి అయిన వింధ్యావళి పసిడి కలశముతో ఉదకము పోస్తుండగా, వటువు పాదములను కడిగాడు. పాదోదకమును తన శిరస్సుపైన చల్లుకొని, భార్య శిరస్సుపై చల్లాడు. తర్వాత బ్రహ్మచారిని ప్రశ్నించాడు. ఓ బ్రహ్మచారీ నీవు ఎవ్వరివాడివి? నీ పేరేమిటి? నీ ఊరేది? నీ తల్లి తండ్రులు ఎవ్వరు? నీ వాంఛితమేమిటి? వస్త్రములో, ఫలములో, వన్యములో, ఆవులో, గుర్రములో, రత్నములో, రథములో, చక్కటి భోజనమో, కన్యలో, బంగారమో, ఇళ్ళో, ఊళ్ళో, భూములో, రాజ్యభాగమో ఏది కావలెనో అడుగుము. లేదనకుండా ఇచ్చెదను అని ధర్మయుక్తముగా పలికాడు. బలిచక్రవర్తి పలుకులకు వామనుడు నేను ఒంటరివాడిని. నాకు మూడు అడుగుల భూమిని మాత్రము ఇమ్ము. నా కోర్కె సఫలీకృతమగును అన్నాడు. అప్పుడు బలి చక్రవర్తి వామనుడితో నీవు ఇంత చిన్న కోరిక కోరుకున్నావేమిటి? అడిగేటప్పుడు దాత యొక్క గొప్పతనమును గుర్తుంచుకుని అడగాలి. స్వల్పముగా నీవు అడగడము, నేను ఇవ్వడము తగునా? అని పలికాడు. వామనుడు సమాధానమిస్తూ – రాజా! నేను బ్రహ్మచారిని. గొడుగో, జంధ్యమో, కమండలమో, ముంజియో, దండమో కోరుకోవాలి. భూములు, ఏనుగులు, స్త్రీ రత్నములు, గుర్రములు నాకు యెందుకు? నాకు ఇచ్చునవి నా నిత్య కర్మమునకు సంబంధించినవై ఉండాలి గదా! నేను అడిగిన మూడు అడుగుల భూమి ఇచ్చుటయే నా పాలిట బ్రహ్మాండము. ఏది దొరుకునో అదే పదివేలు అనుచు తృప్తి నొందని వాడు సప్త ద్వీపముల తిరిగిననూ శాంతిని పొందలేడు. సంతుష్టుడైనవాడు ముల్లోకములందును పూజింపబడును. నీవు రాజువు అగుటవలన అపరిమితముగా కోరుట న్యాయమా? అట్లు అడుగుట మంచిది కాదు. నేను అడిగిన మూడు అడుగులను నాకు ఇమ్ము. అది నాకు సంపూర్ణ తుష్టినిచ్చును. వటువు కోర్కెననుసరించి బలి చక్రవర్తి వటువునకు మూడడుగుల నేలను దానము చేయుటకు సిద్ధపడ్డాడు. రాక్షసగురువు శుక్రాచార్యుడు తన దివ్య దృష్టితో ఆ వటువును మహావిష్ణువుగా గుర్తించి దానవేంద్రుడితో ఇలా అన్నాడు. రాజా! ఇతడు మహావిష్ణువు. దేవతల కార్యము సాధించుటకు అదితి కడుపున జన్మించాడు. ఇతడి గురించి తెలియక అతడి కోర్కెను తీర్చెదనని పలికితివి. నీవు అతడి కోర్కెను తీర్చినచో, అతడు నిన్ను మోసగించి నీ సంపదనంతా ఇంద్రునికి ఇచ్చి వేస్తాడు. మూడు పాదములచే లోకములను ఆక్రమిస్తాడు. ఉన్న సంపదనంతా విష్ణువుకు దానము చేసి ఎలా బ్రతుకుతావు? ఇస్తానని పలికి ఇవ్వకపోవడము భావ్యమా? అను ఆలోచన నీకు అవసరం లేదు. అర్థికిచ్చుట వలన దాతకు చేటు సమకూరునెడల బొంకవచ్చును అని చెప్పెడి ధర్మసూత్రమొకటి కలదు.

**ఆ. "వారిజాక్షులందు వైవాహికములందు**
**బ్రాణ విత్త మానభంగమందు**
**జకిత గోకులాగ్ర జన్మరక్షణమందు**
**బొంకవచ్చు నఘము నొంద దధిప"**

స్త్రీల విషయము నందును, వివాహాది శుభకార్యములందును, ప్రాణ, ధన, మానభంగ సమయములందును బొంకవచ్చును. పాపము అంటదు. శుక్రాచార్యుల మాటలకు చక్రవర్తి ఇలా అన్నాడు. ఆచార్యా! మీరు చెప్పింది వాస్తవము. ఇదే గృహస్థ ధర్మము కూడా. కోరినది ఇత్తునని వాగ్దానము చేసి యుంటిని.

ఇప్పుడు కాదనుట ఎట్లు? ఎటువంటి చెడ్డపని చేసినవానినైనా భరిస్తాను కాని అబద్ధము చెప్పువానిని మోయలేను అని భూదేవి బ్రహ్మతో పలికింది. ఎవరయినా నా దగ్గరకు యాచన కొరకు వస్తే వారిని నేను నిరాశ పరచను గదా! అటువంటిది విష్ణువు స్వయంగా నా దగ్గరికి వచ్చి యాచిస్తే లేదని నేనెలా చెప్పగలను? ఇస్తానని చెప్పి ఇవ్వకపోతే నరకము ప్రాప్తిస్తుంది. ఆ నరకమును తప్పించుకోవడం నాకు శక్యం కాదు. దాతకు ధనము, యోగ్యుడైన ప్రతిగ్రహీత దొరకుట గొప్ప అవకాశం. ఇంతకంటే భాగ్యం ఇంకేమి కావాలి? రాజ్యనాశము అని మీరు అన్నారు. సంపదను ఎవ్వరూ మూటగట్టుకుని పోలేరు. దానం చేసిన వారి పేరు భూమిపై సూర్యచంద్రులున్నంత వరకు నిలుస్తుంది. కీర్తి వస్తుంది.

**శా. "కారే రాజులు! రాజ్యముల్ గలుగవే? గర్వోన్నతిం బొందరే?**
**వారేరి సిరిమూట గట్టుకొనిపోవం జాలిరే? భూమిపై**
**చేరైనంగలదే? శిబిప్రముఖులుం బ్రీతిని యశ కాములై**
**యీరేకోర్కులు? వారలన్ మరచిరే? యిక్కాలమున్ భార్గవా!"**

పూర్వము ఎంతమంది రాజులు కాలేదు? రాజ్యాలు పొందలేదు? గర్వముతో గొప్పవారమని విర్రవీగలేదు? వారు ఈనాడు ఎక్కడ ఉన్నారు? పోయేటప్పుడు వారు తమతో పాటు తమ సంపదలను మూటగట్టుకొని తీసుకొని పోగలిగారా? శిబి మొదలైన చక్రవర్తులు కీర్తిని కాంక్షించి, అడిగినవారి కోరికలను సంతోషముగా తీర్చారు. అట్టివారిని ఈనాటికీ లోకం మర్చిపోలేదు. అఖిల లోకనాథుడు మహావిష్ణువు అర్థియై తన చేతిని జాచి క్రింద నుంచుట, నా చేయి దానమును ఇచ్చుటకై పైన ఉండుట ఎంత శుభకరము? మేరుపర్వతము తలక్రిందైననూ, సముద్రములు ఎండిపోయిననూ, భూమి అణురూపములుగా విచ్చిపోయిననూ సరే నేను ఈ దానమును ఇచ్చి తీరెదను అన్న బలిచక్రవర్తి మాటలు శుక్రాచార్యునకు ఆగ్రహమును కలిగించాయి. గురువు ఆజ్ఞకు ఎదురాడిన నీ సిరిసంపదలు నాశనమగుగాక! నీవు భ్రష్టుడవై పోదువు గాక! అని శపించాడు. గురువుగారి శాపమునకు వగచిననూ బలిచక్రవర్తి సత్యపథమువైపే నిలబడినాడు. వటువు అడిగిన మూడు అడుగుల నేలను ఇవ్వడానికి నిశ్చయించుకున్నాడు. భర్త యాజ్ఞానుసారము వింధ్యావళి బంగారు పాత్రతో బ్రహ్మచారి కాళ్ళు కడగటానికి జలమును తెచ్చింది. బలచక్రవర్తి వామనుడితో బ్రహ్మచారీ! నీ కోరిక తీరుస్తాను. నీ పాదముల నిటు తెమ్ము అని పలికి ఆ పాదములను నీటను కడిగి ఆ పాదోదకమును తన శిరస్సున జల్లుకున్నాడు. మూడు అడుగుల నేలను దానముగా ఇస్తున్నాను అని పలికి జలధారను వటువు చేతిలో జారవిడువబోతుండగా శుక్రాచార్యుడు శిష్యుడి మీద వాత్సల్యము కొలది సూక్ష్మ శరీరుడై జలధారకు అడ్డుపడ్డాడు. వామనుడు కుశాగ్రమున అడ్డును తొలగించాడు. శుక్రాచార్యుడు ఏకనేత్రుడయ్యాడు. బలిచక్రవర్తి విష్ణువు అని తెలిసి కూడా మూడు అడుగుల నేలను దానము ఇచ్చుటను చూచి అందరునూ భళీ భళీ అని ప్రశంసించారు.

బలి చక్రవర్తి మూడడుగుల నేలను ధారపోయగానే వెంటనే వామనుడు తన విశ్వరూపమును ప్రదర్శించాడు.

**శా. "ఇంతింతై వటుడింతయై మరియు దానింతై నభోవీథిపై**
**నంతై తోయద మండలాగ్రమున కల్లంతై ప్రభారాశిపై**
**నంతై, చంద్రుని కంతయై ధ్రువునిపై నంతయై మహర్వాటిపై**
**నంతై, సత్యపదోన్నతుండగుచు బ్రహ్మాండాంత సంవర్ధియై"**

దానజల ధారను గ్రహించిన వామనుడు ఇంతవాడు అంతై ఇంకా ఎంతో ఎత్తు ఎదిగాడు. ఇంకా పైపైకి చంద్రుని కంటె, ధ్రువనక్షత్రము కంటే, మహర్లోకము కంటే, సత్యలోకం కంటె కూడా పైన ఉన్నత స్థానానికి ఎదిగి బ్రహ్మాండమంతటా నిండిపోయాడు. వామనుడు ఒక పాదమున భూమిని కప్పి, మరియొక పాదమున మింటిని ఆక్రమించాడు. బలిచక్రవర్తి అనుయాయువులు వటువుపై ఆగ్రహమును పెంచుకున్నారు. ఈ మాయా వటువు మూడడుగుల నేల నెపముగా దానము పట్టి ముల్లోకములను ఆక్రమించి, బలిచక్రవర్తి నుంచి రాజ్యము లాక్కుని, ఇంద్రునికి అప్పగించడానికి విష్ణువు ఇలా వచ్చాడు. ఈ సంగతి తెలియక మన చక్రవర్తి సత్యవ్రతుడు గనుక నాశనం తప్పదని తెలిసి కూడా వటువుకు దానమిచ్చాడు అని భావించి వామన మూర్తిపైన దాడికి బయలుదేరారు. బలిచక్రవర్తి వారిని ఆపాడు. విష్ణుమూర్తి అనుచరుల ధాటికి తట్టుకొనలేక బలిచక్రవర్తి అనుయాయులు పాతాళమునకు పారిపోయారు. గరుడుడు బలిని బంధించాడు. రాజా! మూడవ పాదమునకు దారి చూపుము అని అడిగాడు వామనుడు. నా తలపైన నీ మూడవ పాదమునుంచి నా మాట చెల్లింపుము అని పలికాడు బలిచక్రవర్తి. వింధ్యావళి పతిభిక్ష పెట్టమని ప్రార్థించింది. సమాధానమిస్తూ వటువు ఇలా అన్నాడు. గురువు శాపమునొంది, సంపద పోయి, బంధింపబడిన తరువాత కూడా బలి సత్యమును తప్పలేదు. మాయను గెలిచాడు. పుణ్యవంతుడు. దానవులలో శ్రేష్ఠుడు. కీర్తివర్ధనుడు. ఇతనిని ఎల్లవేళలా రక్షిస్తూ ఉంటాను. అసుర ప్రవృత్తి దరి చేరకుండా అనుగ్రహిస్తాను అని పలికి దీవించాడు. పిదప శుక్రాచార్యుల వారి చేత యజ్ఞకార్యము పూర్తి చేయించాడు. విష్ణువు ప్రహ్లాదునితో ఇలా అన్నాడు. నీవు, నీవారు, నీ మనుమడు బలి అందరూ సుతలమునకు పొండి. అక్కడ మీరు దురితము చెందరు. నేను గదను ధరించి రక్షిస్తాను. విష్ణుమూర్తి వచనానుసారము ప్రహ్లాదుడు బలితో కలిసి సుతలమునకు వెళ్ళిపోయాడు. దేవేంద్రుడు వామనుడిచే ఇవ్వబడిన అమరావతిని పాలించసాగాడు.

**వామన జయంతి నాడు వామనునకు నమస్కరించి, వామన చరితమును విని జీవితములను ధన్యం చేసుకుందాం.**

★ ★ ★



18వ భాగము

# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం

## స్వామి వారి దివ్య లీలలు


**తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**– గోవింద దాసు**

**(పుల్లగూర్ల సాయిరెడ్డి)**

దిశా నిర్దేశం : సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారిగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వార ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగ చేయుటకు వీలుగ స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగా ప్రస్తుతపు 18 వ భాగపు లీలల ప్రచురణ. (జనవరి 2006 – సెప్టెంబర్ 2006).



ఈ కాలము నా జీవితములో అత్యంత దురదృష్టపు కాలంగా పైకి కనబడుతుంది. ఎందుకంటే నాకున్న సర్వదాస్తిని స్వామివారు హరించేవిధంగా చేయసాగాడు. నా ప్రతి ప్రయత్నం విఫలమైంది, ప్రతి దానిలో ఆర్థిక నష్టాలు వచ్చాయి. ఒకరకంగా వ్యాపారం చేయలేని స్థితి ఏర్పడింది. ఫలితంగా నా మనస్సులో 'నమో వేంకటేశాయ' మాసపత్రిక ప్రారంభించనందుకు ఈ రకమైన పరిస్థితులు కలిగాయనే అనుమానం వచ్చింది. అదే సమయంలో స్వామివారి అత్యంత అరుదైన అనుగ్రహాలను ఎన్నో పొందాను. ఈ కాలములో కూడా స్వామివారి అనుగ్రహాల పరాకాష్ఠను అనుభవించాను.

మియాపూర్ ఆస్తి విషయంలో మోసం జరిగిందని, దానిని స్వామివారు ఆపలేదని స్వామిపైన విరక్తిభావం ఏర్పడింది. నాకే కలిగిన ఆపదలను స్వామివారు ఆపలేదు, నన్ను రక్షించలేదు, మరి ప్రతి సంవత్సరం 7 కోట్ల జపంలో పాల్గొన్న వారిని ఈయన రక్షించగలడా? వారు ఈ విషయం అడిగితే నేనేమని సమాధానం చెప్పాలి? అనే ఆలోచనలతో ఉన్నాను. స్వామిపట్ల నాకున్న భక్తి, శ్రద్ధ ,విశ్వాసము చాలావరకు నశించాయి. కాని ఏమి చేయను? ముంచినా, పైకి లేపినా ఆయనే అని అనుకున్నాను. ఆయన సేవలో ఎలాంటి లోపం రానీయకూడదనుకున్నాను. కాని మనస్ఫూర్తిగా సేవ చేయలేకపోయాను. 'ఇంకా ఎక్కువ చేయాలి' అనే విషయంలో వెనుకడుగు పడింది.

### మాంసాహారం తినుట

నేను స్వామివారి సేవను ప్రారంభించుటకు 6 నెలల ముందునుండి పూర్తిగా శాకాహారిగా మారాను. అత్యంత నిష్ఠతో, సంఘంలో వెలివేయబడ్డ వ్యక్తిగా జీవించసాగాను. ఇప్పుడు ఇది అవసరమా? ఎందుకు మాంసాహారం తినకూడదు? అని ఆలోచించాను. ఆ రోజు స్వామివారిని ఇలా ప్రార్థించాను. ప్రభూ!

నేను మాంసాహారం తినబోతున్నాను, ఒకవేళ మీరు వద్దంటే, ఈ రోజు కలలో వద్దని చెబితే తినను, లేదా తింటానని చెప్పాను. ఆ రోజు కలలో ఆయన ఏమీ చెప్పలేదు. కాబట్టి మాంసాహారం తినాలనుకున్నాను. దీనిని నిరోధించుటకు స్వామివారు చూపిన లీలను చూద్దాం.

అప్పుడు మియాపూర్ భూమి అమ్మగా వచ్చిన డబ్బుతో యాదగిరిగుట్ట ప్రాంతములో భూములు కొనడానికి తిరుగుతున్నాను. మధ్యాహ్నం ఒక హోటల్ కు వెళ్ళి కావాలని మాంసాహారం తిన్నాను. ఆ తరువాత హోటల్ నుండి బయటకు వచ్చాను, కాంపౌండ్ కూడా దాటలేదు. వెంటనే కడుపులో త్రిప్పినట్లైంది, తల తిరిగింది. వాంతి చేసుకున్నాను. మళ్ళీ మాంసాహారం ముట్టలేదు. ఈ విధమైన లీలను చూపి నా జీవితంలో మళ్ళీ మాంసాహారం ముట్టకుండా చేశాడు.


స్వామివారి పైన కోపము, విరక్తిభావంతో ఉన్నప్పటికీ వారి సేవలో ఏ లోపం రానివ్వలేదు. ప్రతిక్షణం స్వామివారి గురించిన ఆలోచనను కూడా మానలేదు. ఈ విషయం ఈ క్రింది లీల ద్వారా స్పష్టంగా తెలుస్తుంది.

**తేది 07-01-2006 కల :** ఈనాటి కలలో నేను మా కాలనీవాసుల మీటింగులో ఉన్నాను. ఈసారి రథయాత్ర ప్రారంభించుటకు ఎవ్వరిని పిలవాలి అనే విషయంపై చర్చిస్తున్నాను. ఇంతే కల. దీనిభావం – రథయాత్ర సమయం కానప్పటికీ, ఇతర విషయాలలో ఉన్నప్పటికీ ప్రతి సందర్భంలో స్వామివారిని, వారి సేవ గురించి ఆలోచిస్తున్నానని అర్థం.

ఆస్తిగొడవలవిషయంలోనన్నునేను చాలా తర్కించుకున్నాను. స్వామి నిజమైన భక్తుడు ఎలాంటి ఆపదలు వచ్చినా చలించడు, కాని నేను భయపడిపోయాను. కాబట్టి నేను ఆయన భక్తుణ్ణి అని చెప్పుకోవడానికి సిగ్గుపడ్డాను. నాలో నేను పరివర్తన చెందుటకు తీవ్రంగా ప్రయత్నించాను. కాని లాభం లేకపోయింది. ఈ ఆస్తి గొడవలలో ఆస్తి పైన వ్యామోహం ఎన్నోరెట్లు పెరిగింది. ఫలితంగా ఏ చిన్న ఆపద సంభవించినా తట్టుకోలేని బాధ కలిగేది. స్వతహాగా నేనెంతో ధైర్యవంతుణ్ణయినప్పటికీ నా ధైర్యం సరిపోయేది కాదు. ఫలితంగా తీవ్రంగా స్వామిని స్మరించేవాడిని. ఈ రకమైన శిక్షణ జరిగింది. కాని స్వామివారు కావాలని నా ఆస్తిని హరిస్తూ నన్ను కష్టాలపాలు చేశారని ఆయనపై విరక్తిభావం ఎంతో పెరిగింది.

## స్వామివారి ఆలింగనము

నేను మహా అదృష్టవంతుణ్ణి. స్వామివారికి ఈ లోకములో కోటానుకోట్ల మంది భక్తులు ఉండవచ్చు. అందులో ఎంతమందికి స్వామివారి ఆలింగనం లభించింది? నాకు లభించింది, అందుకే నేను అదృష్టవంతుణ్ణని భావిస్తున్నాను. ఇది అత్యంత పవిత్రమైన వైకుంఠ ఏకాదశి రోజు లభించడం మరింత ముగ్ధుణ్ణి చేసింది. కేవలం ఆలింగనమే కాదు, నేను స్వామివారికి అత్యంత




ఇష్టుడనని తెలిపే విధంగా, నన్ను చూడగానే ముసిముసిగా నవ్వుచూ, రెండడుగులు ముందుకేసి నన్ను ఆలింగనం చేసుకున్నాడు. ఉదాహరణకు – మన ఇంటికి ఒక అత్యంత సన్నిహితుడు, ప్రియమైనవాడు వచ్చినప్పుడు, ఏవిధంగా మనం సంతోషం వ్యక్తపరుస్తూ రెండడుగులు ముందుకువేసి, ఆయనను ఆలింగనం చేసుకుంటామో, అదేవిధంగా రెండడుగులు ముందుకేసి నన్ను ఆలింగనం చేసుకున్నాడు. ఈ కృపను ఏమని వర్ణించను? ఒక అధమస్థాయి వ్యక్తినైన నన్ను ఈ సృష్టి స్థితి లయ కారకుడు అంత గౌరవం ఇవ్వడాన్ని వర్ణించలేకపోతున్నాను. ఈ కృపకు కేవలం మరోజన్మను ఆయన సేవకు కేటాయించుకున్నానే తప్ప మరేదీ ఇవ్వలేకపోయాను.

స్వామివారి ప్రతిలీల ఆకలైనప్పుడే రుచి ఎక్కువ అన్నట్లుంటుంది. నాకు అత్యంత ఇష్టమైన ఆస్తులను హరిస్తూ, ఆర్థిక సంక్షోభానికి కారణం శ్రీవేంకటేశ్వరుడే అని నమ్మి, ఆయనపై అలిగి, ఒకరకంగా తిరస్కరణ భావంతో రగిలిపోవు సమయాన, నేనంటే ఇష్టమని ఈ ఆలింగనమును ప్రసాదించాడు. తద్వారా ఈ అనుభూతి, సుఖం వెయ్యి రెట్లు పెరిగింది. శ్రీవేంకటేశ్వరా! మీకోసం నాకున్న సమస్తం వదులుకుంటాననే భావం నాలో తారాస్థాయికి చేరింది. మరో ముఖ్యవిషయం, స్వామివారు కలలో చూపిస్తున్నది నిజమా కాదా? నమ్మాలా వద్దా? అని ఊగిసలాడుతున్న తరుణంలో, ప్రతి కల నిజమని నమ్మమని గత ఏప్రిల్ లో చెప్పారు. కాబట్టి ఈ ఆలింగన లీల

కూడా సత్యమని నూటికి నూరుపాళ్ళు నమ్మాను. ఈ అద్భుతమైన లీల, దాని ముందు పరిస్థితులు ఈ విధంగా ఉన్నాయి.

నా ఆస్తి గొడవల విషయంలో చాలా అలసిపోయాను, ఒకరకంగా నలిపివేయబడ్డాను. ఒకప్రక్క ఆస్తి పోయింది, మరోప్రక్క స్వామివారిని దూరం చేసుకున్నాను. స్వామివారితో ఎంత కోపంగా వ్యవహరిస్తున్నానో ఆయన నానుండి అంతే దూరమవుతున్నాడనే భావన ఏర్పడింది. ఈ కోపంలో చేసిన ప్రతిపని నాకు వ్యతిరేక ఫలాలు ఇవ్వసాగింది. మియాపూర్ భూమి కాంప్రమైజ్ చేయగా వచ్చిన డబ్బుతో అక్కడక్కడ భూములు కొన్నాను. కాని అవి అన్నీ తరువాత లిటిగేషన్ ఉన్నట్లు తేలటం వలన మరింత నష్టపోయాను. ఫలితంగా మరింత మానసిక క్షోభ అనుభవించాను. భూ సమస్య వలన ఎంత నష్టపోయానో, ఆ తరువాత రెండింతలు నష్టపోయాను. ఇలా ఉండగా చివరికి (తేది 10-01-2006) వైకుంఠ ఏకాదశి దగ్గరికి వస్తోంది. గత ఎన్నో సంవత్సరాల నుండి ప్రతి వైకుంఠ ఏకాదశి, తొలి ఏకాదశి రోజులలో స్వామివారి అనుగ్రహము తప్పక లభించేది. ఈసారి స్వామివారు నాకు దూరమైనారు కాబట్టి లభిస్తుందో లేదో అని చింతించాను. ఆస్తి పోయినా సరే స్వామివారిని దక్కించుకోవాలనిపించింది. వచ్చే వైకుంఠ ఏకాదశి నాడు నా స్వామిని ఎలాగైనా చూడాలని కోరిక పుట్టింది. కాని చూడలేను, మనసు అంగీకరించనందున తిరుపతికి వెళ్ళలేను. ఆరోజు భక్తులు ఆయనను చూచుటకు వేచి చూస్తుంటారు. నా ప్రభువుకు నేనంటే ఇష్టం లేదని ఎందుకో నాకనిపించింది. నా కష్టాల్లో ఆదుకోలేదనే బాధ నన్ను వెంటాడుతోంది. కోట్లు విలువ చేసే ఆస్తిని పోగొట్టుకున్నాను. వచ్చిన డబ్బు నిలవలేదు. దీనికి కారణం స్వామివారేనని భావించాను. చివరికి గత 3-4 రోజుల నుండి తిరిగి స్వామిని పొందుటకు ప్రయత్నించాను. శ్రీవేంకటేశ్వరా! నాకు నష్టం వచ్చినా పరవాలేదు, కాని మీరు మాత్రం నాకు కనబడండని, పూర్వంలాగా అనుగ్రహించమని, నేను మీవాడినని నాతో చెప్పండని దీనంగా వేడుకున్నాను.

స్వామివారు నా ప్రార్థనను చక్కగా విన్నారు. ఈ భూమిపైన అతికొద్దిమంది భక్తులకు లభించిన గౌరవాన్ని ప్రసాదించారు. నా జీవితం ధన్యమైంది. ఇందుకే నేను జన్మించాననిపించింది. ఇది భక్తులకు అరుదైన సంఘటన. స్వామివారు నా జీవితంలో కొన్ని ఆణిముత్యాలను ప్రసాదించారు. మరికొన్ని అంతకంటే ఎక్కువ విలువైనవి, జీవితం మొత్తం ఋణపడి ఉండాల్సినవి ప్రసాదించారు. అందులో ఇది ఒకటి. ఈ లీలలో స్వామివారు నేనంటే ఇష్టం అని చెప్తూ 'ఆలింగనం' చేసుకున్నారు. వైకుంఠ ఏకాదశి రోజు స్వామివారిని దర్శిస్తేనే మహాభాగ్యం అనుకుంటాము, అలాంటిది స్వామివారు దర్శనమిచ్చి, "నువ్వంటే నాకిష్టం" అని చెప్తూ "ఆలింగనం" చేసుకుంటే ఈ భాగ్యం ఎవరికి లభిస్తుంది? నా భాగ్యాన్ని ఏమని వర్ణించను? అది ఈ విధంగా జరిగింది.

గత కొన్ని రోజుల నుండి స్వామివారిని కనబడమని, నేనంటే తనకు ఇష్టమని తెల్పమని రకరకాలుగా వేడుకున్నాను. తేది 09-01-2006 నాడు కూడా ఇదే ప్రార్థన చేశాను. మరునాడు అంటే తేది 10-01-2006 నాడు వైకుంఠ ఏకాదశి అని, ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా నాకు కనబడమని వేడుకున్నాను. స్వామివారు కనబడతారని ఆశతో స్వామిని ధ్యానిస్తూ పడుకున్నాను. తేది 10-01-2006 నాడు ఉదయం 4 గంటల 15 నిముషాలకు మేల్కొన్నాను. ప్రతిరోజు 5.30 గంటలకు మేల్కొనేవాడిని కాని ఈరోజు బహుశా స్వామి తపనతో 4 గంటల 15 నిముషాలకే మేల్కొన్నాను. స్వామివారు కనబడలేదు కాబట్టి స్వామివారికి నేనంటే ఇష్టం లేదని భావిస్తూ ఆయనపై విరక్తిభావం మళ్ళీ ఏర్పడింది. చింతించాను, ఆ తరువాత ముఖము కడుక్కున్నాను. ఇంతలో మా సురేఖ వచ్చి ఎందుకు ఇంత తొందరగా లేచావని అడిగింది. దాంతో మళ్ళీ కొంతసేపు పడుకున్నాను. అప్పుడు జన్మను ధన్యం చేసే ఈ కల వచ్చింది.

తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆలయాన్ని ఆనందనిలయం అంటారు. మూలమూర్తి గదికి ఉన్న గడపను కులశేఖరపడి అంటారు. కులశేఖరుడు అనే ఆళ్వారు ఎప్పటికీ స్వామివారిని చూడాలనే కోరికతో, తనను గడపగా మార్చమని స్వామివారిని కోరడంతో ఈ గడపకు కులశేఖర పడి అని పేరు వచ్చిందని అంటారు. కులశేఖరపడి నుండి స్వామివారు దాదాపు ఐదారు అడుగుల దూరంలో ఉంటారు.

**తేది 10-01-2006 కల: వైకుంఠ ఏకాదశి :** ఈ కలలో, నేను హైదరాబాద్ లోని మా ఇంటిలోని బెడ్ రూమ్ లో పడుకున్నాను. శ్రీవేంకటేశ్వరునిపై కోపంగా ఉన్నాను. తిరుపతికి వెళ్ళి ఆయనను దర్శించుటకు ఇష్టపడలేని విధంగా నా మానసికస్థితి ఉన్నది. దీనిని గ్రహించిన తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన యోగమాయను నావద్దకు పంపాడు. ఆ మాయ వచ్చి నా బెడ్ పక్కన నిలబడింది. వెంటనే నేను కదలకుండా ఉండేలా నా కాళ్ళు చేతులను తాడుతో కట్టేసినట్లు బంధించింది. నేను కదలలేకపోయాను. శరీరం మొత్తం కట్టెలా బిగుసుకుపోయింది. ఆ తరువాత నన్ను తన మాయచే కొంత పైకి లేపి ఒక కట్టెను అడ్డంగా త్రిప్పినట్లు నన్ను అడ్డంగా త్రిప్పింది. ఒక ఐదున్నర అడుగుల పొడవున్న కర్రను, మూడడుగుల వెడల్పు ఉన్న డోర్ నుండి అడ్డంగా బయటకు తీసుకెళ్ళలేము. కాని ఈ కర్రను నిలువుగా పడుకోపెట్టినట్లు త్రిప్పినట్లైతే సులభంగా తీసుకెళ్ళునట్లు నన్ను ఈ శక్తి త్రిప్పింది. దీనితో దర్వాజా గుండా నన్ను ఇంటి బయటకు తీసుకెళ్ళింది. ఆ తరువాత ఆకాశమార్గాన నేరుగా తిరుమల ఆలయంలో స్వామివారి ముందు, కులశేఖరపడికి రెండడుగుల ఇవతల దింపింది. ఇలా నేను నా గదిలో పడుకొని ఉన్నప్పుడు, ఒక శక్తి

నా గదిలోకి ప్రవేశించుట, తన మాయచే నా కాళ్ళు చేతులను బంధించుట, నన్ను కొంత పైకి లేపి అడ్డంగా త్రిప్పుట, ఆ తరువాత ఇంటినుండి బయటకి తీసుకువెళ్ళి, ఆకాశమార్గాన దక్షిణం వైపు తీసుకెళ్ళుచున్నదనే భ్రమ కలిగే లోపే నన్ను తిరుమల ఆలయంలో స్వామివారి ముందు నిలిపింది. వెంటనే నా కట్లు ఊడిపోయాయి. ఇలా స్వామి ముందు నిలబడగానే ఎంతో ఆనందించాను. బాహ్య ప్రపంచమును మరిచిపోయాను. కాని గర్భగుడిలో అంతా పొగ ఉంది. స్వామివారు కనబడలేదు. స్వామివారిని పరీక్షగా, ప్రార్థనాపూర్వకంగా చూస్తూ అనుకోకుండా స్వామివైపు అడుగులు వేశాను. ఆ పొగ మెల్ల మెల్లగా పోవడం మొదలైంది. స్వామివారు కనబడసాగారు. కులశేఖరపడి దాటి రెండడుగులు లోనికి వేశాను. మరోప్రక్క నన్ను చూసిన శ్రీవేంకటేశ్వరుడు ముసిముసిగా నవ్వాడు. నన్ను చూచి ఆనందించినట్లు అనుభూతి చెందాను. వెంటనే నావైపు స్వామివారు కూడా రెండడుగులు వేశారు. ఒక ఆత్మీయుడు మన ఇంటికి వచ్చినప్పుడు, మనం రెండడుగులు ముందుకు వేసి ఆహ్వానించినట్లు, స్వామివారు కూడా తను ఉన్న స్థలము వీడి ఆనందిస్తూ రెండడుగులు నావైపు వేశారు. నేను మాత్రం అసలు ఏమి జరుగుతోందో తెలియక అత్యంత ఆనందంతో స్వామిముందు నిలబడ్డాను. ఇలా ఇద్దరం ఒకరిముందు మరొకరం అత్యంత దగ్గరగా నిలబడ్డాం. స్వామివారి నాలుగు చేతులలో పై రెండు చేతులలో శంఖు చక్రాలు ఉన్నాయి. క్రింది రెండు చేతులలో కుడి చేయి అభయమిస్తున్నట్లు ఉంది. ఇక ఎడమచేయి, అరచేతిని తనవైపు మడిచి తన ఎడమ తొడపైన పెట్టుకున్నాడు. దీనిని కటి హస్తము అంటాము. అప్పుడు నా దృష్టి స్వామివారి కడుపు భాగము పైన పడింది. స్వామివారి ఉదర భాగము, రెండు చేతులు ఏ భంగిమలో ఉన్నాయి అనే విషయం పైననే దృష్టి పెట్టాను. ఇంతలో చిత్రం జరిగింది. తన ఎడమ అరచేతిని కటి భంగిమ నుండి విప్పాడు. చేతిని చక్కగా క్రిందికి చాచాడు. ఈ పరిణామానికి ఆశ్చర్యపోయాను. ఏం జరుగుతోందో? ఎందుకు జరుగుతోందో తెలుసుకోలేకపోయాను. ఆ గదిలో పొగ పూర్తిగా పోలేదు, కొంత కొంత ఉంది. ఇంతలో తన ఎడమచేతిని పైకి లేపాడు. ఇప్పుడు ఆ చేయి బంగారు తొడుగులతో అత్యంత లావుగా ఉన్నట్లు కనబడింది. నేను ప్రతిరోజు ఉదయం లేవగానే టిటిడి వారి క్యాలెండరులో ఉన్న పెద్దసైజ్ స్వామివారి ఫొటోకు ప్రణామం చేస్తుంటాను. ఆ ఫొటోలో స్వామి చేయి ఏవిధంగా బంగారు తొడుగుతో లావుగా ఉన్నదో అదే అనుభూతి చెందాను. ఇంతలో ఆ చేతిని పైకి లేపి ఎదుటివారిని దగ్గరకు లాక్కున్నట్లు మళ్ళీ కటి భంగిమ లోకి త్రిప్పాడు. చివరికి ఆ చేతిని నా వీపు వెనక భాగాన పెట్టి నన్ను తన ఉదరము వైపు లాక్కున్నాడు. ఒక్క తోపుకు నేను స్వామివారి ఉదరమును తాకుతున్నట్లు స్వామివైపు లాగబడ్డాను. ఈవిధంగా స్వామివారు ఈ అయోగ్యుడైన భక్తుణ్ణి ఆలింగనం చేసుకున్నాడు. ''నేనంటే స్వామివారికి ఎంతో ఇష్టం'' అనే భావం నా హృదయంలో స్పష్టంగా పదే పదే వచ్చింది. కల చెదిరింది. క్షణంలో నాలోని బాధ, స్వామిపైనున్న కోపము అగ్గిలో పడ్డ దూదిలాగా భస్మమైపోయింది. కోల్పోయిన నా ఆస్తిని ఒకవైపు, స్వామి ఆలింగనాన్ని మరోవైపు త్రాసులో పెట్టి కొలుచుకున్నాను. స్వామి ఆలింగనం ఎంతో బరువైనదిగా భావించాను. దీనితో మియాపూర్ భూమిని కోల్పోయిన కోపము పూర్తిగా తగ్గింది. ఇక్కడ స్వామివారు నాకోసం రెండగులు ముందుకు వేయుట ఎంతో ఆనందాన్నిచ్చింది. మనకు అత్యంత ఆత్మీయులు అనుకోకుండా మన ఇంటికి వచ్చినప్పుడు, మనము లేచి రెండడుగులు ముందుకు వేసి ఆహ్వానించినట్లు అనిపించింది. ఈ తుచ్ఛ భక్తుడి కోసం స్వామివారు స్వయంగా రెండడుగులు ముందుకు వేయడంతో సిగ్గుపడ్డాను. మరోసారి నా జీవితాన్ని ధారపోశాను. ఏవిధంగా ఈ ఋణం తీర్చుకోవాలో తెలియలేదు.

శ్రీవేంకటేశ్వరునికి రెండు పాదాలు, నాలుగు చేతులు ఉంటాయి. పైన రెండు చేతులను శంఖు చక్రాలను ధరించుటకు ఉపయోగిస్తాడు. క్రింది రెండు చేతులను భక్తులను ఉద్ధరించటానికి వాడతాడు. కుడిచేయి అభయాన్ని ప్రసాదించగా, ఎడమచేయి తన పాదాలను ఆశ్రయించిన వాడిని అక్కున చేర్చుకుంటాడని అంటారు. పాదాలు కూడా భక్తులను ఉద్ధరించుటకే ఉంటాయి. స్వామివారి రెండు చేతులు, రెండు పాదాలలో ఏదో ఒకటి లభిస్తే ఆ భక్తుడు ధన్యుడు కాగలడు. కాని నాకు మాత్రం ఒకసారి స్వామివారి అభయహస్తం, మరోసారి రెండు పాదాలు, ఇప్పుడు కటిహస్తం లభించాయి. ఈ దీనునిపై స్వామి కృప ఎంత వర్ణించినా సరిపోవడం లేదు. మరియు నాకు ప్రసాదించిన ఈ అనుగ్రహం రాబోవు రోజులలో హరినామక్షేత్రములో సాధకులకు తప్పక లభించగలదని భావిస్తున్నాను.

మొత్తం మీద ఈ లీలతో పరివర్తన చెందాను. ఏదో సాధించడానికి నన్ను ఈవిధంగా చేశాడని, ఆస్తి హరించుకుపోవడం ఇందులో భాగం అని భావించాను. నేను హైదరాబాద్ వచ్చినప్పుడు నా వద్ద ఈ ఆస్తి లేదు. తరువాతి కాలములో స్వామివారు ఈ ఆస్తిని ప్రసాదించి తిరిగి తీసుకెళ్ళే క్రమంలో వారి ఆలింగనాన్ని మిగిల్చి వెళ్ళారని భావించాను. నేనేమీ కోల్పోలేదని తృప్తి చెందాను. ఈ లీలతో ప్రక్కదారి పట్టుచున్న నా మనస్సును తిరిగి తనవైపు త్రిప్పుకున్నాడు. మరియు స్వామివారి సేవను పూర్వంలాగా ఇష్టంగా చేయుట తిరిగి ప్రారంభించాను. కాని... ఎంతో విలువైన ఆస్తి పోయిందని అంతటి ఆస్తిని తిరిగి సంపాదించాలని ప్రయత్నించాను. నా వద్ద ఉన్న డబ్బుతో హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో భూములు కొనడం, తిరిగి అమ్మడం చేశాను. కాని నేను వేసే ప్రతి అడుగు నాకు వ్యతిరేకంగా, ఆర్థిక నష్టం కలిగే విధంగా జరుగుతోంది.

మరోప్రక్క మియాపూర్ స్థలాన్ని కాంప్రమైజ్ చేసిన మధ్యవర్తులకు ముందు నిర్ణయించినంత మొత్తాన్ని ఇచ్చాను. కాని నా మెతకదనాన్ని అలుసుగా తీసుకుని మరిన్ని డబ్బులు కావాలని బలవంతం చేశారు. రకరకాలుగా హింసించారు. ఈ విషయాన్ని కూడా స్వామివారు తన లీలలో ఈ విధంగా చూపారు.

**తేది 22-01-06 కల :** ఎవరో నా వద్ద ఉన్న డబ్బులను లాక్కోవాలని నన్ను తరుముతున్నారు. వారు బలవంతంగా నన్ను ఎక్కడికో తీసుకుపోయారు. నాకు తోడు ఎవరూ లేరు. నన్ను వారు వెనక తరుముతున్నారు. అప్పుడు నేను గట్టిగా "ఓం నమో వేంకటేశాయ" అని లయబద్ధంగా చాలా గట్టిగా, అందరికీ బాగా వినబడేటట్లు రెండుసార్లు అరిచాను. ఇది చూసి వారు 'బాగుంది' అని అక్కడనుండి వెళ్ళిపోయారు. ఇంతే కల. చివరికి గొడవల జీవితం రుచించక ప్రశాంత జీవితం కావాలని భావించి ఈ మధ్యవర్తులకు వారు అడిగినంత ఇచ్చి వారికి దూరమయ్యాను. ఈవిధంగా కూడా కొంత నష్టం జరిగింది.

స్వామివారిని పొందుటకు ఏ చిన్న అవకాశాన్ని వదిలేవాడిని కాను. తేది 08-02-2006 రోజు భీష్మ ఏకాదశి, పోయిన భీష్మ ఏకాదశి నాడు స్వామివారు అనుగ్రహించారు. కాబట్టి ఈ భీష్మ ఏకాదశికి కూడా అనుగ్రహించమని ఒకరోజు ముందు దీనంగా వేడుకున్నాను.

**తేది 08-02-2006 కల : భీష్మ ఏకాదశి :** ఈ కలలో నేను నా మిత్రునితో కలిసి తెలిసిన వారింటికి వెళ్ళాము. వారు వారి మొదటి అంతస్తులో సత్యనారాయణ స్వామి వ్రతం చేసుకుంటున్నారట. మేము ఆ స్వామి ప్రసాదము తీసుకొనుటకు వారింటికి వెళ్ళాము. అయితే స్వామివారి ప్రసాదమును ఇలా తీసుకోకూడదు, ఇలా తీసుకోవాలని నేను వారికి చెప్తున్నాను. ఇంతే కల. స్వామి పూజలను చూడగలిగాను, మరియు ప్రసాదం లభించింది.

## గోవిందుడు నావాడని చెప్పట

శ్రీవేంకటేశ్వరుడు మరో ఆణిముత్యమును ప్రసాదించారు. 2002 సంవత్సరంలో నా మొదటి పుట్టిన రోజు పండుగ సందర్భంగా "సాయిరెడ్డి నావాడు" అని అన్నాడు. ఈరోజు "గోవిందుడు నావాడు" అనే మాటను పలికించాడు. అది కూడా అత్యంత పవిత్రమైన బదరీనాథ్ ఆలయంలో ఆ ఆలయ పూజారిచే ఈ మాట అనిపించాడు. ఒక భక్తునికి ఇంతకంటే మహాభాగ్యం మరోటి ఉండదు. ఆ లీల ఈవిధంగా ఉంది.

ఈ లీల నానిపోయి చదవలేని స్థితిలో ఉంది. ఇది 4 పేజీల పెద్దలీల అయినప్పటికీ, అర్థం చేసుకున్నంత వరకు దీని భావాన్ని క్లుప్తంగా తెలుపుతున్నాను.

**తేది 07-03-06 కల :** ఈ కలలో స్వామివారు నన్ను శ్రీ బదరీనారాయణుని దర్శనార్థమై బదరీనాథ్ కు తీసుకెళ్ళారు. స్వామి దర్శనార్థం అత్యంత ఉత్సాహంగా ఆలయంలోకి



ప్రవేశించాను. ఇంతలో ఎడమ ప్రక్కన చక్కని ఆంజనేయుని ఆలయం కనబడింది. నేను ఆ చిన్న ఆలయం ముందు నిలబడి శ్రీ ఆంజనేయుణ్ణి అత్యంత భక్తి శ్రద్ధలతో అర్చించసాగాను. ఆ ఆంజనేయుని ఆలయంలో ఉత్తర భారతదేశ పూజారి ఒకరు ఉన్నారు. ఆయన పంచె ధరించి చక్కని తిరునామంతో ఉన్నాడు. నేను ఆంజనేయుణ్ణి చూస్తూ చాలాసేపు అక్కడే ఉన్నాను. దీనితో ఆ పూజారి కొంచెం విసుక్కున్నాడు. ఇంతలో నాతో ఇలా అన్నాడు. "నీ గోవిందుడు అక్కడ ఉన్నాడు వెళ్ళు" అంటూ నన్ను గోవిందుని దగ్గరకు పంపాడు. ఇంతే కల. కల చిన్నగా ఉన్నప్పటికీ దీనర్థం విశాలంగా ఉంది. పరవశించిపోయాను. "గోవిందుడు నావాడు" అని నేను మురిసిపోయాను. ఆనాడు దాని భావాన్ని అంతే గ్రహించాను. కాని దాని నిజమైన భావం ఇలా ఉంది. "నీవు గోవిందుని తప్ప ఇతరులను ఆశ్రయించకూడదు, కాలాన్ని వ్యర్థపరచకూడదు. గోవిందుడే నీవాడు, సర్వశక్తిమంతుడు కాబట్టి గోవిందుని మాత్రమే ఆశ్రయించమని" దాని నిజమైన భావమని భావించాను. ఈ లీల ఎందుకు కల్పించాడో రాబోయే కాలంలో తెలుస్తుంది. ఈ కల తరువాత 2 నెలల కాలములో కుటుంబ సమేతంగా బదరీనాథ్ దర్శించాను. కలలో దర్శించినట్లే ఆలయం ఉండటం ఆశ్చర్యాన్ని కలిగించింది.

## స్వామి సేవ యందే మనస్సు నిలపమనుట

నా ఆర్థిక పరిస్థితి రోజు రోజుకు దిగజారిపోతోంది. మంచి తెలివి, ఆలోచనా జ్ఞానం, కష్టించి పనిచేసే స్వభావం ఉన్నప్పటికీ ముందుకు వెళ్ళలేకపోయాను. అపజయాలు, అవమానాలు, నష్టాలతో జీవితం సాగుతోంది. ఫలితంగా తీవ్రంగా అలసిపోయాను. నన్ను నేను పునరాలోచించుకున్నాను.


ఇంతవరకు, రోజులో ఉదయం పూట వ్యాపారంమునందు గడిపి, సాయంత్రం స్వామివారి సేవలో నిమగ్నమయ్యేవాడిని. ఎందుకో గాని నేను స్వామి సేవ ఎంత ఎక్కువ ఇష్టంతో చేస్తే జప పుస్తక వితరణ అంత చక్కగా జరిగేది. లేనట్లైతే కుంటుపడేది. ఆర్థికంగా దిగజారిపోవుట, మానసికంగా అలసిపోవట వలన ఒకరకంగా వ్యాపారం చేయలేని స్థితికి చేరాను. చివరికి అవసరాల నిమిత్తమే వ్యాపారము చేయాలని, ఉన్నదానితో తృప్తి చెందాలని అనుకున్నాను. పూర్వం స్వామివారు ''వ్యాపారం చేయవద్ద''ని చెప్పిన విషయాన్ని గుర్తు తెచ్చుకున్నాను. మాస పత్రిక ప్రారంభించనందుకు ఈవిధంగా జరుగుతోందా? అనే ఆలోచన మొదటిసారి నా మనసుకు వచ్చింది. ఈ ఆలోచనానుసారము ఈ క్రింది లీల చూపాడు.

**తేది 13-03-2006 కల :** ఈరోజు వచ్చిన కలలో వ్రాసిన జప పుస్తకములను వివిధ ప్రాంతాల నుండి సేకరించి వాటిని బండిల్స్ గా కట్టి తిరుపతికి పంపుతున్నాము. ఇంతే కల. దీనర్థాన్ని అప్పుడు గ్రహించలేదు. నిజమైన అర్థం ఈవిధంగా ఉంది. ''నీవు స్వామివారి సేవ యందే పూర్తి సమయమును వినియోగించి, స్వామిని తృప్తి పరుస్తూ జీవించ''మన్నాడు. మిగిలిన విషయాలను పట్టించుకోవద్దన్నాడు.

జీవితంలో చాలా దెబ్బ తిన్నాను కాబట్టి నన్ను నేను ఆత్మ పరిశీలన చేసుకున్నాను. స్వామివారు ఇంతవరకు కల్పించిన అనుభూతుల గురించి, నా మానసిక పరివర్తన గురించి, స్వామి సేవ గురించి ఆలోచించాను. నా ఆర్థిక పరిస్థితి గురించి కూడా ఆలోచించాను. ఇంతవరకు శ్రీవేంకటేశ్వరుడు నావాడని, నేను చెప్పినట్లు వింటాడనే భావం దృఢంగా ఉండేది. ఇప్పుడు స్వామివారు ''నావారు మాత్రమే కాదు'' అనే భావం దృఢపడసాగింది. స్వామి చెప్పినట్లు వింటే ధనము లేకపోయినప్పటికీ మానసిక ప్రశాంతత లభిస్తుంది. స్వామివారి మరిన్ని లీలలను చూసే భాగ్యం లభిస్తుంది. అలా కాదు, నా ఇష్టం అనుకుంటే ధన నష్టంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభించదని అర్థం చేసుకున్నాను. స్వామివారు నన్ను మరో మార్గం లోనికి మార్చుటకు ఈ విధంగా చేస్తున్నారనుకున్నాను. చివరికి ఆయనపై విశ్వాసంతో ఆయన సేవ చేస్తూ జీవించాలనుకున్నాను. స్వామివారు కూడా ఈ క్రింది విధంగా బుజ్జగించారు.

## భుజములపై ఎత్తుకుని బుజ్జగించుట

ఎన్నో రోజుల నుండి మానసికంగా నలిగిపోయాను, చాలా క్షోభను అనుభవించాను. గత కొన్ని రోజుల నుండి చేసిన ఎన్నో లావాదేవీల్లో ప్రతిదానిలో నష్టం రావడం వలన నాకు ఎవ్వరూ లేరు, ఏకాకిననే భావము నాలో బలంగా ఉండేది. చివరికి స్వామివారు కూడా నాకు సహాయం చేయటం లేదని విచారించాను. దినదినం ఆర్థికంగా దిగజారిపోయాను. చాలా




భుజములపై ఎత్తుకొని బుజ్జగించుట

రోజుల నుండి నేను చేసే ప్రతి వ్యవహారం నష్టంతో ముగుస్తుంది కాబట్టి విచార వదనంతో చింతలో ఉన్నాను. దీనిని గమనించిన శ్రీవేంకటేశ్వరుడు తను నాకు ఆత్మీయుడనని, చింతించ వద్దని నన్ను తన భుజములపై ఎత్తుకుని చిన్న పిల్లలను ఆడించినట్లు ఆడించాడు. ఇది ఒక అద్భుతమైన లీల. ఇది నా జీవితంలో మరో ఆణిముత్యం. ఆ లీల ఈవిధంగా ఉంది.

**తేది 06-05-2006 కల :** ఈ లీలలో దృఢకాయుడు, ఆజానుబాహుడైన ఒక వ్యక్తి పంచె కట్టుకుని కనిపించాడు. ఊరిలో వ్యవసాయదారులు ఏవిధంగా ధోవతి ధరించి దానిని బుడ్డగోచి పెట్టుకుంటారో ఈయన కూడా ధోవతి ధరించి దానిని బుడ్డగోచి పెట్టుకున్నాడు. చక్కని నామం ధరించాడు. తలకు రుమాలు చుట్టుకున్నాడు. షర్టు ధరించలేదు. ఆయన నాకు అత్యంత ఆప్తుడట, తండ్రి లాంటి వాడట. నన్ను 6,7 సంవత్సరాల చిన్నపిల్లవాడిగా మార్చి తన భుజములపై ఎక్కించుకున్నాడు. నేను ఆయన భుజములపై కూర్చుని, ఆయన తలను పట్టుకుని ఆనందంగా ఉన్నాను. తరువాత పెద్ద పెద్ద జంగలతో కుప్పిగంతులు వేస్తూ, నన్ను ఉల్లాసపరుస్తూ అది మనదే... ఇది మనదే... అంటూ తిరుగుతూ ఎన్నో భూములను చూపించసాగాడు. ఒక క్షణం ఇవి మా చిన్నగుండవెల్లి మరియు ఇర్కోడు గ్రామముల వద్ద ఉన్న మా భూములుగా కనబడ్డాయి. మనకు చాలా భూములు ఉన్నాయి, భవిష్యత్తులో విలువైనవి అవుతాయనే నమ్మకాన్ని కలిగించాడు. ఇది అంతా మనదేనా? అని నేనడిగాను. ఆయన అవును అని అన్నారు. అందులో కొన్ని

పెద్ద పెద్ద ప్లాట్స్ లాగా ఉన్నాయి. మరియు కొంచెం దూరంలో అక్కడక్కడ ఇళ్ళు ఉన్నాయి. ఈ భూములు భవిష్యత్తులో ఇళ్ళు కట్టడానికి పనికివస్తాయని అన్నాను. ఇంతలో మా ఊరాయన ఒకరు కనబడ్డాడు. అతనిని చూచి అతను మా ఊరిలో మా భూమి ప్రక్కన ఉండే వ్యక్తి అని అన్నాను. నేనన్న ప్రతి మాటను నన్ను ఎత్తుకున్నాయన చాలా ఆప్తుడిగా, నాకు దగ్గరివాడుగా వింటూ నన్ను సంతోష పెట్టడానికి ప్రయత్నించాడు. ఒకరకంగా ఆయన మాకు చుట్టం లాగా ఉన్నారు. నేను ఎంతో ఆనందించాను. నేను ఒంటరిని కాదని, నాకు తోడు ఈ బలవంతుడైన ఆత్మీయుడు ఉన్నాడని కలలోనే మురిసిపోయాను. ఒకరకంగా చిన్నపిల్లలను భుజాలపై ఎత్తుకుని కుప్పిగంతులు వేస్తూ ఆనందపరిచే విధంగా ఈయన చేశాడు. కల చెదిరింది. ఈ కల మొత్తం ఒక పండువెన్నెల రాత్రి జరిగినట్లుగా అనుభూతి చెందాను. దీని ప్రభావం చాలా రోజుల వరకు నాలో ఉన్నది.

దీనర్థం, నీవు ప్రతి లావాదేవిలో నష్టపోయావని, భూములు కోల్పోయావని చింతించ వద్దన్నాడు. మనకు కావలసినన్ని భూములు ఉన్నాయి, మరియు ఆత్మీయుడనైన నేను ఉన్నాను, చింతను వదలమని స్వామివారు చెప్పారు. ఇది ఒక మహా గొప్ప సందేశంగా గుర్తించాను.

## శరణు వేడుట

ఆస్తి నష్టాలతో, అవమానాలతో చాలావరకు మానసికంగా కృంగిపోయాను. చివరికి స్వామివారిని ఈవిధంగా ప్రార్థించాను. "ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! బ్రహ్మహత్యా పాతకము చేసినవారైనా, తమరిని వేడుకుంటే క్షమిస్తారు. అలాంటిది నేను ఏదో ధనాశతో నాలుగు చోట్ల భూములను కొనాలని అడ్వాన్స్ ఇచ్చాను, కాని నా వద్ద డబ్బులు లేక వాటిని కొనలేకపోతున్నాను. కాబట్టి ఇచ్చిన డబ్బులు రావడం లేదు. వారితో గొడవలు వస్తున్నాయి. కొన్నిచోట్ల తిరగబడుతున్నారు. ప్రభూ! నేను చేసింది తప్పు కావచ్చు, ఇప్పుడు నేను మీ శరణు వేడుతున్నాను, జీవితంలో ఇలాంటి తప్పుడు పనులు మళ్ళీ చేయను, అని పదే పదే వేడుకున్నాను. అనుకున్నట్లు ఆ రాత్రి కల కన్నాను.

**తేది 10-05-2006 కల :** ఈ కలలో ఒక నల్లని వైష్ణవస్వామి తిరునామాలతో కనబడ్డాడు. ఆయన నాకోసం దేవునికి పూజ చేస్తున్నాడు. నాకు శుభం జరగాలని ప్రార్థించి హారతి కూడా ఇచ్చాడు. ఈ సన్నివేశం తరువాత మరో సన్నివేశం కనబడింది. అందులో ఒక ఇంటిలో పూర్వకాలంలో చిన్నపిల్లలను పడుకోబెట్టే ఉయ్యాల తొట్టి ఒకటి కనబడింది. ఈ ఉయ్యాల తొట్టి మొత్తం రాతితో చేసింది, నల్లని రంగుతో ఉన్నది. ఈ ఉయ్యాల తొట్టికి మంచి ఆకర్షణీయమైన డిజైన్ ఉన్నది. దీనిమధ్య పసిపిల్లవాడిని పడుకోబెట్టడానికి అనువుగా ఏర్పాటు చేయబడి ఉన్నది. ఆ పసివాడు కాలు పెట్టుకోవడానికి ఇరుప్రక్కలా చక్కని డిజైన్ కలిగిన సపోర్టులు కూడా ఉన్నాయి. వీటిని రాజులు, మహారాజులు మాత్రమే వాడతారనట్లుగా ఉన్నది ఈ తొట్లె. ఇది భూమి నుండి రెండు అడుగుల ఎత్తులో ఉంది. ఇంతే కల. దీనర్థం నేను పశ్చాత్తాపంతో స్వామివారిని ప్రార్థిస్తున్నాను. మరియు ఉయ్యాల తొట్టి అర్థం తెలియదు. పాఠకులు ఎవరైనా తెలిపినచో సంతోషిస్తాను.

## ధనము కోరితే సేవ దొరకదని చెప్పట

గత కొంతకాలంగా ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నాం కాబట్టి, మా ఆర్థిక స్థితిగతులు బాగుండాలని నా భార్య సురేఖ తేది 10-05-2006 నుండి స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తోంది. ఆమెకు కూడా ఇదే రోజు స్వామి అనుగ్రహం ఈ క్రిందివిధంగా లభించింది.

**తేది 10-05-2006 కల :** ఇది సురేఖకు వచ్చిన కల. ఈ కలలో స్వామివారు శుక్రవారం అభిషేకం తరువాత వారి రూపం ఏవిధంగా ఉంటుందో అదేవిధంగా, కాని కేవలం ఆయన నడుము వరకు కనబడ్డారట. మరియు ఆభరణాలు ధరించి చాలా నల్లని ఆకారంతో కనబడ్డారట. ఇంతే కల. దీనర్థం అప్పుడు మేము గ్రహించలేదు. స్వామివారి పాదాలు కనబడలేదు కాబట్టి, మీరు ధనాన్ని ఆశించినట్లైతే సేవ దొరకదని చెప్పారు.

## జపాలు చేయుట

మరోప్రక్క మా ఆర్థిక ఇబ్బందులు తీరాలని, నాకు గురుబలము తక్కువగా ఉన్నదని మా ఆఫీసులో పనిచేసే శ్రీ పాండురంగారావు కొందరి బ్రాహ్మణుల సహాయంతో ప్రత్యేక పూజలు చేయ ప్రారంభించారు. ఆ ఫలితమును నాకు ఇస్తున్నారు. నిజానికి ఈ జపాన్ని నన్నే చేయమన్నారు. కాని నేను శ్రీవేంకటేశ్వరుని నామం బదులు ఇతర నామమును స్మరించను కాబట్టి నా బదులు వారు చేస్తున్నారు. స్వామినే ప్రార్థించాలని నేను చెప్పినప్పటికీ వినక నా భార్య అనుమతితో వారు ఇతర జపాలను చేసి ఫలితాలను నాకు ధారపోస్తున్నారు. నేను మాత్రం ఇదంతా స్వామివారి లీలయే అని మనకు ధననష్టము కలుగుట, వ్యాపారము చేయలేని స్థితి ఏర్పడుట స్వామి లీలలోని ఒక భాగమని చెప్పినప్పటికీ వినక వారు ఇలా చేస్తున్నారు. భగవంతునికి సేవ చేస్తే ఆర్థిక వృద్ధి లభిస్తుందని వారి నమ్మకం. మొత్తం మీద పరిస్థితులు చాలా విచారకరంగా ఉన్నాయి.

## స్వామి పట్ల ప్రేమ

ఇంత కఠినాతి కఠినమైన పరిస్థితుల్లో కూడా స్వామివారంటే నాకెంతో ప్రాణం. నన్ను తిట్టినా పడతాను కాని, స్వామివారిని కించిత్తు మాట అన్నా, తక్కువచేసి చూపినా సహించలేను. ఆ సమయంలో వారిని ఏమైనా చేయాలనే కోపం వచ్చేది. ఇలాంటి


సందర్భం ఒకటి నా జీవితంలో ఎదురైంది. తిరుమల తిరుపతి దేవస్థానములకు ఈ.ఓగా పనిచేసి ఎన్నో అనుభూతులను పొందిన కీ.శే. పి.వి.ఆర్.కె.ప్రసాద్ గారిని ఒక సమయంలో కొట్టబోయాను. కాని స్వామి కృపతో నేరం నుండి బయటపడ్డాను. ఆ లీల ఈవిధంగా ఉంది.

ఈ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సందర్భంలో నేను ఎక్స్ ఈ.ఓ కీ.శే. పి.వి.ఆర్.కె.ప్రసాద్ గారిని కలిశాను. నా సమస్యలను, అంటే ఆర్థిక సమస్యలతో పాటు స్వామివారు ఆదేశించిన మాసపత్రిక గురించి చెప్పాను. మరియు నేను పొందిన అనుభూతుల కాపీలను వారికిచ్చాను. వారు ఒక వారం తరువాత ఈ విధమైన జవాబిచ్చారు.

''నీవు చేసే వ్యాపారానికి మరియు స్వామి సేవకు ముడి పెట్టవద్దు. ఆయనను ఇది కావాలని అడగకూడదు. నీకు ఏది కావాలో ఆయనే ఇస్తారు. ఆయన నీవెంట ఉన్నారని నీవు భావించినచో ఈ ఆర్థిక ఇబ్బందులకు, సమస్యలకు భయపడకు. ఆయనకు సేవ చేస్తూ వెళ్ళమన్నారు. మరియు 'నమో వేంకటేశాయ' మాస పత్రికను 3-4 పేజీలతో చిన్నగా ప్రారంభించమన్నారు. ఇతర సమస్యలను పట్టించుకోవద్దు''ని చెప్పారు. ఈ మొత్తం సలహాను విన్న నేను సంతోషించాను. కాని స్వామివారు స్వయంగా ఆదేశించిన 'నమో వేంకటేశాయ'ను కేవలం 3-4 పేజీలతో ప్రచురించమనే మాట వినగానే విపరీతమైన కోపం వచ్చింది. తట్టుకోలేకపోయాను. శరీరం రగిలిపోయింది. ప్రక్కన రాయి ఉంటే వారి తల పైన కొట్టేవాణ్ణి. ఆ గదిలో తలుపులు పడకుండా అడ్డుగా పెట్టే రాయి కోసం చూశాను కూడా. కాని రాయి దొరకనందున స్వామి వారికి కృతజ్ఞతలను తెలిపాను. ఎందుకంటే ఈ స్థితిలో కూడా శ్రీవేంకటేశ్వరుడంటే అమితమైన అభిమానం. ఆయనను చిన్నతనం చేసి మాట్లాడటం సహించలేను. 'నమో వేంకటేశాయ'ను మామూలు మ్యాగజైన్ సైజ్ కాకుండా 3-4 పేజీలతో చిన్నగా ప్రారంభించటం – స్వామివారికి చిన్నతనంగా భావించాను. కాబట్టి కోపం ముంచుకొచ్చింది. నిజానికి కీ.శే ప్రసాద్ గారు చెప్పినదానిలో తప్పేమీ లేదు. నేను ఆర్థికంగా చాలా చితికిపోయాను. మరోప్రక్క పత్రిక ప్రారంభించే స్థితిలో లేను, కాబట్టి అలా చిన్నగా ప్రారంభించమన్నారు. కాని స్వామివారిపై నాకున్న సేవక భావం అలా కోపాన్ని తెప్పించింది.

## పైకి ఎదగకుండా అడ్డుకుంటున్నట్లు చూపుట

నేను అత్యాశకు పోయాను, నష్టపోతున్నాను, ఇతరులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, రక్షించమని స్వామివారిని పదే పదే ప్రార్థించాను. కాని స్వామివారు ఒకప్రక్క నా ప్రార్థనను విన్నట్లే అనుగ్రహించేవారు. కాని పరిస్థితులు



యథావిధిగా ఉండేవి. ఈ విధమైన బాధలతో నా మూలంలో మార్పు జరిగినప్పుడు మాత్రమే తన పట్టును సడలించేవారు. అంతవరకు ఎంత ప్రార్థించినప్పటికీ లాభం ఉండేది కాదు. గత కొన్ని రోజులనుండి ఉన్న మొత్తం నా పరిస్థితిని ఒక లీల ద్వారా చూపాడు. ఈ లీల ఆ రోజులలో నాకు అర్థం కాలేదు. కాని దీని అసలైన అర్థం – నేను ఆర్థికంగా పైకి ఎదగాలని చూస్తున్నాను. కాని స్వామివారు నన్ను పైకి ఎదగనీయకుండా క్రిందనే ఉండమని సూచిస్తున్నారు. ఈ అద్భుతమైన లీల ఈవిధంగా ఉంది.

**తేది 01-07-2006 కల :** ఈ కలలో నేనొక పెద్ద గుట్టను చూచాను. ఆ గుట్టపైన నాకు తెలిసిన వారు ఉన్నారట. నేను వారి వద్దకు పోవాలని ఈ గుట్టను ఎక్కుతున్నాను. కాని ఎవరో ఈ గుట్టను పైనుండి బ్లాస్ట్ చేస్తున్నారు. దాని ఫలితంగా పైనున్న పెద్ద పెద్ద బండ రాళ్ళు దొర్లుతూ క్రిందికి జారి పడుతున్నాయి. నా మార్గానికి అడ్డు వస్తున్నాయి. నేను పైకి ఎక్కలేకపోతున్నాను. ఆ పడుతున్న పెద్ద పెద్ద రాళ్ళు రోడ్డుపై మరియు మనుష్యులపై పడుతున్నాయి. నేను ఈ పడుతున్న రాళ్ళను చూస్తూ, తప్పించుకుంటూ పైకి ఎక్కడానికి ప్రయత్నిస్తున్నాను. ఈ గుట్టను పూర్తిగా తొలిచి, నేలమట్టం చేయటం ఈ బ్లాస్ట్ చేసేవారి ఉద్దేశ్యంగా కనబడింది. కల చెదిరింది. ఇది స్వామివారు చూపిన విధానము. నేను పైకి ఎక్కుతున్నాను అంటే ఆర్థికంగా ఎదగాలనే భావనతో పైకి ఎక్కడానికి ప్రయత్నం. కాని స్వామివారు నన్ను క్రిందనే ఉండమన్నట్లు చేస్తున్నారని దీనర్థం.

## 4వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

వచ్చే గోకులాష్టమి (తేది 16-08-2006) సందర్భంగా స్వామివారికి 4వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ కొరకు తేది 27-07-2006 నాడు హబ్సిగూడ లోని మా ఇంటినుండి 'నమో వేంకటేశాయ' రథయాత్ర ప్రారంభించాము. పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థాన్ పీఠాధిపతులు జగద్గురు శ్రీశ్రీశ్రీ మదభినవోద్దండ విద్యానృసింహ భారతీస్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణ మరియు మంగళా శాసనములతో, శ్రీ అజయ్ కళ్ళాం, ఐఎఎస్, ఎక్స్ ఈఓ టిటిడి గారు మొదటి క్రతువు సమర్పించగా ఈ కార్యక్రమము మొదలైంది. హైదరాబాద్ లో తిరిగిన తరువాత విశాఖపట్నం, అన్నవరం, భీమవరం, పిడుగురాళ్ళ, ఒంగోలు, నెల్లూరు మీదుగా తేది 14-08-2006నాడు తిరుపతి చేరాము. ఈ రథయాత్రలో ఎంతో ఆనందించాము, తిరుపతి చేరేవరకు నాకున్న సమస్తము పోయినా చలించని పరివర్తన కలిగింది.

తేది 15-08-2006 నాడు పద్మావతీ అమ్మవారిని దర్శించాము. మరియు సాయంత్రం అలిపిరి వద్ద జపమును స్వామివారి పాదాలకు సమర్పించి పూజించాము. ఆ తరువాత తేది 16-08-2006 గోకులాష్టమి నాడు తిరుమల తిరుపతి దేవస్థానపు డైరీఫామ్ లో శ్రీవేంకటేశ్వర మహామంత్ర యజ్ఞం, జపానికి ప్రత్యేక పూజలు చేశాము. అప్పటి టిటిడి ఈ.ఓ శ్రీమాన్ ఎ.పి.వి.ఎన్ శర్మగారు యజ్ఞ పూర్ణాహుతి చేసి జపమును స్వామివారికి సమర్పించారు. మరియు పంచమ పర్యాయంగా 7 కోట్ల జపమును ప్రారంభించారు. జప సమర్పణ చాలా తృప్తిగా జరిగింది. ప్రతి పర్యాయం లాగానే అలిపిరి వద్ద పూజ సందర్భంలో మూలమూర్తిని, జప సమర్పణ సమయంలో ఆయన పాదాలను దర్శించాను. ఆ తరువాత కొండకు వెళ్ళి స్వామివారిని దర్శించుకొని తిరిగి హైదరాబాద్ వచ్చాము.

ప్రతి రథయాత్ర సందర్భంగా ఏదో ఒక స్వామి లీల తప్పక చూస్తుంటాము. ఈసారి కూడా రెండు లీలలు ప్రసాదించారు. అందులో ఒకటి నా భార్య సురేఖ, మరొకటి ఒక భక్తుడు రమేష్ పొందారు. ఆ లీలలు ఈ విధంగా ఉన్నాయి.

## తేనె నైవేద్యాన్ని గుర్తు చేయుట

గతంలో స్వామివారు కల్పించిన ఒక లీలా విశేషం చేత నేను రథయాత్రలో బయటి ప్రాంతాలలో తిరిగేటప్పుడు, సురేఖ ఒంటరిగా ఇంట్లో ఉన్నప్పటికీ ఆనందంగా ఉండేది. ఆమె నేను ఇంట్లో లేనప్పుడు మాత్రమే స్వామివారిని నేను పూజించునట్లు పూజించేది. తేది 07-08-2006 నాడు రథమును త్రిప్పటానికి వైజాగ్ మొదలైన ప్రాంతాలకు వెళ్ళాను. అప్పుడు సురేఖ నా బదులు ఇంట్లో నేను చేస్తున్నట్లే పూలు, తులసి సమర్పించి, హారతి ఇచ్చి పూజ చేసింది. కాని నేను పెట్టినట్లు తేనెను నైవేద్యం పెట్టుట మరిచిపోతుంది. ఒక రెండు మూడు రోజుల తరువాత ఆమెకి ఈ క్రిందివిధమైన కల వచ్చింది.

కల : ఇది సురేఖకు వచ్చిన కల. ఈ కలలో నేను, సురేఖ మా పిల్లలతో కలిసి చాలామంది వనభోజనానికని ఒక వనానికి వెళ్ళామట. ఆ వనంలో పచ్చిక బయళ్ళు, చాలా చెట్లు, పక్షులు ఉన్నాయి. అందులో ఒక చెట్టు కొమ్మకు చాలా పెద్ద తేనెపట్టు



చెట్టు నుంచి తేనె కారుట

ఉంది. కాని తేనెటీగలు మాత్రం లేవు. ఆ తేనెపట్టు నుండి తేనె దానంతటదే క్రిందికి ఒక పెద్ద ధారగా కారుతోందట. క్రింద భూమిపైన ఈ తేనె పారుతోందట. ఈ తేనె ధార అదేవిధంగా నిర్విరామంగా ఒక్క తేనెటీగ ఆ గూడుపై లేకపోయినా కారుతోందట. ఈమెతో పాటు అక్కడ ఉన్న కొందరు ఈ చిత్రాన్ని చూసి ఆశ్చర్యపోయారట. ఇంత పెద్ద మొత్తం తేనె, ఎవరూ పిండనప్పటికీ ఏవిధంగా కారుతోందని చూస్తున్నారు. ఇంతలో కల చెదిరింది. వెంటనే ఈమెకు స్వామి పూజలో తేనె నైవేద్యమును మరచానని గ్రహించింది. అప్పటినుండి తేనెను నైవేద్యంగా పెట్టడం ప్రారంభించింది. ఈవిధంగా మేము తెలియక చేసే తప్పులను స్వామివారు సరి చేసేవారు.

## భక్తుల స్వప్నాలు

స్వామి సేవ నేనొక్కడినే కాకుండా ఆసక్తి గల భక్తులందరూ చేయాలనే కోరిక నాకుండేది. ప్రతి భక్తుణ్ణి మాలాగా వారి శక్తి మేర ప్రతి సంవత్సరం కొన్ని జప పుస్తకములను వితరణ చేసి తిరిగి వాటిని సేకరించి మాకు అప్పగించునట్లు సంకల్పం తీసుకోమని ప్రోత్సహించేవాడిని. స్వామివారి ఈ రకమైన ప్రేరణతో ఎంతోమంది భక్తులు సంకల్పాలు తీసుకుని నాకు సహకరించేవారు. వారికి కూడా స్వామివారు ఎన్నో అనుభూతులను ప్రసాదించేవారు. శ్రీమాన్ తుకారాం మరియు శ్రీమాన్ రమేష్ అనే ఇద్దరు భక్తులు నేను జపసమర్పణ ప్రారంభించినప్పటినుండి నా వెనక ఉన్నారు. మంచి భక్తులు. వారికి తోచిన స్వామిసేవ చేసేవారు. ఒకరకంగా వారిద్దరినీ నాకు సహాయకులుగా స్వామివారు నియమించారని ఈ క్రింది లీలల ద్వారా తెలుసుకోగలం.

రమేష్ అనే భక్తుడు మేము పీఠం ప్రారంభించినప్పటినుండి మా వెంట ఉన్నారు. ఈయన ప్రతిసారీ రథముతో తిరుపతికి వచ్చేవాడు. కాని పోయిన సంవత్సరం 2005 లో తిరుపతిలో అతను అంత సంతోషంగా ఉన్నట్లు కనిపించలేదు. తరువాత కూడా ఈ పీఠానికి ఎక్కువసార్లు రాలేదు. ఎందుకో ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నాడని భావించాను. కాని జులై 2006లో అతనికి ఒక కల వచ్చింది. ఆ కలలో నేను అతనికి ఫోన్ చేసి "ఏం రమేష్, ఈసారి నువ్వు తిరుపతికి రావడం లేదా?" అని అడిగానట. దానికతను బదులిస్తూ "ఆ వస్తున్నా సార్" అని నాతో చెప్పాడట. ఇది అతని కల. అయితే ఈసారి నమో వేంకటేశాయ రథం తేది 27-07-2006 నాడు మా ఇంటినుండి ప్రారంభమైంది. రథయాత్రలో మొత్తం ఏడుగురముంటే ఏ లోటు లేకుండా యాత్ర చక్కగా జరుగుతుంది. కాని మేము ఆరుగురమే ఉన్నాము, మరియు ఈసారి దూర ప్రాంతం విశాఖకు వెళ్ళాలి కాబట్టి మొత్తం ఏడుగురం ఉండే విధంగా ఒక బయటి వ్యక్తిని నియమించుకున్నాము. మేము తేది 06-08-2006 నాడు విశాఖ వెళ్ళుటకు నిర్ణయించుకున్నాము. అయితే ఈ ప్రత్యేకంగా నియమించుకున్న వ్యక్తి విశాఖకు బయలుదేరే రోజు ఈ రథ యాత్ర పని నచ్చక రానన్నాడు. దానితో రథయాత్రకు ఇబ్బందైంది. నాతో కలిపి ఏడుగురం ఉండాలి. అప్పుడే యాత్ర బాగుంటుంది. ఈ క్రొత్త వ్యక్తిని మాట్లాడాం కాబట్టి ఈసారి రమేష్‌ని పలకరించలేదు. అందుకని అతను సిద్ధం కాలేదు. చివరికి తేది 06-08-2006 ఉదయం రమేష్ కు ఫోన్ చేశాను. కాని ఫోన్ ఆఫ్ లో ఉంది. చివరికి ఉదయం 7 గంటలకు కలిసింది. వెంటనే నేను "ఏం రమేష్ ఈసారి నువ్వు తిరుపతికి రావటం లేదా?" అని అతనికి కలలో వచ్చిన విధంగానే మాట్లాడాను. దానికతను "ఆ వస్తున్నా సార్" అని వెంటనే తయారై మాతో వచ్చాడు. ఈ విధంగా స్వామివారి లీల ద్వారా రథయాత్ర ఎలాంటి ఇబ్బంది లేకుండా చక్కగా జరిగింది. ఇవి ఈ రథయాత్రలో జరిగిన లీలలు. ఇక మరో భక్తుడు శ్రీమాన్ తుకారాం గారి లీల ఈవిధంగా ఉంది.

శ్రీమాన్ తుకారాం : ఈయన 58 సంవత్సరాల పై వయసు కలవారు. రైల్వేలో చిన్న ఉద్యోగి. ఈయన ప్రతి సంవత్సరం మా నుండి కొన్నివేల పుస్తకాలను తీసుకొనిపోయి, మౌలాలి, ఏఎస్ రావ్ నగర్ తదితర ప్రాంతాలలోని స్వామివారి ఆలయాల వద్ద భక్తులకు పంచి, తిరిగి వాటిని సేకరించి మాకు ఇచ్చేవారు. చాలా ఎక్కువ మొత్తం సేవ చేయాలనుకున్నారు. కాని అనుకోకుండా ఒకరోజు ఈ సేవను చాలించాలనుకున్నాడు. అప్పుడు స్వామివారు ఒక చక్కని అనుభూతిని కలిగించి ఈ సేవను కొనసాగించేలా చేశాడు. ఆ లీల ఈవిధంగా ఉంది.

జులై 2006 కల : ఈ కలలో శ్రీమాన్ తుకారాం గారు ఒక స్థలములో గొయ్యి త్రవ్వుతున్నారట. అయితే ఆ గొయ్యి నుండి నీటికి బదులుగా అన్నీ వ్రాసిన స్వామి జప పుస్తకాలు ఊరుతున్నాయట. ఆయన వాటిని తీయగా ఇంకా పుస్తకాలు వస్తున్నాయట. వాటిని తీసి నాకు ఇస్తున్నారట. కాని ఎన్ని తీసినా, ఎన్నిసార్లు నాకు ఇచ్చినా ఇంకా ఆ పుస్తకములు వస్తూనే ఉన్నాయట. ఇది ఆయన కల. అంటే స్వామివారు ఈ కార్యక్రమములో ఆయనను వినియోగించుకుంటున్నారు. నాకు సహాయం చేయమని ఆయనకు ఆజ్ఞ ఇచ్చారని భావించాను. ఈ విధంగా స్వామివారు మా కార్యక్రమానికి తన భక్తులచే సహాయం అందించేవారు.

వీరే కాకుండా కొన్ని వేల మంది భక్తులకు కలలో కనబడి తన జపాన్ని ప్రోత్సహించేవారు. కొందరు భక్తులు జప పుస్తకములను తీసుకువెళ్ళి వ్రాయడం మరిచిపోయేవారు. ఆ సందర్భంలో జపం వ్రాయడం మరచావని వారికి కలలో గుర్తుకు తెచ్చి, వారి చేత వ్రాయించేవారు. ఇలా ఎంతోమంది భక్తులు తమ అనుభూతులను చెప్పి ఆనందించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. మొత్తం మీద ఈ జప సమర్పణ కార్యక్రమములో పైకి మాత్రమే నేను కనబడతాను తప్ప మొత్తం స్వామివారే చేసిపెట్టేవారు.

## డబ్బును ఖర్చు చేయించుట

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు, నా ఆర్థిక స్థితి దిగజార్చడమే లక్ష్యంగా రకరకాల పరిస్థితులను కల్పించేవాడు. ఫలితంగా రోజు రోజుకూ నేను దిగజారిపోయాను. అందులో ఒకటి ఇలా ఉంది.

స్వామివారు నాకు హబ్సిగూడ కాకతీయ నగర్ లో ఇంటి స్థలమును ప్రసాదించారు. స్వామివారు ప్రసాదించారు కావున ఇల్లు చిన్నగా ఉండకూడదనే భావమేర్పడింది. చిన్న కుటుంబం అయినప్పటికీ మూడు అంతస్థుల పెద్ద ఇల్లును నిర్మించుకున్నాను. మరియు ఈ ఇంటికి శ్రీవేంకటేశ్వర ప్రసాదం అని పేరు పెట్టుకున్నాను. నిజం చెప్పాలంటే ఇల్లు పూర్తయ్యేంత వరకు ఈ ఇల్లు పెద్దదన్న భావం నాకు కలగలేదు. మరియు ఆ ఇంటి నిర్మాణపు ప్లాన్ విషయంలో మా ఆర్కిటెక్ట్ ఎన్నో చక్కటి ప్లాన్స్ చూపెట్టాడు. కాని ఆరోజు నాకవి నచ్చలేదు. చివరికి నా ఆలోచన ప్రకారం ప్లాన్ తయారు చేసి ఇల్లు నిర్మించుకున్నాం. కాని ఆ ఇంట్లోకి వెళ్ళిన తరువాత ఆ ప్లాన్ నచ్చలేదు. అసౌకర్యంగా ఉంది. దీనికి తోడు అన్నీ అపజయాలే కలుగసాగాయి. ఒక దశలో ఈ ఇంటిని అమ్మేయాలనుకున్నాను. కాని ఇంత మంచి స్థలం, పైగా స్వామివారు ప్రసాదించింది కాబట్టి మళ్ళీ దొరకదని బాధపడ్డాను. చివరికి ఈ ఇంటికి మార్పు చేయాలనే ఆలోచన వచ్చింది. ఈ ఆలోచనే స్వామివారి ఈ క్రింది లీల.

తేది 08-09-2006 కల : నేను మరియు మా కుటుంబ సభ్యులు ఒక పాత ఇంటిని రినోవేషన్ చేసి (క్రొత్తగా చేసి) అందులోకి పోదామని భావించి దానికోసం చూస్తున్నాము. అది ఒక వీధిలో చివరి ఇల్లు (మా ఇల్లు లాగానే) ఒక ప్రక్కకు తిరిగేసరికి ఇంటి ముఖద్వారమున్నది. ఈ ద్వారం గుండా లోనికి వెళ్ళేసరికి 'ఎల్' ఆకారంలో హాల్ ఉన్నది. మరియు ఈ ఇల్లు చాలా బాగుంది. నాకు బాగా నచ్చింది. ఇల్లు అంటే ''ఇలా ఉండాలి'' అని కలలోనే అనుకున్నాను. ఈ ఇల్లు అన్నివిధాలుగా బాగుందనిపించింది. ఇంతే కల.

ఇలా ఈ కల వచ్చిన తరువాత, ఇలాంటి ఎల్ ఆకారపు హాల్ ఉండేలా మా ఇంటిని రినోవేషన్ చేశాను. ఈ రినోవేషన్, క్రింది ఫ్లోర్ ఒకసారి, మొదటి అంతస్తు మరోసారి చేశాము. ఫలితంగా నా వద్ద ఉన్న ధనాన్ని మరింత వెచ్చించటం జరిగింది. ఇలా నా వద్ద ఉన్న ధనాన్ని హరించివేయడం అనే స్వామివారి కోరిక నెరవేరింది.

నా దశ : తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆలింగనం లభించింది. మరియు నేనంటే ఎంతో ఇష్టం అని చెప్పారు. దీనితో పాటు గోవిందుడు నావాడని విని మురిసిపోయాను. చిన్నపిల్లలను ఆడించినట్లు స్వామివారు నన్ను తన భుజములపై ఆడించారు. నా తప్పులను క్షమించమని చేసిన ప్రార్థనను స్వామివారు స్వీకరించారు.

భాగవత ఆశీర్వాదము : తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
గోవిందదాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)
ఇ.నెం.1-1-53, వీధి నెం.1. హబ్సిగూడ,
హైదరాబాద్. ఫోన్: 040-27175050

తిరుమల శ్రీ వేంకటేశ్వరుని
దిశానిర్దేశము



స్వామివారి 700 దివ్యలీలలు
మొదటి సంపుటము
తెలుగు మరియు ఇంగ్లీష్ భాషలలో లభించును.
12 భాగాలు కల
పుస్తకము ధర : 250/-
ప్రచురణ: శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం
గోవింద దాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)
ఇ.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సిగూడ, హైదరాబాద్ - 500 007.
ఫోన్: 040-27175050 (10.00 am to 6.30pm)
website: srivenkatesham.org, mail: srivenkatesham@gmil.com
పై అడ్రస్ నుండి పుస్తకమును పొందవచ్చును. లేదా... పోస్టు / కొరియర్ ద్వారా పొందగోరువారు పుస్తకము ధరతో పాటు రూ. 50/- రిజిస్టర్ పోస్టు / కొరియర్ కొరకు కలిపి మొత్తం రూ. 300/- ఫోన్ పే, గూగుల్ పే, పేటిఎం ద్వారా 93482 12354 నంబర్‌కు పంపగలరు. మరియు మీ అడ్రస్‌ను ఇదే నంబర్‌కు వాట్సప్ / మెసేజ్ ద్వారా పంపి పొందవచ్చును.
శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం, హైదరాబాద్

ధారావాహికం



# మహాభారతంలోని మహోపాఖ్యానాలు

- డా॥ పులిగడ్డ విజయలక్ష్మి

గత సంచిక తరువాయి

## ఆస్తీకుడు

సూత మహర్షి వేదికను సమీపించగానే అంతకుముందే అక్కడకు వచ్చి ఉన్న శౌనకాది మునులందరూ లేచి నమస్కరించి తమ తమ ఆసనాలలో కూర్చున్నారు. వారినందరినీ ఆశీర్వదించి ఆనాడు చెప్పదలచుకున్న విషయాన్ని చెప్పడం ప్రారంభించాడు. ''నాయనలారా! నేడు 'ఆస్తీకుడ'నే గొప్ప మహర్షి గురించి చెబుతాను. గొప్ప అని ఎందుకన్నానంటే ఆయన మంత్ర శాస్త్రవేత్తలలో అగ్రగణ్యుడు. ఎంతటి కష్టకార్యాన్ని అయినా క్షణమాత్రంలో నెరవేర్చగలడు'' అన్న సూతుని వైపు మునులందరూ ఆశ్చర్యంగా చూశారు. "ఇంకో విషయం. ఆస్తీకుని గురించి చెప్పేటప్పుడు ముందుగా ఆయన జన్మకు కారణభూతులైన తల్లితండ్రుల గురించి కూడా చెప్పుకోవాలి. వాళ్ళెంత మహిమోపేతులో కూడా తెలుసుకోవడం చాలా ముఖ్యం'' అని క్షణం ఆగాడు సూత మహర్షి. శ్రోతలలోని శ్రద్ధ చూసి మళ్ళీ చెప్పసాగాడు.

''మునులారా!

"పరమ తపోనిధి, యా యా
వర వంశోత్తముడు, నియమవంతుడు, లోకో
త్తరుడు, జరత్కారుడు నాఁ
బరగిన మునీ బ్రహ్మచర్య పరిపాలకుడై"

**–137 ప – ద్వితీయాశ్వాసము – మహాభారతము – నన్నయభట్టు**

''యా యావర వంశంలో జన్మించిన ఉత్తముడు. గొప్పదైన తపస్సుకు నిధి వంటి వాడు, సమస్త నియమాలను శ్రద్ధగా పాటించేవాడు. లోకోత్తరుడు అయిన బ్రహ్మజ్ఞాన సంపన్నుడు – 'జరత్కారుడ'నే మహర్షి. బ్రహ్మచర్య వ్రతనిష్ఠలో నిమగ్నుడై జీవితాన్ని తపశ్చర్య కంకితం చేయాలని నిశ్చయించిన మహానుభావుడు జరత్కారుడు. వివాహమాడి భార్యను పరిగ్రహించడానికి ఇష్టపడలేదు. సంసారి అయితే తిరిగి జన్మ ఎత్తవలసి వస్తుందేమో అన్న భయంతో వ్యామోహాలన్నిటినీ వదిలించుకుని వేదాధ్యయనంలో, తపస్సులో కాలం గడుపుతుండేవాడు. ఒకనాడు అడవిలో తిరుగుతుండగా ఆయన కంటికి నీటి పడియ ఒకటి కనిపించింది (నీళ్ళు నిలిచిన పల్లపు ప్రదేశము). అందులో ఎలుకలు కొరకగా ఒక్క వేరు

మాత్రమే మిగిలి ఉండటం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆ వేరును పట్టుకుని తలక్రిందుగా వ్రేలాడుతున్న ఋషులు కనిపించడంతో జరత్కారుకు మరింత ఆశ్చర్యం కలిగింది. వారి దగ్గరకు వెళ్ళి "ఇది తపస్సులో ఒక ప్రత్యేక విధమా? దీనిని ఏ తపస్సంటారు? నాకు కూడా చెప్పండి. నేనూ చేస్తాను" అని అడిగాడు. వాళ్ళు దానికి – "మహాత్మా! ఇది తపస్సు కాదు. మేము ఆపుకోలేని దుఃఖంతో అధమ లోకానికి వెళ్ళడానికి ఇలా వ్రేలాడుతున్నాము. మీకే కష్టం వచ్చిందంటావేమో – మా తరవాతి తరం వాడైన జరత్కారుడు వివాహం చేసుకోకుండా ఉన్నాడు. మేమాతని పితృ పితామహులము. అతనికి సంతానం కలిగితే కాని మాకు ఊర్ధ్వగతి ప్రాప్తించదు. జరత్కారుడికి సంతానం కలగకపోతే ఈ ఒక్కవేరూ కూడా తెగిపోతుంది. అప్పుడు మేము అధో లోకాలలో పడతాం. అదీ మా దుఃఖానికి గల కారణం. అయ్యా! నీకు గనుక జరత్కారుడు కనిపిస్తే మా అవస్థ అతనికి తెలియజెప్పి మమ్మల్ని ఆదుకోమని చెప్పు" అని తెలియజేయటంతో తానే వారి కష్టానికి కారకుడని అర్థం చేసుకున్నాడు జరత్కారుడు. అతనిలో దయ కలిగింది. సంతానం పొందటానికి వివాహం చేసుకోవటం తప్పనిసరి అని నిశ్చయించుకున్నాడు. "మహానుభావులారా! నేనే ఆ జరత్కారుడిని. మీరు నా తండ్రి తాతలు. ఇంతకాలం నాకు పెండ్లి చేసుకోవాలనే తలంపు కలగలేదు. మిమ్మల్ని ఈవిధంగా చూసిన తరువాత ధర్మగుణాన్ని తప్పానేమో అని అనిపించింది. తప్పక వివాహమాడతాను. మీ మాట నెరవేరుస్తాను" అని అంటూ వారికి నమస్కరించాడు. జరత్కారుని నిర్ణయానికి ఆతని పితృదేవతలు ఎంతగానో సంతోషించారు. ఏది ధర్మమో ఆతనికి తెలియజెప్పారు.

**"తగియెడు పుత్రులంబడసి, ధర్మువు దప్పక, తమ్ము నుత్తముల్**
**పొగడగ మన్నహా మతులు పొందు గతుల్ కడు ఘోర నిష్ఠతోఁ**
**దగిలి తపంబు సేసియును, దక్షిణలిమ్ముగ నిచ్చి యజ్ఞముల్**
**నెగడగ జేసి యుం, బడయనేరరపుత్రకులైన దుర్మతుల్"**

**–ప.148 – ద్వితీయాశ్వాసము – ఆదిపర్వము – మహాభారతము**

"జరత్కారూ! నీకు ఒక విషయం చెబుతాము. జాగ్రత్తగా విను. సన్మార్గ ప్రవర్తకులైన పుత్రులను కలిగి, ధర్మమార్గాన్ని అనుసరించే బుద్ధిమంతులు ఉత్తమ పురుషులు. అటువంటి వారిని సజ్జనులు పొగుడుతారు. అలాంటి బుద్ధిమంతులు ఉత్తమ లోకాలు పొందుతారు. కాని ఘోరాతి ఘోరమైన తపస్సు ఎంత నిష్ఠతో చేసినా, గొప్ప గొప్ప దక్షిణలిచ్చి యజ్ఞాల నెన్నిటినో చేసినా, పుత్రులను పొందని దుర్మతులు ఉత్తమగతులను పొందలేరు. వారు అధోగతులలో పడిపోవలసిందే. కనుక నీవు పెళ్ళి చేసుకుని, పుత్రులను పొంది, ఉత్తమ గతిని పొందగలగడమే కాక మమ్మల్ని కూడా ఊర్ధ్వలోక గతులనుగా చేయి" అని అంటున్న పితృదేవతలకు మరొక్కసారి నమస్కరించాడు జరత్కారుడు.

"తండ్రులారా! మీరు చెప్పినట్లే చేస్తాను. కాకపోతే నా పేరైన 'జరత్కారు' అనే పేరునే కలిగిన వధువును (సనామ్ని అయిన కన్యను) చూసి పెండ్లాడుతాను. మీ కోరిక తప్పక తీరుస్తాను" అని చెప్పి జరత్కారుడు అటువంటి కన్యకోసం వెదకసాగాడు.

చారుల వల్ల జరత్కారు మహర్షి వివాహేచ్ఛను విన్న నాగరాజయిన వాసుకి జరత్కారు పేరుతో విరాజిల్లుతున్న తన చెల్లెలిని తీసుకొని ఆ మహర్షి వద్దకు వెళ్ళి "నా చెల్లెలి పేరు కూడా జరత్కారే. ఈ కన్య సకల సద్గుణరాశి. ఈమెను పత్నిగా పరిగ్రహించవలసిందిగా కోరుతున్నాను" అని చెప్పడంతో దానికంగీకరించిన జరత్కారుడామెను వివాహం చేసుకుని కొంతకాలం ఆమెతో కలిసి ఉన్నాడు. కాని, పెండ్లయిన మొదటి రోజే తన నియమాన్ని తెలిపాడు. "నీవు నన్నెప్పుడైతే అవమాన పరుస్తావో అప్పుడు వెంటనే నిన్ను వదిలి వెళ్ళిపోతాను" అని జరత్కారు మహర్షి తన భార్య అయిన జరత్కారుతో నిక్కచ్చిగా చెప్పాడు. నాగభగిని (వాసుకి మొదలైన నాగరాజుల సోదరి) అయిన జరత్కారు మిక్కిలి శ్రద్ధతో నాటినుండి ఏ తప్పూ తనవల్ల జరగకుండా భర్తకు పరిచర్యలు చేస్తూ ఉన్నది.

**"అనవరత భక్తిఁ బాయక**
**తన పతికిం బ్రియము సేసి, తద్దయు గర్భం**
**బనురక్తిఁ దాల్చి యొప్పెను**
**దినకర గర్భయగు పూర్వ దిక్సతి వోలెన్"**

**–ప.155 – ద్వితీయాశ్వాసము – ఆదిపర్వము – మహాభారతము**

జరత్కారు భర్తమీద అత్యంత భక్తితో అనుక్షణం పతిసేవలు చేస్తూ, ఆతనికి ప్రియం కలిగిస్తూ తూర్పుదిక్కనే స్త్రీ సూర్యుని గర్భంలో ధరించినట్లు గర్భం ధరించింది. ఆ మహాసాధ్వి పతిసేవలో నిమగ్నురాలై యుండగా ఒకనాడు జరత్కారు మహర్షి ఆమె ఒడిలో తల పెట్టుకొని, లేడి చర్మాన్ని పక్కగా కలిగి నిద్రిస్తుండగా సూర్యాస్తమయం కావచ్చింది. సాయం సమయం ఆసన్నం కావటం వల్ల అక్కడి మునులందరూ సంధ్యాకాల పూజలు చేస్తుండడం గమనించిన జరత్కారు భర్తను నిద్ర నుంచి లేపాలా? వద్దా? అని ఆలోచించింది. కొంతసేపటికి ఆయన కోపించినా, మేల్కొల్పటమే సముచితమని భావించి ఆయనను నిద్రనుండి లేపింది. నిద్రనుంచి మేల్కొనిన జరత్కారు మహర్షి "ఎందుకు లేపావ"న్నట్లు చూశాడు. దానికామె సంకోచిస్తూనే సమాధానం చెప్పింది.

**"ఇనుడస్తమించిపబోయిన**
**ననఘా! బోధింపవలసె" ననవుడు, నామే**
**ల్కను నంతకు నుండకయును**
**డొనరగ నస్తాద్రి కేగ నోడడె చెపుమా!"**

**–158 ప – ద్వితీయాశ్వాసము – ఆదిపర్వము – మహాభారతము**

''సూర్యాస్తమయం జరగబోతున్న కారణం చేత ధర్మకార్యాలు చేయాలి గదా!'' అని నిన్ను లేపాను. అంతే'' అన్న ఆ మహాసాధ్వి పలుకులకు –

''మునులారా! జరత్కారు మహర్షి ఏమన్నాడో వినండి'' అని సూతుడనేసరికి మునులందరూ ఆయన వైపు కుతూహలంగా చూశారు.

''సాధ్వీమణీ! నేను నిద్ర లేచి అర్ఘ్య ప్రధానాది సాయంసమయ కార్యక్రమాలనన్నిటినీ పూర్తి చేయకుండా సూర్యుడస్తమిస్తాడా? లేదే?'' అని అన్నాడు జరత్కారుడు. దీనిని బట్టి మనకేం అర్థమౌతుంది? ఆ ముని తపశ్శక్తికి సూర్యభగవానుడు కూడా భయపడి అస్తమించకుండా ఇంకా వెలుగుతూనే ఉంటాడని. అంతటి మహా మహిమ గలవాడు జరత్కారుడు. ఋషులకున్న మంత్రబలం అటువంటిది. ఆ విషయాన్ని (నిద్రాభంగం చేయటాన్ని) కారణంగా తీసుకొని జరత్కారుడు ''నీవు నాకవమానం చేశావు. ఇక నేను నీ వద్ద ఉండను. ఈ విషయం నీకు ముందే చెప్పాను. అయితే ఒక విషయం నీకు చెబుతాను. నీ యొక్క పతిభక్తికి, సేవానిరతికి నీకు సకల సుగుణ సంపన్నుడయిన పుత్రుడుదయిస్తాడు. సూర్యాగ్నుల తేజస్సుతో సరి సమానమైన కాంతితో ప్రకాశించేవాడు, మాతాపితల దుఃఖాన్ని పోగొట్టగలిగేవాడు అయిన సత్పుత్రుడు నీ గర్భంలో పెరుగుతున్నాడు. నీవు, నేను దగ్గర లేనని బాధపడక, నీ అన్న అయిన వాసుకి వద్ద ఉండు. నేను తపోభూమికి వెళతాను. నా



ధ్యేయం కూడా తపస్సు చేయటమే'' అని ఆమెను ఊరడించి జరత్కారుడు తపోవనానికి వెళ్ళిపోయాడు. పితృదేవతల ఊర్ధ్వగతుల కోసం ఆయన వివాహమాడాడే గాని, ఆయన మనస్సంతా తపస్సులోనే లీనమై ఉంది. ఆయన భార్య అయిన జరత్కారు కూడా భర్త చెప్పినట్లు అన్న వద్ద ఉండిపోయింది.

**"ఆ పూర్ణతేజు డపగత**
**పాపుడపాకృత భవాను బంధుడు, నిజమా**
**తా పితృ పక్ష ప్రబల భ**
**యాపహు డాస్తీకుడు దితుడై పెరిగె ప్రభన్"**

**–160 ప – ద్వితీయాశ్వాసము – ఆదిపర్వము – మహాభారతము**

''పరిపూర్ణమైన తేజస్సుతో అంతటా ప్రకాశింపచేస్తూ జరత్కారుకు పుత్రుడు ఉదయించాడు. ఆ పుత్రుడు పాపరహితుడు. పుట్టుకతోనే సంసార బంధనాలన్నిటినీ ఛేదించినవాడు. తన తండ్రివైపు, తల్లివైపు గల బంధువుల భయాతిరేకాన్ని పోగొట్టేవాడు – జరత్కారు దంపతుల పుత్రుడు; దినదిన ప్రవర్ధమానుడై 'ఆస్తీకు'డనే పేరుతో మునిజనాకర్షితుడై సర్వజనానందకరుడైనాడు. జన్మతః మహాతేజస్వి అయిన ఆస్తీకుడు సత్వగుణంతో అలరారుతున్న మహోన్నతుడని ప్రజానీకమంతా ప్రశంసించసాగారు. చ్యవన మహర్షి సుతుడైన 'ప్రమతి' తో కలిసి విద్యాభ్యాసం చేశాడు. ఆయన నేర్వని విద్య లేదు. వేద వేదాంగాలు (ఋగ్యజుస్సామాధర్వాలు అనే నాలుగు వేదాలు, శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం అనే ఆరు వేదాంగాలు) – కూలంకషంగా అధ్యయనం చేశాడు. నిర్మల మనస్కుడై సకల శాస్త్రాల మర్మాలను బోధపఱచుకొన్నాడు. మునీంద్రులలో మున్నెన్నదగిన వాడిగా ఖ్యాతికెక్కాడు. తపశ్చర్య ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. శాపానుగ్రహ సమర్థుడై శాంతమూర్తిగా వన్నెకెక్కాడు.

నాగమాత అయిన కద్రువ – కొడుకులకిచ్చిన శాప కారణంగా నాగరాజులతో సహా నాగులందరూ ఎప్పటినుండో మరణభయంతో విలవిల్లాడుతున్నారు. ఆ సమయం రానే వచ్చిందన్నట్టుగా పరీక్షిత్తు కుమారుడైన జనమేజయుడు సర్పయాగం చేయటానికి సంసిద్ధుడైనాడన్న వార్త నాగులలో వ్యాపించింది. పరీక్షిత్తును చంపిన తక్షకుడు భయాందోళనములతో దేవేంద్రుని శరణు జొచ్చాడు. నాగవీరులెందరో అగ్నికుండలంలో పడుతుండటం చూసిన వాసుకి శోకవిహ్వలుడై, తన చెల్లెలయిన జరత్కారువుని చూసి వినతా కద్రువుల పందెం వల్ల జరిగిన అనర్థాన్ని, తల్లి తన కుమారులకే ఇచ్చిన శాప వృత్తాంతాన్ని గుర్తు చేసి, బ్రహ్మదేవుడు చెప్పిన మాటలు తలపోస్తూ 'సోదరీ! జనమేజయుడు చేస్తున్న సర్పయాగంలో మేమందరం ఆహుతి కాకుండా మమ్మల్ని ఆదుకోగలిగినవాడు – నీ కొడుకైన ఆస్తీకుడే. ఆ మహనీయుని

కరుణ మాకు తప్పనిసరి. సర్పజాతిని ఆస్తీకుడు సంరక్షిస్తాడన్నది బ్రహ్మ వాక్కు. ఆ ధైర్యంతోనే ఇంతకాలం భయం లేకుండా ఉన్నాము. ఇప్పుడు మాకాపద వచ్చింది. ఆస్తీకుడు రక్షించవలసిన సమయం ఆసన్నమైంది. ఆస్తీకుడు నీ కుమారుడు కావటం మా అదృష్టం. ఆస్తీకుడెవరనుకున్నావు?

**"విమల తపో విభవంబున**
**కమలజు నట్టిండు విగత కల్మషుడాస్తీ**
**క మహామునిః యీతని వచ**
**నమున మహాహికుల రక్షణంబగు పేర్మిన్"**

**–217 ప – ద్వితీయాశ్వాసము – ఆదిపర్వము – మహాభారతము**

"స్వచ్ఛమైన తపస్సంపదలో సాక్షాత్తూ బ్రహ్మదేవుని వంటివాడు. పాపరహితుడు. ఈ మహాముని వాక్కుతో సర్పజాతి రక్షణ జరిగి తీరుతుంది. ఇది నా మాట కాదు. సృష్టికర్త అయిన బ్రహ్మవాక్కు. కనుక, జరత్కారూ! నీ పుత్రుడు జనమేజయ మహారాజు వద్దకు వెళ్ళి సర్పజాతికి కలగబోయే ప్రళయాన్ని నివారించాలి. క్షణం ఆలస్యమైనా సర్పనాశనాన్ని ఆపటం కష్టమనుకో. ఒకేపేరున్న జరత్కారు మహర్షికి నిన్నిచ్చి వివాహం చేయటంలో గల ఆంతర్యం కూడా సర్పకుల రక్షణమే. భగినీ! ఆస్తీక మహాముని మమ్మల్నందరినీ ఈ మహాపద నుండి రక్షించగల పరమ మంత్రశాస్త్ర నిపుణుడు, మహా తపస్వి, కరుణామయుడు. నీ మాట ఎన్నడూ కాదనడు. నీ మాటగా సర్పజాతిని కాపాడమని చెప్పి ఆస్తీకుని జనమేజయుని చెంతకు పంపు. ఇది మా అందరి కోరిక" అని వాసుకి చెప్పగానే కొడుకు వైపు చూసి జరత్కారు "నాయనా! నీ మేనమామ చెప్పినట్లు చేసి, మా అందరికీ సంతోషాన్ని కలుగచేయి" అంది.

వెంటనే ఆస్తీకుడు "జననీ! ఇంతవరకు హోమకుండంలో పడిన సర్పాలను పడనీ! ఇక ముందు కద్రువ పుత్రులెవరూ సర్పయాగంలో ఆహుతి కాకుండా చేస్తాను. నేను వెంటనే వెళ్ళి జనమేజయుడు చేస్తున్న సర్పయాగాన్ని ఆతని చేతనే ఆపిస్తాను. మీ ఆపద నివారిస్తాను. భయపడకండి" అని చెప్పి బయలుదేరాడు. ఆయన వెంట వేద వేదాంగ పారగులైన విప్రవరులందరూ నడిచారు. జనమేజయుని యాగమంటపానికి వెళ్ళి, ఆ మహారాజుకు ముందుగా శుభాశీస్సులు పలికాడు ఆస్తీక మహర్షి. యజ్ఞ మంటపంలోని వారందరూ ఆస్తీకుని దేహకాంతికి ఆశ్చర్యపోతూ ఆయననే చూడసాగారు. ఆస్తీకుడు స్వస్తి వచనాలు పలికి జనమేజయుని చూస్తూ ఆ చక్రవర్తి గుణగణాలను అభివర్ణించాడు.

**"రజనీనాథ కులైక భూషణుడవై; రాజర్షివై, ధారుణీ**
**ప్రజనెల్లన్ దయతోడ ధర్మచరితం బాలించుచుందొంటి ధ**
**ర్మజు నాభాగు భగీరథున్ దశరథున్ మాంధాతృ రామున్ రఘున్**
**విజయుం బోలితి సద్గుణంబుల జగద్విఖ్యాత పారీక్షితా!"**

**–ప. 221 – ద్వితీయాశ్వాసము – ఆదిపర్వము – మహాభారతము**

"ప్రపంచ ప్రఖ్యాతి పొందిన సకల సద్గుణ శోభితా! పరీక్షిత్తు పుత్రా! జనమేజయ మహారాజా! చంద్రవంశానికే భూషణం వంటివాడవై, రాజర్షిగా ప్రసిద్ధి చెందిన వాడివై, ధర్మవర్తనతో ప్రజలనందరినీ పరిపాలిస్తూ, పూర్వ సార్వభౌములైన ధర్మరాజును, నాభాగుడిని, భగీరథుని, దశరథుని, మాంధాతను, రాముని, రఘువును, అర్జునుని సర్వవిధాలా పోలుతున్న సద్గుణమూర్తివి. నీ కరుణతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవిస్తున్నారు. నీ పుట్టుకతో పాండవుల వంశం వెలుగులీనింది. నీవు రాజ్యభారం వహించినప్పటినుండి యజ్ఞాలు చేస్తూ విప్రోత్తములకు వారి కోరికలకు అనుగుణంగా ధనాదులను దక్షిణలుగా ఇవ్వటం వల్ల వారందరూ ఎంతగానో సంతృప్తి చెందారు.

కురువంశాన్ని ప్రకాశింప చేసిన జనమేజయ సార్వభౌమా! సుప్రసిద్ధులైన నలమహారాజు, ధర్మరాజు, బ్రహ్మదేవుడు, వరుణదేవుడు, శ్రీకృష్ణుడు, చంద్రుడు చేసిన యజ్ఞాలతో సరిపోలుతూ నీవు చేస్తున్న ఈ యజ్ఞం మహిమోపేతమై విరాజిల్లుతోంది. నీ చేత ఈ సర్ప యజ్ఞాన్ని నిర్వహింపచేస్తున్న ఋత్విజులు బ్రహ్మదేవుడితో సమానమైనవారు. యజ్ఞ విధానాన్ని చక్కగా తెలిసినవారు. ధీమంతులు. జగత్ప్రసిద్ధులైన తపోధనులు. శాపానుగ్రహ సమర్థులు. సమస్త విద్యలలోను దేవేంద్రుని చేత యజ్ఞం చేయించే యాజోత్తములందరి కంటె ప్రఖ్యాతి చెందినవారు.

మహారాజా!

**"విద్వన్ముఖ్యుడు, ధర్మమూర్తి, త్రిజగద్విఖ్యాత తేజుండు కృ**
**ష్ణ ద్వైపాయనుడేగుదెంచి, సుత శిష్య బ్రహ్మ సంఘంబుతో**
**సద్వంద్యుండు సదస్యుడయ్యె ననినన్ శక్యంబె వర్ణింప; సా**
**క్షా ద్విష్ణుండవ నీవు భూపతులలో కౌరవ్య వంశాగ్రణీ!"**

**–225 ప – ద్వితీయాశ్వాసము – ఆదిపర్వము – మహాభారతము**

"ధర్మమూర్తి, పండితాగ్రేసరుడు, తన కాంతి పుంజంతో ముల్లోకాలలో ఖ్యాతి చెందినవాడు, సజ్జనుల చేత పూజింపబడేవాడు అయిన వ్యాస భగవానుడు, కుమారుడైన శుకమహర్షితో, వైశంపాయనాది శిష్యులతో, ఋత్విక్కుల సమూహంతో స్వయంగా నీ యజ్ఞానికి కదలి వచ్చి సదస్యుడిగా ఉన్నాడంటే నీ ఘనతను వర్ణించటం ఎవరికైనా శక్యమౌతుందా? జనమేజయ మహారాజా! రాజులలో నీవు సాక్షాత్తు విష్ణుమూర్తివే. ఎందుకంటావేమో! 'నావిష్ణుః పృథివీ పతిః' కదా! (చక్రవర్తి అయిన వాడిలో తప్పక విష్ణ్వంశ ఉంటుంది). నీ యజ్ఞానికి ఇంతమంది వేదవిదులు, ఉద్దండ పండితులు, ఋత్విజులు వచ్చారంటే భూపతులందరిలోనూ నీ ఉత్తమత్వం వ్యక్తమౌతోంది.

మరొక్క విషయం. పరమ పవిత్రమూర్తి, బాధా నివారకుడు అయిన అగ్ని దేవుడు ఋత్విజుల దివ్య మంత్రాల చేత హోమం చేయబడిన హవ్యాలను తన జ్వాలలనే చేతులతో స్వీకరిస్తూ నీకు సమస్త పుణ్యఫలాలను ప్రసాదించు గాక!'' అని జనమేజయుని, ఆతని యజ్ఞ మహిమను, యాజకులను, సదస్యులను (యజ్ఞ విధులను పరీక్షించే వ్యాసముని మొదలైనవారిని), అగ్నిదేవుని ప్రస్తుతించిన ఆస్తీకుని చూసి అందరూ సంతుష్టి చెందారు. జనమేజయుడు ఆస్తీకుని పలుకులను, ఆశీస్సులను విని – ''మహాత్మా! ఆస్తీక మహర్షిసత్తమా! నీకేది ఇష్టమో దానిని అడుగుము. ఇస్తాను'' అని అనడంతో ఆస్తీకుడు తన రాక సఫలమైనందుకు సంతోషించాడు.

**"జనమేజయ మహారాజా!**

**"మానిత సత్యవాక్య! యభిమన్యు కులోద్వహా! శాంతమన్యు సం**
**తానుడవై దయాభినిరతస్థితి నీవు మదీయ బంధు సం**
**తాన మనోజ్వరంబు పరతంబుగ, నాకు ప్రియంబుగా మహో**
**ర్వీనుత సర్పయాగ ముడిగింపుముః కావుము సర్పసంహతిన్"**

**–228 ప – ద్వితీయాశ్వాసము – ఆదిపర్వము – మహాభారతము**

''ఎల్లప్పుడూ సత్యమునే పలుకువాడా! అభిమన్యు వంశోద్ధారకా! భూ ప్రజలందరి చేత స్తుతింపబడే వాడా! కామ క్రోధాదులను జయించిన శాంతమూర్తీ! దయతో నా బంధువులైన సర్పముల మనోవ్యధ తొలగిపోయేటట్లు, నాకు ప్రీతి కలిగేటట్లు నీవు చేస్తున్న ఈ సర్పయాగాన్ని మానివేయుము. సర్ప సమూహాన్ని సంరక్షించు'' అని

**ప్రాణహానిని కలిగిస్తూ, ఉగ్రజ్వాలలను పైకి లేపుతూ మహోగ్రంగా ఉన్న అగ్నిలో అత్యధికమైన భయంతో పడబోతున్న తక్షకుని చూసిన ఆస్తీక మహర్షి "ఓహో తక్షక! పడకు. పడకు. వెనుకకు మరలిపో" అని అంటూ ఆ సర్పరాజును అగ్నిలో పడకుండా మధ్యలోనే మరల్చి వేశాడు.**



ఆస్తీకుడు జనమేజయుని కోరడంతో అక్కడ ఉన్న ఋత్విజులు, సదస్యులు (సభ్యులు), విద్వాంసులు – అందరూ ఎంతగానో సంతోషించారు. జనమేజయుని చూసి, 'మహారాజా!

**"అనిన సదస్యులందఱుఁ బ్రియంబున 'నిట్టి విశిష్ట విప్రము**
**ఖ్యునకు మహా తపోధనునకుందగు పాత్రునకెద్ది యిచ్చినన్**
**ఘనముగ నక్షయంబగును గావున నీ ద్విజనాథు కోర్కి పెం**
**పున వృథ సేయగాఁ దగదు భూవలయేశ్వర! యిమ్ము నెమ్మితోన్"**

**– ప. 229 – ద్వితీయాశ్వాసము – ఆదిపర్వము – మహాభారతము**

''ఇటువంటి మహనీయుడైన విప్రోత్తమునికి, తపస్సే ధనంగా గల మహాత్ముడికి, యోగ్యుడికి (అర్హుడైన వాడికి) ఏది ఇచ్చినా, అది అక్షయంగా భాసిస్తుంది. కనుక ఈ బ్రాహ్మణోత్తముడికి ఆయన కోరిక తీరేటట్లుగా, ఆయన అడిగింది ఇష్టపూర్వకంగా ఇవ్వటం ఎంతో మంచిది. అంతేగాని ఆస్తీక మహర్షి కోరికను వృథా పఱచటం ఉచితం గాదు. ఈయన గౌరవింపదగినవాడు'' అని వ్యాసాది సదస్యులందరూ జనమేజయుడికి కర్తవ్యాన్ని ఉపదేశించారు. భగవత్స్వరూపులు, తపోమహిమాన్వితులు, సర్వశాస్త్ర నిపుణులు అయిన సదస్యులందరి మాట ప్రకారం, ఆస్తీకుని ప్రార్థన నంగీకరించి, జనమేజయుడు తాను చేస్తున్న సర్పయాగాన్ని విరమించాడు (మానివేశాడు).

''మునులారా! అప్పుడేం జరిగిందో తెలుసా?'' అని సూత మహర్షి ప్రశ్నించే సరికి ఒక ముని లేచి ''మహాత్మా! ఎవరి కొరకు ఈ యాగం చేయటానికి జనమేజయుడు ఉపక్రమించాడో – ఆ తక్షకుడు, మేనల్లుడయిన ఆస్తీక మహర్షి చేత ప్రాణ రక్షణ చేయబడ్డాడు. అంతేనా?'' అని చెప్పి కూర్చున్నాడు.

''అవును నాయనా! తక్షకుడొక్కడే కాదు, అప్పటివరకు బ్రతికి ఉన్న సర్పరాజులు, సర్పజాతికి చెందిన సర్పులూ ప్రాణహాని నుండి రక్షింపబడ్డారు.

**"ఆతని నత్యుగ్రానల**
**పాతోన్ముఖుడైన వానిఁ బడకుండగ 'నో**
**హాతక్షక! క్రమ్ముఱు' మని**
**యాతత భయుఁ గ్రమ్మఱించె నాస్తీకుడెడన్"**

–232 ప – ద్వితీయాశ్వాసము – ఆదిపర్వము – మహాభారతము

ప్రాణహానిని కలిగిస్తూ, ఉగ్రజ్వాలలను పైకి లేపుతూ మహోగ్రంగా ఉన్న అగ్నిలో అత్యధికమైన భయంతో పడబోతున్న తక్షకుని చూసిన ఆస్తీక మహర్షి ''ఓహో తక్షక! పడకు. పడకు. వెనుకకు మరలిపో'' అని అంటూ ఆ సర్పరాజును అగ్నిలో పడకుండా మధ్యలోనే మరల్చి వేశాడు.

చూశారా శౌనకాది మునులారా! ఆస్తీక మహర్షి ఎంత గొప్ప తపో మహిమ గలవాడో!? ఒక్క తక్షకునే కాదు. దేవజాతికి చెందిన ఉచ్చైశ్రవం (ఇంద్రుని అశ్వరాజం) వాలానికి చుట్టుకుని – 'ఆ తోక తెలుపు రంగుది కాదు. నలుపురంగుదే సుమా!' అని వినత నమ్మి తనకు దాసీ కావాలనే కోరికతో నాగమాత అయిన కద్రువ – తన పుత్రులైన నాగులనందరినీ కోరింది. ఆ పని చేస్తే అది అధర్మ కార్యమౌతుందని నాగులెవ్వరూ ఆ పని చేయటానికి సమ్మతించలేదు. అందుకు కద్రువ కోపించి నాగజాతి నంతటినీ (తన సంతతిని) జనమేజయుని యాగంలో ఆహుతి కమ్మని శపించింది. కర్కోటకుడొక్కడే తల్లి కోరిక నెరవేర్చి తల్లి శాపం నుండి విముక్తుడైనాడు. ఉచ్చైశ్రవం వాలం నల్లగా ఉండటాన్ని చూసి పందెం ప్రకారం వినత, కద్రువకు దాసి కావటం, చివరకు గరుడుడు (వినత కొడుకు) వినతను (తల్లిని) శాపం నుంచి విముక్తురాలు కావటానికి అమృతాన్ని తెచ్చి నాగులకు ఇవ్వటం – మీకందరికీ గుర్తుంది కదా!

తల్లి శాపకారణంగా భయగ్రస్తులైన నాగరాజులను సర్పయాగములో అగ్నికి ఆహుతి కాకుండా కాపాడిన మహాతపస్సంపన్నుడైన ఆస్తీక మహర్షిని ఆ యాగంలో ఉన్న సదస్యు (సభ్యు) లందరూ సంతోషాతిశయంతో, రక రకాల స్తుతులతో పదే పదే కీర్తించారు. అంతట సత్కార్యాన్ని చేసి యశస్వి అయిన ఆస్తీక మహర్షికి నమస్కరించి ఆయన ఆశీస్సులు పొందిన వారికి సకల శుభాలు కలుగుతాయి'' అన్న సూత మహర్షి వైపు సంతృప్తితో చూశారు మునులంతా. మళ్ళీ చెప్పసాగాడు సూతుడు.

**"ఒనర జరత్కారు మునీం**
**ద్రునకు జరత్కారునకు సుతుండైన మహా**
**మునివరు నాస్తీకుని ముద**
**మున తలచిన నురగ భయము పొందదు జనులన్"**

**–234ప–ద్వితీయాశ్వాసము–ఆదిపర్వము – మహాభారతము**

''జరత్కారు మునీశ్వరుడికి, జరత్కారుకి (నాగరాజైన వాసుకి చెల్లెలుకు) జన్మించిన 'ఆస్తీకు'డనే మునిశ్రేష్ఠుని భక్తి ప్రపత్తులతో ప్రియంగా సంతోష మనస్కులై తలిస్తే అటువంటి జనులకు సర్పభయం కలుగదు. అంతేకాదు ఆస్తీక మహర్షి చరిత్ర విన్నవారికి సకల పాపాలు నశిస్తాయి'' అని చెప్పి ఆస్తీకమునికి మనసారా నమస్కరించి సూతమహర్షి ఆసనం నుంచి లేచాడు. మునులందరూ ఆస్తీక మహర్షికి, గురువైన సూతమునికి నమస్కరించి, పరమానంద భరితులై లేచి, ఆశ్రమోన్ముఖులైనారు.

**(సశేషం)**


# రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.

ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com






# అనంతపద్మనాభస్వామి వ్రతం

: చింతలపాటి శివశంకరశాస్త్రి

శ్లో ॥ "కామదేవః కామపాలః కామకాంతః కృతాగమః
అనిర్దేశ్యః వపుః విష్ణుః వీరః అనంతో ధనంజయః
అనంతో హుత భుగ్భోక్తా సుఖదో నైక జోగ్రజః
అంభోనిధిః అనంతాత్మా మహోదధి శయోంతకః"

పూర్వాభాద్ర లేక ఉత్తరాభాద్ర అను నక్షత్రములతో కూడిన పూర్ణిమ గల మాసమును భాద్రపద మాసమని అంటారు. ప్రజలందరికీ భద్రమును కలిగించు మాసము కనుక ఈ మాసమును భాద్రపద మాసమని అందురు.

భారతదేశము ధర్మప్రధానమైన దేశం కనుక ఇక్కడ ధార్మిక పరమైన కర్మలకు ప్రాధాన్యత ఇవ్వబడింది. భారతీయ సనాతన ధర్మంలో మనం పాటించే సంప్రదాయాలు, ఆచారాలకు కార్యకారణ సంబంధముంది. హైందవ సంస్కృతిలో నిర్వహించే ఆరాధనా ప్రక్రియలు, పర్వదినాలు, నోములు, వ్రతాలు, క్రతువులు ఇలా అన్నింటా విశ్వశ్రేయోభావన, సమిష్టి తత్వము అవ్యక్తమవుతాయి. భగవదారాధన, సామూహిక భక్తి చైతన్యము, ఐక్యతా భావన అడుగడుగునా ద్యోతకమవుతాయి.

అన్ని జన్మల కన్నా మానవ జన్మ అత్యుత్తమమైనది. మానవులు అన్నివిధాలుగా ప్రకాశించవలెనన్న ముఖ్యంగా మూడు గుణాలు ఆవశ్యకములు. అవి 1. శక్తి 2. సంపద 3. జ్ఞానము. చిత్తశుద్ధి లేని శివపూజలేల? అన్నట్లు ఈ మూడూ లేకపోయాక ఏ వ్రతం చేసినా, పూజ చేసినా అది మట్టిలో పోసిన పన్నీరు వలె నిష్ప్రయోజనమవుతుంది. వ్రతాచరణ ద్వారా మనిషి ఉన్నతమైన జీవనం గడపడానికి అర్హతను పొందుతున్నాడు.

భాద్రపద మాసంలో శుక్లపక్షం దేవతా పూజకెంతో ఉత్తమమైనది. ఈ మాస శుద్ధ చతుర్దశి నాడు ''అనంత పద్మనాభ వ్రతం'' చేస్తారు. దీనికే ''అనంత చతుర్దశీ వ్రతమ''ని కూడా పేరు ఉంది. ఇది హిందూ సంప్రదాయంలో ఉన్న కామ్య వ్రతాలలో ప్రధానమైనదని వ్రత గ్రంథాలు పేర్కొంటున్నాయి.

పద్మనేత్రుడు, పద్మనాభుడు, పద్మమాలాధరుడు, దేవదేవుడు, అనంత శక్తిస్వరూపుడు, అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు, ఆపద్బాంధవుడు అయిన మహావిష్ణువు భక్తుల కష్టాలను గట్టెక్కించి, వారి కోరికలు తీర్చే ఆ దేవదేవుని స్మరణం కైవల్యదాయకం – భక్తి ముక్తి దాయకం.

అనంతుడు – అంతములేనివాడు, ఆది మధ్యాంతరహితుడు. అనంతుడు అనునది విష్ణుభగవానునకు గల పలు నామములలో ఒక నామం. ధర్మార్థ కామ్య మోక్షాలను అనుగ్రహించేవాడు. తనను ఆశ్రయించిన భక్తుల కోరికలను తీర్చేవాడు, మనోహరమైన రూపం కలవాడు, వేదములను ఉద్ధరించినవాడు

శ్రీమహావిష్ణువు. శ్రుతులను కాపాడిన కళ్యాణ చక్రవర్తి ఆయన. సకల చరాచర సృష్టికి పోషకుడు, స్థితి కారకుడు. అలాంటి శ్రీమహావిష్ణువును తలచుకోవడం కూడా పుణ్యఫల ప్రదాయకమే. పిలిచినదే తడవుగా కనిపించే ఆ నల్లనయ్య, పిలిచినదే తడవుగా పలికే చల్లని దైవంగా యుగయుగాలుగా అనేక రూపాల్లో ఈ పరిపూర్ణమైన పుణ్యధరిత్రిపై విరాజిల్లుతున్నాడు. ఆ రూపాల్లో అత్యంత మహిమాన్వితమైన, సుందరమైన, సులభ ప్రసన్నమైన రూపం అనంత పద్మనాభుడు.

**"అనంతశ్చాస్మి నాగానాం వరుణో యాదసా మహమ్**

**పితృణా మర్యమా చాస్మి యమః సంయమతా మహమ్"**

"అనంత అనే పేరు విశిష్టమైన నామమని శంకర భాష్యం చెబుతోంది. విష్ణువును ఆద్యంత రహితుడైన, విశ్వవ్యాప్తమైన శక్తిగా ఈ నామం మన కళ్ళకు కడుతుంది. అనంతమైన దైవీశక్తిని భక్తికి అనుసంధానం చేసి భక్తుడిని అనుగ్రహించే దివ్యరూపమే అనంతపద్మనాభుడు. సకల సంపత్ప్రదాయకుడు. అనంతడు అంటే ఆదిశేషుడు అనే అర్థం కూడా ఉంది. అనంతుడి అనుగ్రహం ఉంటే సకల శాస్త్ర పారంగత్వం కలుగుతుందని పురాణ వచనం. అనంత, అచ్యుత, గోవింద అనే నామములతో స్వామిని నిరతమూ మనం తలచుకుంటూ ఉంటాము. ఒక్క అనంత పద్మనాభుడిని తలచుకుంటే చాలు ఆయన హృదయాంతరవర్తిని యైన శ్రీమహాలక్ష్మి అనుగ్రహం, నిరంతరం ఆయన ధ్యానంలో కొలువై ఉండే ఈశ్వరానుగ్రహం, అనంతుని నాభికమలం నుంచి ఉద్భవించిన బ్రహ్మదేవుడి అనుగ్రహము పుష్కలంగా లభిస్తాయి. అనంతుని కొలిచిన భక్తులు నిరంతరం సిరిసంపదలతో తుల తూగుతారు. అష్టైశ్వర్యాలను పొందుతారు. అంతటి మహిమాన్వితుడైన అనంత పద్మనాభుని వ్రతమును ప్రతి సంవత్సరం భాద్రపద శుక్ల చతుర్దశినాడు జరుపుకుంటారు. దంపతులు మిక్కిలి భక్తి శ్రద్ధలతో ఈ వ్రతమును ఆచరించి ఒకరికొకరు తోరమును కట్టుకుంటారు. ఈ వ్రతమున తోరమునకు అధిక ప్రాధాన్యత ఉంది. కట్టుకున్న తోరమును మరుసటి సంవత్సరము వచ్చు అనంత చతుర్దశి వరకు ఉంచుకోవాలి. ఈ తోరము వారిని శ్రీరామ రక్షలాగా కాపాడుతుంది. ఈ వ్రతము సమస్త పాపముల నుండి విముక్తిని కలిగిస్తుంది.

పాండవులు వనవాసం చేస్తున్న సమయంలో కష్టాలను అనుభవిస్తున్న ధర్మరాజుకు అనంత పద్మనాభ వ్రతాన్ని భాద్రపద శుక్ల చతుర్దశినాడు చేయమని, అలా చేసిన కష్టాల నుండి విముక్తులవుతారని సాక్షాత్తు శ్రీకృష్ణ పరమాత్మ స్వయంగా చెప్పాడు. అందుకు ధర్మరాజు "కృష్ణా! మీరు పేర్కొన్న అనంతుడు ఎవరు? ఆదిశేషుడా? తక్షకుడా? పరమాత్మనా, బ్రహ్మణా? ఎవరో దయయుంచి నాకు తెలియజేయవలసిందిగా ప్రార్థిస్తున్నాను" అన్నాడు. ధర్మజుని సందేహములను విని అనంతుడిని నేనే. నా



రూపముగానే వానిని గ్రహించుము. కాలమే అనంతుడు. ఆ అనంతుడను నేనే" అని సమాధానమిచ్చాడు. అంతట ధర్మరాజు శ్రీకృష్ణునితో ఈ వ్రతమును చేయు విధానమును వివరించండి" అని వేడుకున్నాడు. శ్రీకృష్ణుడు ధర్మరాజుకు వ్రత విధానాన్ని ఈవిధంగా వివరించాడు.

అనంత పద్మానాభ చతుర్దశి పర్వదినము నాడు సూర్యోదయానికి ముందే అనగా బ్రాహ్మీ ముహూర్తములోనే నిద్రలేచి, కాలకృత్యములు తీర్చుకుని నువ్వుల నూనెతో తలంటుకోవాలి. నువ్వులు నూనె లక్ష్మీకరం. నీరు గంగాజలంతో సమానం. కావున గంగ, యమున, సరస్వతీ నదులను స్మరిస్తూ అభ్యంగన స్నానం చేయాలి. స్నానానికి ఉపయోగించే నీటిలో పంచపల్లవాలను నానబెట్టి, ఆ నీటితో తలస్నానం చేయాలి. ఆరోజు నూనెతో తలస్నానం చేసినవారు లక్ష్మి, గంగామాతల అనుగ్రహాన్ని పొందుతారు. అంతేకాక అభ్యంగన స్నానం వల్ల అవయవ పుష్టి కలుగుతుంది. మరియు ఆరోగ్యప్రదం, ఆయుర్దాయకం. అభ్యంగనస్నానం చేసిన తర్వాత నూతన వస్త్రములను ధరించాలి. గృహాన్ని, పూజా మందిరాన్ని శుభ్రపరచుకుని అష్టదళ పద్మాన్ని తీర్చిదిద్దాలి. ఆ పద్మం చుట్టూ ముగ్గులతో అలంకరించుకోవాలి. దానికి దక్షిణ భాగంలో నీరు నింపిన కలశమును ఉంచాలి. ఓ మండపాన్ని ఏర్పాటు చేసుకొని అందులో పదునాలుగు పడగలు గల అనంతుని ప్రతిమను ప్రతిష్ఠించాలి. కలశములో మామిడాకులను వేసి కొబ్బరికాయను ఉంచి కాయ పైభాగంలో కొత్త బట్టతో అలంకరించాలి. ముందుగా గణపతిని అష్టోత్తర సహస్ర నామాలతో పూజించాలి. అనంతరం నవగ్రహాలను పూజించిన తర్వాత ఒక పెద్ద పాత్రలో నీటిని నింపి నీటిని తెచ్చుకుని సుగంధ ద్రవ్యాలు, చందనమును, తులసి, మారేడు దళములను. తులసికోట లోని మట్టిని వేసి

దానిపై మామిడి, మఱ్ఱి, రావి, జువ్వి, మేడిచెట్ల చివుళ్ళు ఉంచి పుష్పమాలికలతో కల్పోక్త ప్రాణప్రతిష్ఠాదులు చేసి బ్రహ్మాది దేవతలను, గంగ, యమున, సరస్వతి నదులను ఆవాహన చేసి పూజించాలి. యమున పూజ చేయాలి. తరువాత అనంత పద్మనాభ స్వామికి షోడశోపచార పూజ చేసి ఒక్కొక్క రకం 14 చొప్పున 14 రకాల పదార్థములు నైవేద్యముగా సమర్పించాలి. వ్రతకథా శ్రవణం చేసి అక్షితలను తలపై వేసుకోవాలి. వ్రతములో భాగంగా ఎరుపు రంగులో గల తోరానికి పధ్నాలుగు ముడులతో తయారు చేసిన తోరాన్ని ధరించాలి. ఈ తోరమునకు అధిక ప్రాధాన్యత ఉంది. చేతికి కట్టుకున్న తోరమును మరుసటి సంవత్సరము వచ్చు అనంత చతుర్దశి వరకు ఉంచుకోవాలి. ఈ వ్రతమును చేసుకున్నవారికి పాపముల నుండి విముక్తులను గావిస్తుంది. శుభములను కలుగజేస్తుంది. మనోభీష్టాలను నెరవేరుస్తుంది అని పురాణ వచనం. తోరమును భర్త భార్య ఎడమ చేతికి కట్టాలి. భార్య భర్త కుడిచేతికి కట్టాలి. వ్రతము పూర్తి కాగానే శక్త్యానుసారం ముత్తైదువులను ఇంటికి ఆహ్వానించి వారి కాళ్ళకు పసుపు రాసి, కుంకుమ పెట్టి సత్కరించి భోజనమును పెట్టాలి. ప్రతి వ్రతము వెనుక ఒక కథ ఉన్నట్లే ఈ వ్రతానికి కూడా ఒక కథ ఉన్నది.

పూర్వం కృత యుగంలో వేద వేదాంగ విదుడైన సుమంతుడనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతని భార్య పేరు దీక్షాదేవి. వీరి ఏకైక కుమార్తె పేరు సుగణవతి. పేరుకు తగ్గట్లే చక్కని సుగుణాలరాశి. ఒప్పుల కుప్ప. ఈమెకు దైవభక్తి మెండు సుగుణవతికి యుక్తవయస్సు వచ్చేసరికి ఆమె తల్లి మరణించడంతో సుమంతుడు మరొక యువతిని వివాహం చేసుకున్నాడు. ఈమె పేరు కర్కశ. ఈమె పేరుకు తగ్గట్లే కర్కోటకురాలు. సుమంతుడు తన కుమార్తెకు యుక్తవయస్సు రాగానే కౌండిన్య మహర్షికి ఇచ్చి వివాహం జరిపించాడు. కుమార్తెను అత్తవారింటికి పంపుతూ మార్గమధ్యంలో తినడానికి ఏదైనా ఇమ్మని భార్యను అడిగాడు. కర్కశురాలైన ఆమె ఇంట్లో ఏమీ లేదని సమాధానమిచ్చింది. అల్లుడని కూడా చూడకుండా అమర్యాదగా ప్రవర్తించింది. సుమంతుడు తన భార్య ప్రవర్తనకు బాధపడి పెండ్లికోసం తెచ్చి వాడగా మిగిలిన సత్తుపిండిని బహుమానంగా ఇచ్చి పంపాడు. సుగుణవతి తన భర్తతో కలిసి అత్తవారింటికి వెడుతూ మార్గమధ్యంలో ఒక తటాకం దగ్గర ఆగింది. అక్కడ కొందరు స్త్రీలు పూజలు చేయడం గమనించింది. వారి దగ్గరికి వెళ్ళి మీరు ఏ దేవుడిని పూజిస్తున్నారు? మీరు చేస్తున్న ఈ వ్రతం పేరేమిటి? అని అడిగింది. అందుకు వారు ఆమెతో మేము చేస్తున్న ఈ వ్రతం పేరు అనంతపద్మనాభస్వామి వ్రతం. వ్రతము నందు అనంతుని పూజిస్తున్నాము అని ఆ మహిళలు జవాబిచ్చారు. అంతేకాక వ్రతవిధానం గురించి వివరించి చెప్పారు.

సుగుణవతి ఆ స్త్రీలు వ్రతవిధానము గురించి చెప్పగానే భర్త రాగానే చెప్పి అనుమతి తీసుకుని స్వామి వ్రతాన్ని ఆచరించి, తన తండ్రి ఇచ్చిన పిండితో భక్ష్యములను చేసి బ్రాహ్మణునికి వాయనం ఇచ్చింది. ఆ వ్రత ప్రభావం వల్ల సుగుణవతి అఖండ ఐశ్వర్యవంతురాలైంది. అనుకోకుండా ఒక్కసారిగా అఖండ ఐశ్వర్యం వచ్చేసరికి కౌండిన్యునికి అహంకారం పెరిగింది. కన్నూ మిన్నూ గానక ప్రవర్తించసాగాడు. మరుసటి యేడు సుగుణవతి వ్రతము చేసుకుని తోరము కట్టుకుని భర్త దగ్గరకు వచ్చి కాళ్ళకు మొక్కి ఆశీర్వాదం తీసుకునే సమయంలో ఆమె చేతికి ఉన్న తోరమును చూచి ఆగ్రహంతో ఎవర్ని ఆకర్షించాలని ఇది కట్టావంటూ ఆ తోరాన్ని బలవంతంగా తీసి నిప్పుల్లో పడేశాడు. ఆ క్షణం నుండే వారికి కష్టకాలం మొదలై గర్భదరిద్రులై పోయారు. సంపద దూరం కావడంతో కౌండిన్యునిలో పశ్చాత్తాపం మొదలైంది. ఎందుకిలా జరిగిందని భార్యను ప్రశ్నించగా మీరు అనంతుని దూషించారు. అందువలననే ఇలా జరిగింది. ఇప్పటికైనా మించిపోయింది లేదు. చేసిన తప్పును తెలుసుకుని పశ్చాత్తాపం చెంది ఆ దేవదేవుని ఆశ్రయించండి. ఆ దేవదేవుడు ఆశ్రిత పక్షపాతి. మిమ్ము తప్పక అనుగ్రహిస్తాడని పలికింది. భార్య మాటలను విన్న కౌండిన్యునికి అనంతపద్మనాభస్వామిని దర్శించాలన్న కాంక్ష పెరిగి, ఆ స్వామిని అన్వేషిస్తూ బయలుదేరాడు. కనిపించిన వారిని అందరినీ మీరు అనంతుని చూశారా? అని ప్రశ్నిస్తూ ముందుకు సాగాడు. ఆ విధంగా తిరిగి తిరిగి ఒక ప్రదేశంలో సొమ్మసిల్లి పడిపోయాడు. అప్పుడు అనంతుడికి అతనిపై జాలి కలిగి ఒక వృద్ధ బ్రాహ్మణుని వేషం ధరించి అతని దగ్గరకు చేరి కౌండిన్యుని తనతోపాటు గుహలోనికి తీసుకుని వెళ్ళి అక్కడ తన విశ్వరూప దర్శనము కావించాడు. కౌండిన్యుడు అనంతుని విశ్వరూపం చూసి ఆనందంతో పరవశించిపోయాడు. తన తప్పును క్షమించమని పరి పరి విధాలుగా ప్రార్థించాడు. ఆ స్వామిని పలువిధాలుగా స్తుతించాడు. తన దారిద్ర్యాన్ని తొలగించి సదా నీ పాదసేవ చేసుకునే అదృష్టాన్ని మాకు ప్రసాదించమని, అంత్యకాలంలో మోక్షాన్ని ప్రసాదించమని ప్రార్థించాడు. ఆ స్వామి అనుగ్రహించాడు. అనంతరం కౌండిన్యుడు తన గృహానికి వచ్చి జరిగినదంతా భార్యకు చెప్పి పదునాలుగు సంవత్సరాలపాటు అనంతవ్రతాన్ని ఆచరించి సంపదలు పొందాడు. జీవితాంతం భక్తి శ్రద్ధలతో ఆ స్వామిని అర్చించి అంత్య కాలమున కైవల్య ముక్తిని పొందారు.

ఆదిమధ్యాంతరహితుడు, పద్మాక్షుడు, భక్తవత్సలుడు, ఆర్తజన రక్షకుడైన అనంతుని వ్రతము మహా మహిమాన్వితమైంది. విష్ణువుకు ఎంతో ప్రీతిపాత్రమైన ఆ అనంత వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో మనమంతా ఆచరిద్దాం. అందరి చేత ఆచరింపచేద్దాం. భక్తి ముక్తిని పొందుదాము. పొందింప చేద్దాము.

సర్వేజనా.. సుఖినోభవంతు

# ఉండ్రాళ్ళ తద్ది

- డా|| మరుదాడు అహల్యాదేవి

**కన్యలకు సలక్షణమైన భర్తను ప్రసాదించడంతో పాటు వివాహితులకు సులక్షణమైన కాపుర సౌఖ్యాన్ని, జీవితాంతం ఐదవతనాన్ని, సకల సౌభాగ్యాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించే దివ్యమైన వ్రతం 'ఉండ్రాళ్ళతద్ది'. పూర్వం ఈ వ్రతాన్ని గురించి శివుడు పార్వతీదేవికి తెలిపినట్లు పురాణ కథనం. పూర్వం కన్యగా ఉన్న సమయంలో పార్వతీదేవి శివుడిని భర్తగా కోరి ఈ వ్రతం చేస్తూ ఉన్న సమయంలో శివుడు ప్రత్యక్షమై వివాహం చేసుకున్నట్లు పురాణాల్లో చెప్పబడింది.**

**వ్రత కథ:** పూర్వం ఒక వేశ్య ఉండేది. శ్రీమంతులను చేరవేసి సంపదలను సంపాదించి విలాసంగా గడుపుతూ ఉండేది. చివరకు ఆ దేశపు రాజు కూడా ఆమెకు వశుడై ఆమెతో గడపసాగాడు. దీనితో ఆమెకు ఐశ్వర్యానికి లోటు లేకుండా పోయింది. ఇలా ఉండగా ఒకనాడు మహిళలు అందరూ ఉండ్రాళ్ళ తద్ది చేస్తూ వుండగా చూసిన వారు వేశ్యకు తెలిపి వ్రతం చేయమన్నారు. దేవుడిని నమ్మని ఆమె వ్రతం చేసేందుకు నిరాకరించింది. ఫలితంగా ఆమె సంపదలు, సౌందర్యం అనతి కాలంలోనే నశించిపోయాయి. రాజు కూడా దూరమయ్యాడు. దీనితో దుఃఖానికి లోనైన ఆమె పశ్చాత్తాపానికి లోనై మహర్షుల వద్దకు వెళ్ళి విషయాన్నంతా వివరించి తనకు మార్గాన్ని సూచించమని కోరింది. అందుకు నీవు ఉండ్రాళ్ళ తద్దిని గురించి తెలిసీ చేయకపోవడం వల్ల నీకు ఇలాంటి పరిస్థితి వచ్చింది. కనుక నీవు ఈసారి ఉండ్రాళ్ళ తద్ది వ్రతాన్ని ఆచరించు అని మహర్షులు సలహా ఇచ్చారు. మహర్షుల సలహా మేరకు ఆమె వ్రతాన్ని ఆచరించింది. దీనితో ఆమెకు సకల సంపదలు లభించాయి. దానితో ఆమె వేశ్యావృత్తికి దూరమై పవిత్రంగా జీవితాన్ని గడపసాగింది. ఈ విషయం రాజ్యంలోని అందరికీ తెలిసి ''ఉండ్రాళ్ళ తద్ది'' వ్రతాన్ని ఆచరించినట్లు, అప్పటినుండి వ్రతం ఆచరణలోనికి వచ్చినట్లు కథనం.

**వ్రత విధానం :** ఉండ్రాళ్ళ తద్ది ముందు రోజు అంటే భాద్రపద బహుళ విదియ, ఉండ్రాళ్ళ తద్ది భోగి. 'విదియ' నాడు తెల్లవారు జామునే నిద్రలేచి తలస్నానం చేసి గౌరీదేవిని స్మరించడంతో పాటు గోంగూర పచ్చడి, నువ్వుల పొడి , ఉల్లిపాయ పులుసు, పెరుగు






వేసుకుని చద్ది అన్నమును భుజించి తాంబూలం వేసుకొనవలెను. అంతేకాకుండా కాళ్ళకు చేతులకు గోరింటాకును ధరించవలెను. ఊయలలు ఊగవలెను. ఉండ్రాళ్ళతద్ది నాడు ఉదయాన్నే నిద్ర లేచి కాలకృత్యాలు తీర్చుకుని తలస్నానం చేయవలెను. గౌరీదేవిని పూజించి, ఐదు ముడులు ఉన్న తోరమును ధరించవలెను. ఉండ్రాళ్ళు ఐదింటిని నైవేద్యం పెట్టవలెను. తర్వాత ఐదు ఉండ్రాళ్ళతో ముత్తైదువలకు వాయిన తాంబూలాలు ఇవ్వవలెను. కనీసం ఐదు మందికి వాయనమివ్వాలని శాస్త్ర వచనం. వారి ఆశీర్వచనాన్ని పొందవలెను. ఈవిధంగా పూజ ముగించిన అనంతరం నైవేద్యంగా సమర్పించిన ఉండ్రాళ్ళతో పాటు భోజనంలో గోంగూర పచ్చడి, నువ్వులపొడి, ఉల్లిపాయ పులుసులను కూడా తప్పక భుజించవలెను. ఇలా భోజనం చేసి వ్రతాన్ని ముగించవలెను. ఈ విధంగా ఐదు సంవత్సరాలు వ్రతం ఆచరించి ఉద్యాపన చేయాలని శాస్త్ర వచనం.

**ఆరోగ్య రహస్యాలు :** ఈ వ్రతంలోని ఆచారాల్లో ఎన్నో ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయి. ఈ వ్రతం ఆచారంలో గోరింటాకు ప్రధానమైంది. గోరింటాకుకు సంస్కృతంలో 'నఖరంజని' అని పేరు. అంటే గోళ్ళకు ధరించునది అని అర్థం. ఔషధ గుణాలు ఉన్న గోరింటాకును చేతివ్రేళ్ళకు, కాలివ్రేళ్ళకు ధరించడం వలన నీటితో ఎక్కువగా పనులు చేస్తూ ఉండే మహిళలకు ఎటువంటి చర్మవ్యాధులు రాకుండా కాపాడుతుందని ఆయుర్వేదం చెబుతోంది. దీనికి తోడు శరీర నొప్పులను నివారించే గుణం గోరింటాకుకు ఉంది. నైవేద్యంగా సమర్పించే ఉండ్రాళ్ళలో ఉపయోగించే మినపపిండి బలవత్తరమైన పప్పుదినుసుల్లో ఒకటి. వీర్యవృద్ధిని కలిగిస్తుంది. వరిపిండి వల్ల శరీరానికి కార్బోహైడ్రేట్లు లభిస్తాయి. అలాగే గోంగూర పచ్చడి, నువ్వుల పొడి బలవర్ధకాలు.

**జ్యోతిషం ప్రకారం :** జ్యోతిష శాస్త్ర రీత్యా ఉండ్రాళ్ళలో వాడే మినుములు రాహువుకు ప్రియమైనవి కాగా బియ్యం చంద్రుడికి ప్రీతికరమైనవి. కనుక వీటిని నైవేద్యంగా సమర్పించడం, వాయనాలు ఇవ్వడం వల్ల వారికి శుభదృష్టి కలుగుతుంది. అందువల్ల గర్భస్రావాలు నివారింపబడతాయని జ్యోతిశ్శాస్త్రం చెబుతోంది.

**ఈ విధంగా ఎన్నో ఆధ్యాత్మిక, ఆరోగ్య ప్రయోజనాలను ప్రసాదించే దివ్యమైన వ్రతం "ఉండ్రాళ్ళ తద్ది".**



ప్రతి సంవత్సరం భాద్రపద మాసం శుద్ధ చవితి నాడు వినాయక చవితిని జరుపుకుంటారు. మట్టితో తయారు చేయబడిన వినాయకుని ప్రతిమను పసుపు కుంకుమలతో అలంకరించిన పీఠముపైన ఉంచి పూజిస్తారు. కష్టాలు తొలగిపోవాలనీ, తాము చేపట్టిన పనుల్లో ఎటువంటి అవాంతరాలు, విఘ్నాలు రాకుండా ఉండాలని, సుఖ సంతోషాలతో ఉండాలని ఆ గణపతిని ప్రార్థిస్తారు. భక్తుల కార్యాలలో ఎటువంటి అవరోధాలు ఏర్పడకుండా సిద్ధింపచేయడం వల్ల ఈ దైవానికి వరసిద్ధి వినాయకుడు అనే పేరు వచ్చింది. మూషికాన్ని వాహనంగా చేసుకోవడం వల్ల మూషికవాహనుడుగా పిలుస్తారు. ప్రమథ గణాలకు ఆధిపత్యాన్ని పొందడం వల్ల గణపతిగా పేరు పొందాడు. గజాసురుని శిరస్సును ధరించడం వల్ల గజముఖుడు, గజాననుడు అంటారు.

# విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడు

– కౌతా నిర్మల

ఏ పూజను, వ్రతాన్ని ఆచరించినా ముందుగా వినాయకుడిని పూజించిన తర్వాతనే ఆ పూజను ఆచరిస్తారు. తొలిపూజ అర్హతను వినాయకుడికి కల్పించాడు పరమేశ్వరుడు. భాద్రపద శుద్ధ చవితినాడే ఈశ్వరుడు వినాయకుడికి ప్రమథ గణాధిపత్యాన్ని ప్రసాదించినట్లుగా పురాణాల ద్వారా తెలుస్తోంది. ఆరోజున దేవతలు, మానవులు గణపతిని పూజిస్తారు. వినాయక వ్రతకథ చెప్పుకుని అక్షితలు శిరసుపై వేసుకుంటారు. విఘ్ననాయకునికి ఉండ్రాళ్ళు, కుడుములు, అరటిపళ్ళు, కొబ్బరికాయ, వడపప్పు, అటుకులు, బెల్లపుముక్కలు, పిండివంటలను నైవేద్యంగా సమర్పిస్తారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను నగరాలు, పల్లెల్లో వాడ వాడలా జరుపుతారు. నాలుగు రోడ్ల కూడళ్ళలో ఒక పక్కగా వినాయక మండపాలను ఏర్పాటు చేసి పూజలు చేస్తారు. తొమ్మిది రోజుల పాటు గణపతి విగ్రహానికి ఘనంగా పూజలు చేసి, సాయంత్రం సమయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. తొమ్మిది రోజులు గడిచిన తర్వాత గణేశ నిమజ్జనం రోజున వినాయకుని విగ్రహం చేతిలో ఉంచిన లడ్డును వేలం వేసి అధిక ధరల పలికిన వారికి ఆ లడ్డూని అప్పగిస్తారు.

వినాయకుని ముందు భక్తులు గుంజీళ్ళు తీస్తారు. విద్యార్థినీ విద్యార్థులు తమ పుస్తకాలను వినాయకుని ముందు పెట్టి పూజిస్తారు. అలా పుస్తకాలను పూజలో ఉంచడం వలన వారు విద్యలో రాణిస్తారని ఓ నమ్మకం. వినాయకుని 21 రకాలయిన పత్రితో పూజిస్తారు. తొమ్మిది రోజులు వినాయకునికి పూజలు జరిపిన తర్వాత వినాయకుని విగ్రహాన్ని మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్ళి నదులలో, చెరువులలో నిమజ్జనం

చేస్తారు. భక్తులందరూ ఆ ఊరేగింపులో పాల్గొంటారు.

గణపతి పుట్టుక గురించి పురాణాలలో తెలియజేయబడింది. పార్వతీదేవి అభ్యంగన స్నానం చేస్తూ, నలుగు పిండితో ఒక బాలుడి బొమ్మను తయారు చేసి, ఆ బొమ్మకు ప్రాణం పోసి, ద్వారం బయట ఆ బాలుని కాపలా ఉంచి లోపలకు ఎవ్వరినీ రానివ్వద్దని చెప్పింది. ఆ బాలుడు వాకిలి ముందు పహరా కాస్తున్న సమయంలో పరమేశ్వరుడు అరుదెంచాడు. అతడెవరో తెలియని ఆ బాలుడు అతనిని లోపలికి పోనివ్వకుండా అడ్డగించాడు. వారిద్దరి మధ్యా మొదట వాగ్వివాదం, ఆ తరువాత పోరాటం జరిగింది. పోరాట సమయంలో శివుడు ఆ బాలుని శిరస్సును త్రిశూలంతో ఖండించాడు. ఆ శిరస్సు దొర్లుకుంటూ ఎటో వెళ్ళిపోయింది. ఈలోగా శివుడు గృహంలోకి ప్రవేశించాడు. అభ్యంగన స్నానం చేసి అలంకరించుకున్న పార్వతీదేవితో సంభాషించసాగాడు శివుడు. వారి మాటల మధ్య ఆ బాలుని ప్రసక్తి వచ్చి, పార్వతీదేవి బయటకి వచ్చి చూసింది. శిరస్సు లేని బాలుని మొండెమును చూసి ఉమాదేవి ఎంతగానో తల్లడిల్లిపోయింది. ఆమె దుఃఖాన్ని చూసి చలించిపోయిన శివుడు ఆ బాలుని బ్రతికించాలని తల కోసం చూశాడు. కానీ ఆ బాలుని తల దొరకలేదు. అప్పుడు గజాసురుని తలను తెచ్చి ఆ బాలుడికి పెట్టి ఆ బాలునికి పునర్జన్మను ప్రసాదించాడు శివుడు.



ఆ బాలునికి ఏనుగు ముఖాన్ని ఎందుకు పెట్టాడు అన్నదానికి ఒక కథ ఉంది. పూర్వం గజాసురుడనే వాడు శివభక్తునిగా ఉండేవాడు. అతను ప్రతిరోజు శివపూజలు, అభిషేకాలు చేస్తూ శివధ్యానం చేసేవాడు. శివుడిని తన ఉదరంలో ఉండమని కోరాడా భక్తుడు. భోళాశంకరుడు అతనికి ఆ వరాన్ని ప్రసాదించి, అతని ఉదరంలోకి ప్రవేశించి అక్కడే ఉండిపోయాడు. శివుని ఉనికి తెలియక పార్వతీదేవి, కైలాసవాసులు, ప్రమథ గణాలు తల్లడిల్లిపోయారు. పార్వతీదేవి విష్ణుమూర్తి వద్దకు వెళ్ళి తన భర్త జాడ తెలుపమని కోరింది. విష్ణువు దివ్యదృష్టితో ఈశ్వరుడు గజాసురుని ఉదరంలో ఉన్నాడని తెలుసుకున్నాడు. శివుడిని బయటకు రప్పించటానికి విష్ణుమూర్తి ఒక ఉపాయాన్ని ఆలోచించాడు.

శివుని వాహనమైన నందీశ్వరుని గంగిరెద్దుగా అలంకరించి బ్రహ్మ తదితర దేవతలు బాజా భజంత్రీలుగా, విష్ణుమూర్తి వారందరికీ నాయకుడిగా గజాసురుని వద్దకు వచ్చి గంగిరెద్దుని ఆడించి, పాటలు, ఆటలతో అతడిని ప్రసన్నుడిని చేశారు. 'మీకేం కావాలో కోరుకోండి, మీ కోరికను తీరుస్తాను' అని గజాసురుడు వారితో చెప్పాడు. తమకు శివుడు కావాలని చెప్పాడు విష్ణుమూర్తి. వారంతా దేవతలు, దైవాలు అని, ఆ రూపాలు ధరించి వచ్చారని గ్రహించిన గజాసురుడు శివుడిని రెండు వరాలు కోరాడు. మొదటిది తన చర్మాన్ని శివుడు ధరించాలని, తన గజముఖం ఎప్పుడూ పూజింపబడాలనీ. ఆ రెండు వరాలనూ శివుడు గజాసురునికి ప్రసాదించాడు. గజాసురుని ఉదరాన్ని చీల్చుకుని శివుడు బయటకు రావటంతో గజాసురుడు మరణించాడు. అతనికి పరమేశ్వరుడు ప్రసాదించిన వర ఫలితంగా వినాయకునికి అతని తల అమర్చబడి అది పూజనీయమైంది.

వినాయక పూజ చేసుకున్నవారు, ఆరోజు చంద్రుని చూస్తే నీలాపనిందలు వస్తాయని, చవితినాడు చంద్రుని దర్శించకూడదని పార్వతీదేవి శాపం ఇచ్చింది. అలా ఆ మాతృమూర్తి శాపం ఇవ్వడానికి వెనుక ఒక కథ ఉంది. వినాయకుడు తనకు సమర్పించిన నైవేద్యాలను తృప్తితీరా ఆరగించి, ఆ తరువాత తల్లితండ్రులకు పాదాభివందనం చేయబోగా భుక్తాయాసం వల్ల అతనికి ప్రణామం చేయడం సాధ్యం కాలేదు. గణపతిని ఇబ్బందిని, అవస్థను గమనించిన శివుని తలపైన ఉన్న చంద్రుడు హేళనగా నవ్వాడు. పార్వతీదేవి ఆగ్రహించి, ఆ శాపం ఇచ్చిందని పురాణాల్లో తెలియజేయబడింది.

శ్రీకృష్ణుడు గోక్షీరంలో చవితినాడు చంద్రుని దర్శించడం వల్ల ఆయన శ్యమంతకమణిని అపహరించాడన్న అపవాదు కలిగింది. అంతటి భగవంతునికే నీలాపనింద ఏర్పడితే దేవతలు, సామాన్య మానవుల పరిస్థితి ఏమిటని భయపడి నీలాపనిందలు రాకుండా తరణోపాయం చెప్పమని కోరారు. భగవంతుడు సమర్థుడు కనుక నీలాపనిందను తప్పించుకోగలిగాడు. వినాయక చవితి రోజున యథావిధిగా వినాయక పూజను జరిపి, నైవేద్యం సమర్పించి శ్యమంతకమణి కథను చదువుకుని లేదా విని తమ చేతిలోని అక్షతలను శిరస్సున వేసుకుంటే చంద్రుడిని చూసినా దోషం ఉండదని వారికి చెప్పాడు శ్రీకృష్ణుడు. ఆ మాటలు విని దేవతలు, మునులు, మానవులు మిక్కిలి ఆనందించారు.

గణపతి అంటే జ్ఞానానికి ప్రతిరూపమని అంటారు. వినాయకుడు ఓంకార స్వరూపుడు. ఆయన తొండం ఒక ప్రణవం. పెద్ద పెద్ద చెవులు భక్తుల ప్రార్థనలు, విన్నపాలను ఆలకించి, వారి కోరికలను నెరవేరుస్తాడన్న దానికి సంకేతం. అంతేకాదు తాను విన్న విషయాలలోని మంచిని గ్రహించి, మరో చెవిలోంచి చెడును వదిలేయాలని కూడా ఆ చెవులు బోధిస్తాయని అంటారు. చిన్న చిన్న కళ్ళు సూక్ష్మదృష్టికి ప్రతీక. ఎదుటివారి తప్పులను ఆ కన్నులు చక్కగా పసిగట్టగలవు. మహాభారతాన్ని వ్యాస మహర్షి చెప్తుండగా వినాయకుడు తన దంతాన్ని పెరికి, ఆ దంతపు ముక్కను ఘంటంలా ఉపయోగించి రాశాడట. అందుకే వినాయకునికి రెండు దంతాలు సమానంగా ఉండవు.

# తిరుమల ప్రసాదాలలో కరివేపాకు ఎందుకు వెయ్యరు?

- శ్రీమతి వెలమకన్ని పద్మావతి

ఆనందనిలయంగా పిలవబడే తిరుమల ఆలయ గర్భగుడిలో కొలువై ఉన్న అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీనివాసుడు సాక్షాత్తు వైకుంఠవాసుడైన విష్ణుమూర్తిని తలపించేంతటి వైభవాన్ని మనకు దర్శింపచేస్తాడు. తిరుమలరాయని వైభవానికీ, వైభోగానికీ రెండే రెండు అంశాలు కారణాలుగా స్పష్టంగా గోచరిస్తాయి. మిరుమిట్లు గొలిపే అమూల్య రత్నాభరణాలు, ఉత్సవాలు, ఊరేగింపులు మొదటి అంశం కాగా రెండవ అంశం స్వామికి ఆరగింపు చేసే దివ్య ప్రసాదాలు. తిరుమలలో తప్ప ప్రపంచంలో మరెక్కడా ఇన్ని రకాల ప్రసాదాలు నివేదనకు తయారు కావేమో! శ్రీనివాసుడు ఎంతటి అలంకార ప్రియుడో అంతటి నైవేద్య ప్రియుడట! తనకు ఆరగింపు చేసిన నైవేద్యాలన్నీ భక్తులు నోరారా తినాలన్నది, ఆ భక్తవరదుని సంకల్పమట. అయితే తిరుమల దివ్య ప్రసాదాలలో కరివేపాకు మనకి మచ్చుకైనా కనిపించదు అన్న సత్యాన్ని మీరు ఎప్పుడైనా గమనించారా? గమనించకపోతే ఈసారి తిరుమల వెళ్ళినప్పుడు గుర్తు పెట్టుకొని మరీ గమనించండి. ఏ ప్రసాదంలోనూ, ముఖ్యంగా ఆంధ్రుల ఆరాధ్య పిండివంట పులిహోరలో కూడా ఒక్క కరివేపాకైనా మచ్చుకి కూడా కనిపించదు. తిరుమల ప్రసాదాలలో కరివేపాకు నిషేధమా? ఆ వివరాలూ విశేషాలూ మనం ఇప్పుడు తెలుసుకుందాం.

ఆకాశరాజు తన కుమార్తె అయిన పద్మావతిని శ్రీనివాసునికి ఇచ్చి పరిణయం చేశాడు. పద్మావతీదేవిని అత్తవారింటికి పంపేటప్పుడు విశేషంగా ధనాన్నీ, కనక సంపదనీ, వజ్రఖచిత ఆభరణాలనీ, అనేక వస్తు విశేషాలనీ, ఖాద్య సామగ్రినీ పెద్ద పెద్ద సారె పెట్టెలలో సర్ది, ఏనుగులు, గుర్రాలపై వాటిని అమర్చి అలిపిరి మార్గం ద్వారా తిరుమలకు పంపే ఏర్పాటు చేశాడు. అవి మోకాళ్ళ పర్వతాన్ని దాటుతుండగా అప్పటికే (శ్రీవారి మెట్టు మార్గం ద్వారా) అక్కడికి వచ్చిన శ్రీనివాసుడు "కొత్త కాపురానికి కావలసిన వస్తు సామగ్రి అంతా వచ్చినట్లేనా?" అని పద్మావతీ దేవిని ప్రశ్నించాడు. అప్పుడు పద్మావతీదేవి తనతో బాటుగా తెచ్చుకున్న సారెనంతా గుర్తు చేసుకుని "అన్ని వస్తువులూ అమరాయనీ, కేవలం కరివేపాకు మాత్రం తీసుకొని రాలేదని" చెప్పింది. "అంతటి చక్రవర్తి అయిన ఆకాశరాజుకి ఈ చిన్నవిషయం తెలీదా" అంటూ అలక వహించిన శ్రీనివాసుడు ఆకాశరాజు ప్రేమగా పంపిన సారెనంతా తిరస్కరించాడు. అంతేకాకుండా ఇకనుండి తిరుమల క్షేత్రంలో కరివేపాకు వాడకాన్ని పూర్తిగా నిషేధించమని కూడా శాసించాడు. నేటికీ తిరుమలలో శ్రీవారి శాసనం అమలు జరుగుతోంది. అందుకే తిరుమల ప్రసాదాలలో కరివేపాకు మనకి కనిపించదట. ఈ విషయానికి శాస్త్ర ప్రమాణం లేదుగానీ స్థానికంగా ప్రజల నోట ప్రచారంలో ఉన్న విషయం ఇది. కానీ అలిపిరి మార్గం ద్వారా తిరుమలకు నడిచి వెళ్ళే దారిలో జనబాహుళ్యంలో ప్రచారంలో ఉన్న ఈ కథకు కొన్ని సాక్ష్యాలు ఉన్నాయి. అలిపిరి నుంచి తిరుమల చేరడానికి 11 కిలోమీటర్ల దూరం దాటాలి. 3550 మెట్లు వుంటాయి. 2910 మెట్టు నుంచి మోకాళ్ళ పర్వతం అనే క్లిష్టమైన దారి మొదలవుతుంది. ఈ మోకాళ్ళ మిట్ట 600 మెట్లతో కూడి, దగ్గర దగ్గరగానూ (ఉన్న మెట్లతో), నిటారుగా ఉన్న మెట్లతో కూడిన దారి. 3260 మెట్టు వద్ద రామానుజుల వారి దేవాలయం దర్శనమిస్తుంది. 3302 మెట్టుపై నాలుగు భుజాలతో కోణాలతో తీర్చిదిద్దినట్లున్న చారలు గల "కావడిపెట్టెలు" లేదా "భోషాణం పెట్టెలు" ఆకారంలో కొన్ని రాతి శిలలు అస్తవ్యస్తంగా కనిపిస్తాయి. ఇవే శ్రీనివాసుని తిరస్కారానికి గురైన సారెపెట్టెలనీ, కాలక్రమంలో సారెపెట్టెలన్నీ బండరాళ్ళుగా మారాయనీ, జనాల నోట ప్రచారంలో వున్న కథకు ఈ బండరాళ్ళు సాక్ష్యంగా నిలుస్తాయనీ వీరి వాదన. ఈ సారెపెట్టెలలో ఒకదానిపై ఆంజనేయ స్వామివారి బొమ్మ దర్శనమిస్తుంది. ఈ బొమ్మను ఆకాశరాజు పంపిన సారెకు రక్షణభారం వహిస్తున్న ఆంజనేయస్వామికి ప్రతీకగా చెప్తారు. ఏనాటికైనా స్వామివారు అలకమాని ఈ సారెను స్వీకరిస్తారన్న నమ్మకంతో సారెకు రక్షణభారం వహిస్తున్న ఆంజనేయస్వామి నిరీక్షిస్తున్నాడని కూడా వీరి కథనం. ఈ కథనాలకు శాస్త్ర ప్రమాణికత మనకు లభించకపోయినా, తిరుమల ప్రసాదాలలో ముఖ్యంగా ఆంధ్రుల ఆరాధ్య పిండివంట పులిహోరలో కరివేపాకుకు స్థానం లేకపోవడం మాత్రం ముమ్మాటికీ నిజం. దయాసాగరుడు – భక్తజన బాంధవుడు అయిన సప్తగిరీశుడు కరివేపాకు లాంటి అల్పవిషయానికి అలుక వహిస్తాడా? సారెను తిరస్కరిస్తాడా? పైగా కరివేపాకు వాడకం మీద నిషేధం విధిస్తూ తిరుమలలో శాసనం విధిస్తాడా? నమ్మశక్యంగా లేదు. కానీ అలిపిరి నుంచి తిరుమలకు గల నడకమార్గంలో దర్శనమిస్తున్న బండరాళ్ళుగా మారిన కావడిపెట్టెలు – వాటికి కాపలా కాస్తున్న హనుమ చిత్రం – ఇవన్నీ ఈ కథ కూడా నిజమేమో అనే భావనను మనలో కలిగిస్తున్నాయే! ఏది ఏమైనా శ్రీవారికీ – దేవేరికీ మధ్య నడిచిన కరివేపాకు కలహం గురించి జనబాహుళ్యంలో ప్రచారంలో ఉన్న కథ ఇది.

★★★

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

వ్యాఖ్యాత : కె.వి.రాఘవాచార్యులు

## 319. పాథో లీలా విశారదాయ నమః

జలక్రీడా కుశలుడైన కృష్ణునికి నమస్కారము. కృష్ణుడు తోడి గోపబాలురతో కూడి గోవులను మేపుటకై యమునా నదీ తీరమునకు వెళ్ళేవాడు. గోవులు మేయుచుండగా కృష్ణాదులు కొంతసేపు ఆటలాడి, అలసి సేద తీరి యమునా నదిలో దిగి స్నానాలు – జలక్రీడలు – చేసేవారు.

జలక్రీడా నేర్పరియైన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 320. వంశీ గాన ప్రవీణాయ నమః

వేణుగాన విశారదుడయిన కృష్ణునకు నమస్కారము.

యమునా నదీ తీరమున నున్న వనమున వృక్షముల పంక్తులు బాగుగా వికసించిన పుష్పములతో కనువిందు చేయుచుండెను. తుమ్మెదల ఝంకారములు, పక్షుల కలకలా రావములు వనమంతటా ప్రతిధ్వనించుచుండెను. ఆ వనమున కృష్ణుడు బలరామునితో, గోపకుమారులతో కూడి ప్రవేశించి, గోవులను మేపుచు మధురముగా వేణువును ఊదినాడు. ఆ వేణుగానము తమ చెవులు సోకినంతనే వ్రజ కన్యలలో కృష్ణునిపై ప్రేమానురాగములు పెల్లుబికెను. అంతట కొంతమంది గోపికలు కృష్ణుని రూప గుణ వైభవమును, వేణుగాన వైభవమును, వేణుగాన ప్రావీణ్యమును ప్రస్తుతించినారు.

ఒక శరత్కాల మందలి పున్నమినాటి రాత్రి నిండు చంద్రుని చల్లని కిరణములతో బృందావనము సమీపమున నున్న వనమంతయు శోభాయమానమై రాగరంజితమై కలకలలాడుచుండెను. ఆ వెన్నెల శోభలను, వన రామణీయకమును, మనోహరమైన వాతావరణమును చూచి కృష్ణుడు గోప కన్యల మనస్సులు పారవశ్యమగునట్లు అత్యంత మధురముగ వేణుగానము చేసినాడు. అంతట కృష్ణుని యందే లగ్నమై యున్న మనస్సులు గల గోపకన్యలు ఆ కమ్మని మురళీ రవమును విన్నంతనే కృష్ణునిపై వారి ప్రేమానురాగములు పొంగి పొరలెను. అట్టి పారవశ్యమున కృష్ణుని దర్శనమునకై గోపకన్యలు తోటి వారితో చెప్పకయే మనోహరుని చేరుటకు పరుగులు తీసినారు. అట్టిది కృష్ణుని వేణుగాన ప్రావీణ్యము.

వేణుగాన ప్రవీణుడయిన కృష్ణునిగ జన్మంచిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 321. గోపీ హస్తాబుజార్చితాయ నమః

గోపికల పద్మముల వంటి చేతులతో పూజింపబడినవాడు లేక గోపికల చేతులందున్న పద్మముల చేత పూజింపబడినవాడు అనియు భావము చెప్పవచ్చును.


అంబుజమనగా పద్మము. పద్మ పుష్పము లక్ష్మి నివాసము. లక్ష్మీదేవి పద్మాలయ. పద్మ అనగా లక్ష్మి. కనుక పద్మములతో పూజించుట విష్ణుదేవునికి, శ్రీనివాసునికి అత్యంత ప్రీతికరమైన పూజ. కనుక గోపకన్యలు విష్ణుదేవుని అవతారమగు కృష్ణుని పద్మములతో పూజించి తరించారు.

గోపికల చేత పద్మములచే పూజింపబడిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చావతారమగు వేంకటేశునకు నమస్కారము.

## 322. ముని పత్న్యాऽऽహృతాహారాయ నమః

ముని భార్యల చేత భక్తితో తీసుకొని రాబడిన ఆహారము గలవాడు కృష్ణుడు.

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**





**అన్ని నామాలూ నీవే అయిన**
**ఓ వేంకటేశా! నీకు నమస్కారము**

ఒక వేస వి కాలమున బలరామకృష్ణులు, గోపబాలురు యమునా నదీ సమీపమున గల ఉపవనములందరి పచ్చిక బయళ్ళలో గోవులను మేపుచుండిరి. మధ్యాహ్నము దాటగా వారు ఆకలి గొని గోపబాలురు బలరామకృష్ణుల దగ్గరకు వెళ్ళి మేము ఆకలితో నకనకలాడుచున్నాము. మా ఆకలి బాధను మీరే తీర్చవలయునని ప్రార్థించారు.

కృష్ణుడు గోపబాలరు మాటలను విని, ఆ సమీపముననే మునులు అంగిరసము అను యజ్ఞము చేయుచున్నారు. మీరు వారి వద్దకు వెళ్ళి మేము పంపినట్లుగ చెప్పి అన్నమును కోరుడు. వారు మీకు ఆహారమును ఇవ్వగలరని చెప్పినాడు. వెంటనే గోపబాలురు యజ్ఞమును చేయుచున్న బ్రాహ్మణుల దగ్గరకు వెళ్ళినారు. వారి ఎదుట నిలిచి నమస్కరించి బ్రాహ్మణులారా! మేము గోపాలురము. బలరామకృష్ణులు మీకు శుభములను గోరుచు మమ్ము మీ వద్దకు ఆహారమునకై పంపినారు. బలరామకృష్ణులు ఇచ్చటికి సమీపముననే గోవులను మేపుచున్నారు. వారు ఆకలిగొని అన్నమును అడుగుచున్నారు. బ్రాహ్మణులారా! మీకు ఆ సోదరుల (బలరామకృష్ణుల) యెడ శ్రద్ధాదరములు ఉన్నచో దయతో మాకు, వారికి అన్నములను ప్రసాదింపుడు అని కోరినారు. అచ్చట యజ్ఞము చేయుచున్న బ్రాహ్మణులు పరమ మూర్ఖులు. జ్ఞానులమని తమను గొప్పగా తలంచువారు. అందువలన ఆ బ్రాహ్మణులు గోపబాలరు మాటలు వినియు విననట్లు ఉండిరి. ఔనని గాని, కాదని కాని చెప్పకుండ, మిన్నకున్నారు. అంతట గోపబాలురు నిరాశతో మరలి వచ్చి బలరామకృష్ణులకు వాస్తవ విషయములను వివరించినారు. వారి మాటలు విని కృష్ణుడు మిత్రులారా! ఈసారి మీరు బ్రాహ్మణ పత్నుల దగ్గరకు వెళ్ళి నమస్కరించి సమీపమున బలరామకృష్ణుల వచ్చియున్నారు. వారు పంపగా మీ వద్దకు వచ్చినాము. వారు మేము ఆకలి గొని ఉన్నాము. మా అందరికీ భోజన పదార్థములను ప్రసాదించండి అని ప్రార్థించండి అని చెప్పగా గోపబాలురు అట్లే చేసినారు.

ఆ విప్ర పత్నులు ఇంతకుముందే కృష్ణుని రూప సౌందర్యమును, లీలా విలాసములను విని యుండిరి. ఆ స్వామిని ఎప్పుడు చూతమో గదా అను ఉత్కంఠతో ఉన్నారు. ఇప్పుడు గోపకుల వలన కృష్ణుడు తమ సమీప ప్రదేశమునకు వచ్చి యున్నట్లు విన్నంతనే వారు తత్తరపాటుకు లోనైరి. వెంటనే ఆ సాధ్వీమణులు అందరూ ఘుమ ఘుమలాడుతున్న రుచికరములైన చతుర్విధ భోజన పదార్థములను (భక్ష్య, భోజ్య, చోష్య, లేహ్యములను) వివిధ పాత్రలలో తీసుకుని తమకు మిక్కిలి ఇష్టుడైన కృష్ణుని వద్దకు తమవారు అడ్డు చెప్పినను లెక్క చేయక నదులు సముద్రుని చెంతకు పరుగెత్తునట్లు పరుగు పరుగున కృష్ణుని చెంతకు చేరినారు. అప్పుడు కృష్ణుడు యమునా తీరమున అశోక వృక్షములు గల ఉపవనము నందు బలరామునితో, గోప బాలురతో కూడి విహరించుచుండెను. కృష్ణుని దర్శించినంతనే వారు ఎంతయు ఆనందించినారు. వారు తెచ్చిన ఆహార పదార్థములను కృష్ణుని ముందు పెట్టినారు. అంత కృష్ణుడు విప్రపత్నులారా! నాపై ఉన్న భక్తితో నన్ను దర్శించుటకు మీరు వచ్చి ఆహార పదార్థములు కూడా మా అందరికీ తెచ్చి ఇచ్చినారు. సంతోషం. మీరు వచ్చిన ప్రయోజనం నెరవేరింది. ఇక మీరు స్వగృహములకు వెళ్ళవచ్చునని చెప్పినాడు. బ్రాహ్మణుల భార్యలు కృష్ణుని మాటను పాటించి ఆ స్వామిని తమ హృదయమున నిలుపుకుని ఆనందముతో స్వస్థానములు చేరినారు. అంత కృష్ణుడు విప్రపత్నులు సమర్పించిన చతుర్విధములగు భోజన పదార్థములను ముందుగా గోపాలురచే భుజింప చేసిన తరువాత బలరామకృష్ణులు తాము స్వయముగా భుజించి సంతృప్తులైనారు.

విప్ర పత్నులు తెచ్చి ఇచ్చిన ఆహారమును స్వీకరించిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

ధారావాహికం



# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

''సూర్యుడు ఉదయగిరిలో బయలుదేరుతాడు. నేనూ బయలుదేరుతాను. అతనికంటే ముందుగా అస్తాద్రి చేరుతాను. మళ్ళీ తిరిగి వస్తాను. మధ్యాహ్న సమయంలో సూర్యునికి ఎదురుపడతాను. భూమిని తాకకుండా మళ్ళీ వేగంగా ఉదయగిరి చేర్తాను. తిరిగి వస్తాను. సూర్యునికి ఎదురుగా పోతాను. ఆకాశంలో సంచరించే ప్రాణుల్ని దాటి వేగంగా పోగలను''.

''నేను సముద్రాన్ని సంక్షోభింప చేస్తాను. భూమిని చీల్చుతాను. పర్వతాల్ని చూర్ణం చేస్తాను. ఇక మహాసముద్రం దాటడం ఎంత? నాలాగా ఎగిరే శక్తి ఇద్దరికి ఉంది. ఒకరు వాయుదేవుడు ఇంకొకరు గరుత్మంతుడు. ఆ ఇద్దరే నన్ను వెంబడించగలరు''.

''వానరులారా! నేను సీతాదేవిని చూస్తాను. అది నా నమ్మకం. మీరిక్కడ సంతోషంగా ఉండండి. నేను పది వేల యోజనాల దూరం పోగలను. దేవేంద్రుణ్ణి బ్రహ్మదేవుణ్ణి జయించి – అమృతాన్ని తీసుకురాగలను. అది నా నమ్మకం. నా శక్తి'' అంటూ సింహనాదం చేశాడు హనుమంతుడు.

వాయుపుత్రుణ్ణి చూశారు వానరులు. విస్మితులైనారు. జాంబవంతుడు అంటున్నాడు ''వీరుడా! వాయుపుత్రా! మా దుఃఖం పోగొట్టావు. మేం నీ శుభం కోరుతున్నాం. మహర్షుల అనుగ్రహంతో పెద్దల అనుగ్రహంతో సముద్రాన్ని దాటగలవు. తిరిగి రాగలవు. నీవు వచ్చేవరకు ఇక్కడే ఉంటాం. మా ప్రాణాలన్నీ నీ చేతుల్లో ఉన్నాయి. ఒంటికాలి మీద నిలబడి వుంటాం. నీ కోసం నిరీక్షిస్తూ ఉంటాం''.

విన్నాడు హనుమతుండు. మహేంద్ర పర్వతం చేరాడు. అక్కడి ప్రకృతి శోభాయమానంగా ఉంది. సింహాలు శార్దూలాలు స్వేచ్ఛగా తిరుగుతున్నాయి. శత్రు మర్దనుడు వాయుపుత్రుడు అటూ ఇటూ పచార్లు చేశాడు. మారుతి మహాకాయంలో ఉన్నాడు. అతడి పాద ఘట్టనలకి పర్వతం నలిగిపోయింది. కంపించింది. రాళ్ళు గుట్టలుగా చెదిరిపడ్డాయి. జింకలు ఏనుగులు భయపడ్డాయి. పరుగులు తీశాయి. పక్షులు ఎగిరిపోయాయి. రాళ్ళ సందుల్లోని పాములు బయటపడ్డాయి. బుసలు కొట్టాయి. పడగలు విప్పాయి. అది ఎలా ఉందంటే పర్వతాగ్రాన పతాకాలు ఎగురుతున్నాయంటాడు వాల్మీకి. అక్కడి గంధర్వులు, విద్యాధరులు భయపడ్డారు. తమ నెలవులు విడిచారు. ఆకాశంలోకి ఎగిరారు. ఋషులు కూడా పర్వతం వదిలారు. ఆ పరవీరహంత మహానుభావుడు యశస్వి హనుమంతుడు దృఢమనస్కుడైనాడు. మనసులో లంకానగరానికి పోయాడు.

ఇక్కడ హనుమంతుడు తనని తాను పొగుడుకున్నాడు. అది రజోగుణ దోషం. నిజంగా అతడు సత్వగుణ ప్రధానుడు. అయితే రజోగుణం పైకి పొంగింది. అంటే ఎవరూ సముద్రాన్ని దాటలేరని

భీతి వుంది. దిగులు వుంది. దాన్ని పోగొట్టాలనుకున్నాడు మారుతి. తన శక్తి ఎంతో తెలియచెప్పాడు. వానరుల్ని సంతృప్తి పరచాడు. భయం దిగులు పోగొట్టాడు. అంతేకాని తన్ను తాను మరచిపోలేదు. తనని నియమించేవాడు శాసించేవాడు అంతర్యామిగా ఉన్నాడని భావించాడు. ఆ స్వామిని మరువలేదు. అంతా తానే అని, తానే చేసేవాణ్ణని, చేసేదంతా తన ప్రీతి కోసమని భావించేవాడు అల్పుడు. అలా భావించేవాడు స్వార్థ ప్రవృత్తి కలవాడు. కాని వాయుపుత్రుడు అలా అనుకోలేదు. తనకు ప్రేరణ రాముడని రామబాణంలో దూసుకుపోతానని – సముద్ర లంఘన సమయంలో రాముని స్మరించాడు హనుమ. అతనిలో అసుర భావం లేదు. రజోగుణం లేదు. పరుల కష్టాల్ని బాధల్ని తొలగించేవాడికి భగవత్ సహాయం సర్వదా లభిస్తుంది.

మనం చేసే ప్రతి పనిలో భగవంతుని స్మరించాలి. ఆ స్వామి సాయం ఉండాలి. అపుడే విజయం సాధించగలం. అర్జునుడు అలాగే స్మరించాడు. కృష్ణభగవానుని సాయం పొందాడు. విజయం పొందాడు. చేసే ప్రయాణంలో భగవత్ సంకల్పం ఉంటే సత్ ఫలాన్ని అందుకుంటాం. మారుతికి అటు వాయుదేవుని సాయం ఇటు రామానుగ్రహం లభిస్తుంది. సఫలీకృతుడు కాగలడు.

**కిష్కింధకాండ సమాప్తం**

## సుందర కాండ

ఈ కాండ ప్రారంభశ్లోకం హనుమంతుణ్ణి శత్రు కర్షణుడు అన్నాడు వాల్మీకి. అంటే శత్రువుల్ని కృశింపచేసేవాడు. రూపు మాపేవాడు. అంతేకాదు సముద్ర లంఘన సమయంలో ఛాయాగ్రాహిని చంపాడు. లంకిణి పీచమణిచాడు. అశోకవనం ధ్వంసం చేశాడు. జంబుమాలిని చంపాడు. రావణ మంత్రుల్ని చంపాడు. సేనాపతుల్ని చంపాడు. అక్ష కుమారుని అంతం చేశాడు. రావణునికి మూలబలం ఉంది. ఎన్నో వేల మంది రాక్షసులున్నారు. అందులో అంటే మూలబలంలో పాతిక భాగం సర్వనాశనం చేశాడు వాయుపుత్రుడు. శత్రుకర్షణుడంటే మరో అర్థం ఉంది. బాహ్య శత్రువులనే కాదు కామ క్రోధాది అంతశ్శత్రువులను కూడా అణచగల్గాడని చెప్పవచ్చు.

శ్రీ రామాయణంలో ప్రతి కాండకి ఒక్కో పేరుంది. పేర్లు పెట్టడంలో సిద్ధహస్తుడు వాల్మీకి. బాలకాండ అయోధ్యకాండ అరణ్యకాండ కిష్కింధకాండ. ఇలా ఉన్నాయి పేర్లు. ఉదా : అయోధ్య కాండలో అయోధ్యలో జరిగిన సన్నివేశాలు వివరింపబడ్డాయి. అలాగే తక్కిన కాండల్లోని విశేషాలు వివరింపబడ్డాయి. అయితే ఈ కాండకి సుందరకాండ అని పేరు. అది ఎందుకు పెట్టాడు వాల్మీకి – సముద్రలంఘన కాండ అనలేదు. సీతాదర్శనకాండ అనలేదు. హనుమత్ విజయం అనలేదు. సుందరకాండ అన్నాడు. ఏమిటి దాని ఆంతర్యం – ప్రశ్న.

హనుమంతుడు సుందరుడు. సీతాదేవి సుందరి. రాముడు సుందరుడు. లంకా నగరం సుదరం. అశోకవనం సుందరం. వివిధ ఛందస్సులలో సాగిన వాల్మీకి రచనాశైలి సుందరం. మొత్తం కాండ అంతా సుందరమయం.

ఈ సుందరకాండని ఉపాసనా కాండ అంటారు. నిత్యపారాయణ కాండ అంటారు. ఆధ్యాత్మిక రహస్యాలున్న కాండ సుందరకాండ. లంక అనేది ఒక శరీరం. సీతమ్మ జీవస్వరూపం. హనుమంతుడు ఆచార్యుడు. రాముడు పరమాత్మ. అలా అంతర్వాహినిగా తెలియజేశాడు వాల్మీకి మహర్షి.

భగవంతుణ్ణి చేరటానికి జీవుడు చేయాల్సిన పనులు రెండు. స్వామిని చేరడంలోని అడ్డంకుల్ని తొలగించుకోవడం. ఇది ఒకటి. రెండోది నిరంతర భగవన్నామ స్మరణం. అదే ఉపాసన. అదే తపస్సు. సీతమ్మ అలాంటి తపస్సు చేసింది. భగవదాజ్ఞ (రామాజ్ఞ) లేదు రావణా! బతికి పోయావు. లేకపోతే నిన్ను భస్మం చేసేదాన్ని అంది సీతమ్మ. తపస్సులో ఉన్నాను అంది. అది కొసమెరుపు. అంటే జీవుడు పరతంత్రుడు. సర్వ స్వతంత్రుడు పరమాత్మ.

భగవల్లీలలు చిత్ర విచిత్రాలు. ఏది ఎపుడు ఎలా ఎందుకు ఎవరివల్ల జరుగుతుందో చెప్పలేం. అయోధ్యలో రామయ్య ఉన్నాడు. మిథిలలో వుంది సీతమ్మ. ఇద్దరూ ఒకటి కావాలి. వచ్చాడు విశ్వామిత్రుడు. ఇద్దరినీ కలిపాడు. అదొక విచిత్రం. మరో విచిత్రం ఉంది. సీత మనసు విషయాసక్తమైంది. అది అశాశ్వతమని తెల్సు. అయినా మాయలో పడింది. పక్కనే ఉన్నాడు (భగవంతుడు) రాముడు. అతడు శాశ్వతుడని తెల్సు. అయినా మాయ కమ్మింది. భగవంతుణ్ణి విస్మరించింది మైథిలి. మాయ లేడిపై మనసు పారేసుకుంది. ఫలితం – రావణుని రాక. సీతాపహరణం. భరింపరాని వియోగం. చివరికి భగవత్ భాగవత అపచారాలు తెల్సుకుంది జానకి. లంకలో నిరంతరం రామనామ జపం. అదే ఆమెకు ధారణ పోషక భోగ్యాలు. అదే శరణాగతి. భగవదనుగ్రహం లభించింది. ఆచార్యుడు హనుమంతుడు వచ్చాడు. సీతారాముల కలయికకు ప్రధాన కారకుడైనాడు.

## సముద్ర లంఘనం

శత్రుకర్షణుడు హనుమంతుడు. అతణ్ణి ప్రేరేపించాడు జాంబవంతుడు. సీతాన్వేషణకు సిద్ధమైనాడు. చారణాది దివ్యజాతులున్నారు. వారు సంచరించే ఆకాశమార్గం గమనించాడు. సముద్ర లంఘనానికి పూనుకున్నాడు.

**దుష్కరం నిష్ప్రతిద్వంద్వం చికీర్షన్ కర్మ వానరః**

సాధ్యం కానిది సాటిలేనిది – ఒక సాహస కార్యం చేయటానికి సిద్ధపడ్డాడు. ఆ సముద్ర లంఘనం ఒక దుష్కర కర్మ.



చూడసాగారు.

హనుమంతుడు ఒళ్ళు విరిచాడు. ఒంటిమీది రోమాలు నిక్కపొడిచాయి. మేఘంలా గర్జించాడు. తోక జాడించాడు. అది గరుత్మంతుడు ఎత్తుకెళ్తున్న మహాసర్పంలా ఉంది. చేతులు ముందుకు చాచాడు. బిగపట్టాడు. నడుము కుదించాడు. భుజాల్ని మెడని వంచాడు. శక్తిని సామర్థ్యాన్ని పరాక్రమాన్ని ఆవేశింపచేసుకున్నాడు. పైకి చూశాడు. వెళ్ళాల్సిన దూరాన్ని అంచనా వేశాడు. ప్రాణవాయువుని హృదయంలో బంధించాడు. శ్రవణేంద్రియాల్ని స్తంభింపచేశాడు. పాదాలతో నేలని తన్నాడు.

అది మహేంద్రగిరి. దానిపైకి ఎక్కాడు హనుమంతుడు. నిలిచాడు. పెద్దమడుగులోని మదపుటేనుగులా కనిపించాడు. మెడ నిటారుగా పెట్టాడు. తల పైకెత్తాడు. ఆబోతులా ప్రకాశించాడు. సముద్రాన్ని చూశాడు. అక్కడ పచ్చిక బయళ్ళని చూశాడు. అటు ఇటు పచార్లు చేశాడు. పక్షులు చెదిరిపోయాయి. చెట్లని ఎదురు రొమ్ముతో పడతోశాడు. ఒక సింహంలా చెలరేగాడు. మృగాలు చనిపోయాయి. యక్షులు కిన్నరులు గరుడులు పన్నగులు అందరూ కామరూపులు. హాయిగా విహరిస్తున్నారు.

సూర్యునికి ఇంద్రునికి వాయుదేవునికి బ్రహ్మదేవునికి పంచభూతాలకి మారుతి నమస్కరించాడు. తూర్పు వైపు తిరిగాడు. జన్మకారకుడు వాయుదేవుడు. అతణ్ణి స్మరించాడు. మళ్ళీ నమస్కరించాడు. పర్వదినాల్లో ఉప్పొంగే సముద్రంలా ఉన్నాడు. వానరులందరూ చూస్తున్నారు. తన దేహాన్ని పెంచాడు. అంతులేకుండా పెరిగాడు. దక్షిణ దిశగా పోవాలనుకున్నాడు. రామకార్యం సిద్ధించాలనుకున్నాడు. చేతులతో కాళ్ళతో కొండని అదిమాడు. ఆ పర్వతం కొన్ని క్షణాలు కంపించింది. ఆ కుదుపులో చెట్ల పూలన్నీ రాలిపడ్డాయి. కొండని కప్పేశాయి. అదొక పూలకొండలా కనిపించింది. సెలయేళ్ళు జాలువారాయి. బంగారు వెండి కాటుక రంగులో ఉన్నాయి నీళ్ళు. కొండ పగుళ్ళు బారింది. కొన్ని రాళ్ళు కింద పడ్డాయి. గుహల్లోని జంతువులు వికృతంగా అరిచాయి. పాములు విషాగ్నుల్ని కక్కాయి. కోరలతో రాళ్ళని కాటు వేశాయి. ఆ రాళ్ళు ముక్కలైనాయి. అక్కడ ఎన్నో ఓషధులున్నాయి. ఆ విషాగ్ని జ్వాలల్ని చల్లార్చలేకపోయాయి అవి. కొండ పగిలిపోతుందని భయపడ్డారు తాపసులు. విద్యాధరులు చూశారు. తమ స్త్రీలతో ఆకాశంలోకి ఎగిరారు.

''దాట శక్యం కానిది సముద్రం. ఇతరులకి అసాధ్యం. పర్వతాకారుడు వాయుపుత్రుడు హనుమంతుడు సముద్రాన్ని లంఘిస్తున్నాడు'' అన్నారు ఋషులు చారణులు సిద్ధులు. ఆ మాటలు విన్నారు విద్యాధరులు. ఆకాశంలో నిలిచారు.

చెవులు రిక్కించాడు. అంటున్నాడు.

''వానరులారా! రామబాణంలా పోతాను. లంక చేరతాను. సీతాదేవిని వెతుకుతాను. కనిపించకపోతే దేవలోకం పోతాను. అక్కడా లేదనుకో తిరిగి లంకకి వస్తాను. రావణున్ని బంధిస్తాను. వాడితో లంకను పెళ్ళగిస్తాను. ఇక్కడికి తెస్తాను. అనుకున్నది సాధిస్తాను'' — అమిత వేగంతో ఎగిరాడు. తనని గరుత్మంతునిలా భావించుకున్నాడు.

మారుతి తీరు యోగాభ్యాసంలోని అంగాల్ని తలపింపచేస్తున్నాయి. ప్రాణాయామం, దృష్టి నిలపటం పాదఘట్టనం (ఆసన సూచిక). తనని రామబాణంలా పోల్చుకున్నాడు. రామబాణం లక్ష్యం చేరుతుంది. గరుడునితో పోల్చుకున్నాడు. తనకి రెక్కలున్నట్లు భావించాడు. గరుడ గమన శక్తిని పుంజుకున్నాడని తాత్పర్యం.

మహావేగంతో ఎగిరాడు హనుమంతుడు. అతని తొడల వేగానికి చెట్లు పెళ్ళగించబడ్డాయి. పూలతో నిండిన కొమ్మలు పక్షులు హనుమంతుని వెంటపడ్డాయి. ఊరెళ్ళేటప్పుడు ఆత్మీయులు వెంట నీటి దాకా వెళ్తారు. వీడ్కోలు పలుకుతారు. అలా చెట్లు పూలు పక్షులు అనుసరించాయి. రాజు వెంట వెళ్ళే సైనికుల్లా ఉన్నాయట. బరువుగా ఉన్న చెట్లు దభేలుమని నీళ్ళలో పడ్డాయి. పూలు కొమ్మలు కొంతదూరం పోయాయి. సముద్రంలో పడ్డాయి. మారుతి శరీరాన్ని కొన్ని పూలు అంటుకుని ఉన్నాయి. రాత్రి మిణుగురు పురుగులతో మెరిసే పర్వతంలా కనిపించాడు హనుమంతుడు. మెరుపుతీగెలతో పోయే మేఘంలా కనిపించాడు. చాచిన రెండు చేతులు అయిదు తలల పాముల జంటలా కనిపించాయి. ఎర్రని ముక్కు సంధ్యారాగం పులుముకున్న సూర్యమండలంలా కనిపించింది. తోక ఆకాశంలో ఇంద్ర ధ్వజంలా కనిపించింది. తోక గుండ్రంగా చుట్టుకున్నపుడు సూర్యుని చుట్టూ కట్టిన గూడులా (పరివేషంలా) కనిపించింది. అతని చంకల్లో గాలి — ఆకాశంలో గాలి

రెండూ కలిశాయి. భయంకరంగా శబ్దిస్తున్నాయి. దక్షిణానికి పోతున్న తోకచుక్కలా కనిపించాడు హనుమంతుడు. రెక్కల్లేని కొండలా కనిపించాడు మారుతి. తోకను ముడుస్తున్నాడు. వేళ్ళాడదీస్తున్నాడు. అది ఎలా ఉందంటే – తాళ్ళు తెంచుకుని పోతున్న ఏనుగులా ఉన్నాడట. అతని నీడ నీళ్ళలో పడుతోంది. అది ఒక ఓడలా కనిపిస్తోందట. అతని గమనశక్తికి సముద్రం అల్లకల్లోలమవుతోంది. పిచ్చెత్తినట్లుందిట. పైకి ఎగురుతున్నాయి అలలు. అవి హనుమంతుని రొమ్ముకు తగులుతున్నాయి. చెల్లాచెదరైపోతున్నాయి. తిమింగలాలు తాబేళ్ళు మొసళ్ళు తక్కిన జల జంతువులు పైకి కనబడుతున్నాయి. గరుత్మంతుడేమో అని పాములు భయపడ్డాయి. అతని నీడ ముప్పై యోజనాల పొడవు పది యోజనాల వెడల్పుగా కనపడుతోంది. అంటే ఉదయం సముద్ర లంఘనం జరిగింది. అందుకే నీడ పెద్దదిగా ఉంది. మారుతి మేఘాల మధ్య మరుగు పడుతున్నాడు. మళ్ళీ కనిపిస్తున్నాడు. అంటే మేఘాల్లోని చంద్రునిలా సాగుతున్నాడు.

తన తాపం తగ్గించుకున్నాడు సూర్యుడు. గాలి అనుకూలంగా వీస్తోంది. ఉత్తరానికి తోక – దక్షిణానికి సాగుతున్న తోకచుక్కలా కనిపిస్తున్నాడు వాయుసుతుడు. అది రాక్షస వినాశనాన్ని సూచిస్తోందంటాడు వాల్మీకి. హనుమంతుని చూశారు దేవతలు. పుష్పవృష్టి కురిపించారు. ఋషులు స్తుతించారు. గంధర్వులు పాడారు. నాగులు యక్షులు కిన్నరులు కింపురుషులు మెచ్చుకున్నారు మారుతిని.

సముద్ర లంఘనానికి ముందు హనుమంతుని భంగిమలు యోగశాస్త్రానికి చెందినట్లున్నాయి. రామార్థం సముద్ర లంఘనమన్నారు ఋషులు. భగవంతుని చేతి పరికరం అనుకున్నాడు హనుమంతుడు. చారణులు వెళ్ళే మార్గంలో వెళ్తున్నాడు మారుతి. యద్యత్ ఆచరతి శ్రేష్ఠః – పెద్దల ఆచరణ అనుసరణీయం. కొత్త దారిలో పోతే – కోరి కష్టాలు తెచ్చుకోవచ్చు.

## మైనాకుడు

ఆకాశంలో అలా వెడుతున్నాడు హనుమంతుడు. నేను సైతం... సాయపడాలనుకున్నాడు సముద్రుడు. ఇక్ష్వాకు వంశీయుడు సగరుడు. అతని కొడుకులు సగరులు. వాళ్ళతో ఏర్పడింది సముద్రం. అందుకు కృతజ్ఞత చూపాలి. లేకపోతే నిందల పాలవుతాను – అనుకున్నాడు సముద్రుడు. మారుతిని చూశాడు. రామకార్యానికి తోడ్పడాలి. ఆలోచించాడు. తనలో దాగి ఉన్నాడు మైనాకుడు. పిలిచాడతణ్ణి. ''పాతాళంలో రాక్షసులున్నారు. వాళ్ళని రానివ్వలేదు. దారికి అడ్డంగా ఉన్నావు. నీవు పక్కలకి పైకి కిందికి పెరిగేవాడివి. ఆ శక్తి నీకు ఉంది. రాముడు ఇక్ష్వాకు వంశస్థుడు. నాకు పూజనీయుడు.

**కర్తవ్యమకృతం కార్యం సతాం మన్యుముదీరయేత్**

చేయాల్సిన పని సకాలంలో చేయాలి. శక్తి ఉండి చేయకపోతే కోపిస్తారు పెద్దలు. ఇపుడు రామకార్యార్థం వస్తున్నాడు హనుమంతుడు. ఆకాశంలో పోతున్నాడు. అతడు మన అతిథి. పరమ పూజ్యుడు. అతనికి విశ్రాంతి ఇవ్వాలి. 'హిరణ్య నాభుడా! దేవగంధర్వ సేవితుడా! మైనాకుడా! త్వరగా రా. ఆలసించకు. అదో వచ్చేస్తున్నాడు వాయుపుత్రుడు''.

విన్నాడు మైనాకుడు. పైకి లేచాడు. గిరిశిఖరాలు బంగారుమయం. అద్భుత కాంతులీనుతున్నాయి. చూశాడు మారుతి. అదొక విఘ్నం అనుకున్నాడు. తన రొమ్ముతో పడతోశాడు. హర్ష పులకితుడైనాడు మైనాకుడు. మానవరూపం ధరించాడు.

''వానరోత్తమా! దుష్కర కార్యం తలపెట్టావు. నా శిఖరాలపై విశ్రమించు. అలసట తీర్చుకో. రామకార్యార్థివి. మా అతిథివి. నా సపర్యలందుకో.

**కృతేచ ప్రతికర్తవ్యమ్ ఏష ధర్మ స్సనాతనః**

''మేలు చేసిన వాళ్ళకి ప్రత్యుపకారం చేయాలి. అది అందరి కర్తవ్యం. అది సనాతన ధర్మం. సముద్రుడు నీకు సాయపడాలన్నాడు. కందమూలాలున్నాయి. తియ్యని పండ్లు వున్నాయి. వాటిని తీసుకో. విశ్రాంతి పొందు. తర్వాత ముందుకు పోవచ్చు''.

హనుమా! పూర్వం పర్వతాలకి రెక్కలుండేవి. అవి ఎక్కడికైనా ఎగిరిపోతుండేవి. చూశారు దేవతలు, మహర్షులు తదితరులు. అవి తమమీద పడతాయేమోనని భయపడ్డారు. గమనించాడు దేవేంద్రుడు. వజ్రాయుధం తీశాడు. రెక్కల్ని నరకసాగాడు. నన్ను చూశాడు. మీద మీదకి వచ్చేస్తున్నాడు ఇంద్రుడు. నేను ఎగిరాను. వాయుదేవుడు సాయపడ్డాడు నాకు. ఈ సముద్రంలో పడ్డాను. దాగాను. నన్ను కాపాడింది నీ తండ్రి. నిన్ను పూజిస్తే నీ తండ్రిని పూజించినట్లే. నా మీద నిలు. మార్గాయాసం తీర్చుకో. నా స్నేహాన్ని సమ్మానించు''.

విన్నాడు వాయుసుతుడు. అంటున్నాడు.

**ప్రీతోస్మి కృతమాతిథ్యం మన్యురేషోపనీయతామ్**
**త్వరతే కార్యకాలో మే అహశ్చాప్యతి వర్తతే**
**ప్రతిజ్ఞా చ మయా దత్తా నస్థాతవ్యమి హాంతరే**

''సంతోషించాను. ఆతిథ్యం స్వీకరించినట్లే. వుండాలని పట్టు పట్టకు. పని తొందరలో ఉన్నాను. పొద్దు వాలిపోతోంది. ప్రతిజ్ఞ చేశాను. మధ్యలో ఆగరాదు అని మైనాకుణ్ణి చేత్తో తాకాడు. ముందుకు సాగాడు. సంతృప్తి చెందాడు మైనాకుడు. కార్యం సిద్ధిస్తుంది – ఆశీర్వదించాడు.

సముద్ర లంఘనం మొదటి దుష్కర కార్యం. మైనాకుణ్ణి అధిగమించడం రెండో దుష్కర కార్యం. మైనాకుణ్ణి చూశాడు ఇంద్రుడు. నేను సంతోషిస్తున్నాను. నీకు అభయమిస్తున్నాను. నిర్భయంగా ఉండు'' అన్నాడు.

(సశేషం)

# ముకుందమాల

- డా|| భువనేశ్వరి మారేపల్లి, 9550241921

ధారావాహికం



## 22 శ్లోకం

భక్తాపాయభుజంగ గారుడమణి: త్రైలోక్య రక్షామణి:
గోపీలోచన చాతకాంబుదమణి: సౌందర్యముద్రామణి: ।
యః కాంతామణి రుక్మిణీ ఘనకుచద్వంద్వైక భూషామణి:
శ్రేయో దేవశిఖామణి ర్దిశతు నో గోపాలాచూడామణి: ॥

భక్తుల యొక్క అపాయములనే పాములకు గరుడమణి వంటివాడు, అంటే గరుడుడి యొక్క స్పర్శ చేత లేదా దర్శనము చేతనైనా సరే సర్పాలు పారిపోతాయి. అలాగే భగవద్దర్శనం చేత, స్మరణ చేత భక్తుల అపాయములు విడిపోతాయి. గరుడమణి అనే పచ్చను చూపించిన కూడా సర్పములు పారిపోతాయి, పాము కరిచిన చోట రాస్తే విషము విరిగిపోతుంది. నీలమేఘశ్యాము డగు స్వామి యొక్క దర్శనం కాగానే భక్తుల సంకటములనే పాములు పారిపోతాయి. అతడు త్రైలోక్య రక్షామణిగా ఉన్నాడు. మంత్రవాదులు రక్షామణిని కడతారు. ఆ మణిని ధరించిన వాడు మాత్రం కాపాడబడతాడు. భగవంతుడు చరాచర ప్రపంచమందు ఉండే సకల ప్రాణులకు రక్షామణిగా ఉన్నాడు.

కులశేఖరులు తాను రచించిన ముకుందమాల అందరూ తెలిసికొని కడతేరవలెను అనే తలంపు కలిగి వున్నారు. అందుకనే ముందు శ్లోకంలో 'మాం పాలయ' నన్ను రక్షింపుమని భగవంతునితో విన్నవించారు. స్వామి నన్ను మాత్రమే కాకుండా నా వలెనే అందరినీ కాపాడవలెనని ఈ శ్లోకంలో విన్నవిస్తున్నారు. అలాంటి స్వామి ఎలా ఉన్నాడంటే! గోపికల నేత్రములనే చాతకములకు మేఘమణిగా ఉన్నాడు. చాతక పక్షులకు ఒక విశిష్టత ఉంది ఆ పక్షులకు దాహం కలుగుతున్నప్పటికీ దగ్గరలో నీరు కనిపించినప్పటికీ వెళ్లి నీటిని త్రాగవు మేఘము నుండి కురిసే వర్షపు చినుకులను మాత్రమే అవి గ్రహించి దాహార్తిని తీర్చుకుంటాయి. అలాగే గోపికల కనుల యందు తాపము కలిగి అందుచేత కృష్ణుడెపుడు వస్తాడా అని చాతకములవలె కళ్ళు తెరుచుకుని ఉంటారు. కృష్ణపరమాత్మ రాగానే అతన్ని దర్శించి తమ తాపము పోగొట్టుకుంటారు.

ఎందుకు గోపికలు అలా వేచి ఉండేవారు అంటే పరమాత్మ సౌందర్య ముద్రామణి కాబట్టి వారు అలా ఎదురుచూపులు చూసేవారు. ముద్రామణి అనడంలో అర్థం ఏంటంటే లోకంలో ఏదైనా తమ సొత్తుగా భావిస్తే లేదా వ్యాపారి తన వస్తువుల మీద ఎలా ఐతే ముద్ర వేసి అపహరణకు లోనవకుండా కాపాడుకుంటాడో కృష్ణపరమాత్మ అనే సౌందర్య మూర్తిని కూడా తమది అనిముద్ర (సీలు) వేసుకున్నవారు. ఎందుకంటే స్వామి వంటి సౌందర్యం ఇతరులకు ఉండదు కనుక,

"యద్యద్విభూతిమత్సత్త్వం శ్రీమదూర్జిత మేవ వా ।
తత్తదే వావగచ్ఛ త్వం మమ తేజోంశ సంభవం ॥"

పరమాత్మ వంటి సౌందర్య మూర్తులు మరెవరు ఉండరు, ఒకవేళ స్వామీ అనుగ్రహిస్తే తన అనుగ్రహం వల్ల ఆ సౌందర్యం లభించవలసిందే. అటువంటి మణిని ధరించినవారెవరంటే కాంతా మణియగు రుక్మిణీదేవి. ఆమె ఘనా కుచద్వన్ద్వమునకు యితడు ఆభరణము. అలాగే దేవశిఖామణియై ఉన్నాడు. సకలదేవతలు పరమాత్మను శిరమునందు ఉంచుకుంటారు. అలాగే గోపాలాచూడామణి కూడా అయి ఉన్నాడు. చూడామణి అంటే శిరస్సు నందు ధరించే ఆభరణము. గోపాలురకు శిరోరత్నము, గోపాల శ్రేష్ఠుడు కనుక గోపాలాచూడామణి అని కీర్తిస్తున్నారు. ఇలాంటివాడు మాకు శ్రేయస్సును అంటే ఐహికాముష్మికములను ఒసంగె పరమాత్మ అంటూ స్వామీ వైభవాన్ని కీర్తిస్తున్నారు.

ముక్తి పొందాలంటే భక్తి కావాలి. భక్తి రావాలి అంటే పరిణితి కావాలి. ఆ పరిణితి ఎవరిలో ఎప్పుడు ఎలా వస్తుందో తెలియదు. ఇది అంతర్గతంగా జరిగే ఓ ప్రక్రియ అని రమణ మహర్షి అంటారు.

అందుకు నిదర్శనం పురందరదాసు జీవితం. "దాసరేంద్రే పురందర దాసరాయ"– దాస భక్తులలో పురందరదాసు శ్రేష్ఠుడు అని గురువు వ్యాసతీర్థుల వారి ప్రశంస అందుకున్న భక్త శిఖామణి

పురందరదాసు. సంగీత కర్త, కవి అయిన వాగ్గేయకారుడు. కర్ణాటక సంగీతానికి ఆద్యుడు అందుకే “కర్ణాటక సంగీత పితామహ” అని పురందరదాసును గౌరవంగా సంబోధిస్తారు. నారద మహర్షి అపర అవతారమనీ అంటారు దాసును.

ఎన్నో ఉత్కృష్టమైన కీర్తనలను, పద్యాలను రచించి, “దాసులందరిలో పురందర దాసులు ఉత్తములు” అని యతివరేణ్యులైన వ్యాసరాయల (మంత్రాలయ ప్రభువు శ్రీ రాఘవేంద్రస్వామి పూర్వావతారం) నుంచి ప్రశంసలు అందుకున్న భాగవతోత్తముడు పురందరదాసు. పుష్య అమావాస్య పురందరదాసు పుణ్యతిథి. ఆ రోజున ఆయన ఆరాధన మహోత్సవాలు నిర్వహిస్తారు.

అది పండరీపురంలోని పాండురంగని ఆలయం. స్వామివారి చేతికి ఉండవలసిన బంగారు కడియం కనిపించడం లేదని అందరూ ఆందోళన చెందుతున్నారు. ఆలయ సిబ్బందినీ, భక్తు లనూ, అనుమానంగా అనిపించిన వారినీ రాజభటులు విచారిస్తున్నారు. ఇంతలో వారి దృష్టి రోజూ స్వామి కొలువుకు వచ్చే ఒక ప్రముఖ వేశ్యపై పడింది. పోయిందనుకున్న స్వామి వారి ఆభరణం ఆమె చేతికి ఉండడమే అందుకు కారణం. ఆ కడియాన్ని అర్చకులు గుర్తు పట్టగానే, భటులు ఆమెను పక్కకు తీసుకువెళ్ళి, విచారణ జరిపారు. అంతకు ముందు రాత్రి పురందర దాసు వచ్చి ఇచ్చినట్టు ఆమె చెప్పగానే, అక్కడ ఉన్న భక్తులందరూ ఆశ్చర్యపోయారు. “నిత్యం స్వామివారి ముందు నిలిచి, తంబురా మీటుతూ, అత్యంత భక్తితో మైమరచిపోతూ పాటలు పాడే పురందరదాసు, వేశ్య దగ్గరకు వెళ్ళడం ఏమిటి? విడ్డూరంగా ఉంది” అని కొందరు గుసగుస లాడారు. “ఇలాంటి దొంగ భక్తులను కఠినంగా శిక్షించాల”ని అతనంటే గిట్టనివారు గొడవ చేశారు. చేసేదిలేక, పురందరదాసును అధికారులు ఆలయానికి రప్పించారు. ఆ ఆలయంలో రోజూ ఆయన ఏ స్తంభం దగ్గర కూర్చొని కైంకర్యం చేసేవాడో, అదే స్తంభానికి కట్టేసి, కొరడాలతో బాదారు.



ఇంతలో గర్భగుడినుంచి “పురందరదాసు నిర్దోషి. అతణ్ణి విడిచిపెట్టండి” అంటూ దైవవాణి వినిపించింది. ఇంతకూ జరిగింది ఏమిటంటే....

ఆ విఠలుడే ముందురోజు రాత్రి పురందరదాసు రూపంలో ఆ వేశ్య దగ్గరకు వెళ్ళి, తన చేతికి ఉన్న కడియం ఇచ్చి, మరునాడు రెండో కడియాన్ని తెస్తానని చెప్పి వచ్చేశాడు. తన భక్తుడైన పురందరదాసుపై నింద వచ్చేలా చేసి, అతని భక్తిని జగత్తుకు తెలియజేశాడు. అంత బాధలోనూ పురందరదాసు పరవశించిపోయాడు. “గతంలో నేను అప్పణ్ణ అనే శిష్యుణ్ణి మంచి నీరు తెమ్మని కోరాను. అతనికి బదులు... అతని రూపంలో... ఆలస్యంగా నువ్వు నీరు తెచ్చావు. అది నాకు తెలియక, అప్పణ్ణే అనుకొని, చెంబుతో నీ తల మీద మొట్టాను. ఆ మరుసటి రోజు గుడిలో విఠలుని నుదుట బొప్పి కట్టి కనిపించింది, కంట్లోంచి నీరు కారుతోంది. జరిగినది గ్రహించిన నేను గర్భగుడిలోకి వచ్చి, నిన్ను బుజ్జగించి, నన్ను క్షమించమని ప్రార్థించాను. బుడిపె మాని పోయింది, కన్నీరు ఆగిపోయింది. అప్పుడు జరిగిన దానికి బదులుగా ఇప్పుడు దెబ్బకు దెబ్బ తీశావా స్వామీ!” అంటూ ఉద్వేగంగా, “ముయ్యక్కే ముయ్య తీరితు” అంటూ స్వామిని కీర్తన చేశాడు పురందరదాసు. పండరీపుర దేవాలయంలో ఈనాటికీ “పురందర స్తంభాన్ని” చూడవచ్చు.

ఒక కథ ప్రకారం... నారదుని భక్తి పారవశ్యతకు శ్రీకృష్ణుడు మెచ్చి వరం కోరుకోమంటే... ‘‘నేను ఎప్పుడు పిలిస్తే అప్పుడు నీవు కనిపించాలి’’ అని నారదుడు అడిగాడు. అది కలియుగంలో తీరుస్తానని శ్రీకృష్ణుడు మాటఇచ్చాడు. పురందరదాసు చరిత్ర ప్రకారం, అనుక్షణం నారాయణుణ్ణే స్మరించే పరమజ్ఞాని, మహాభక్తుడు అయిన నారదుడే... శ్రీనివాస నాయకుడిగా కర్ణాటకలోని పురందరగడ అనే ఊరిలో జన్మించాడు.

ఆయన జన్మనామం శ్రీనివాస నాయక్. వారి పూర్వీకులు వజ్రాల వ్యాపారం చేసే వారు. బాగా కలిగిన కుటుంబం. ఆయన కూడా అదే వ్యాపారంలో ప్రవేశించి బాగా ధనం సంపాదించాడు. ఆయన్ని ‘నవకోటి నారయణుడు’ అని కూడా అనేవారు. అయితే మొదట్లో చాలా పిసినారిగా ఉండేవాడు. డబ్బు తప్ప వేరే ఆలోచన లేకుండా ఉండేవాడు. ఆయన భార్య పేరు సరస్వతీ భాయి. ఆమె పరమ భక్తురాలు. దయాగుణం కలది. భర్త లోభ గుణం గురించి తెలిసినా ఏమీ చేయలేకపోయేది.

ఇలా ఉండగా ఒకరోజు ఒక పేద బ్రాహ్మణుడు తన కుమారుడి ఉపనయనం కోసం ధన సహాయం చేయమని శ్రీనివాస నాయక్ దగ్గరకు వచ్చాడు. ఆయన్ని తర్వాత రమ్మంటూ పంపించి వేశాడు. అలా ఆ బ్రాహ్మణుని చాలా రోజులు తన చుట్టూ తిప్పుకుంటూనే ఉన్నాడు కానీ ధన సహాయం మాత్రం చేయలేదు. ఆ బ్రాహ్మణుడు కూడా పట్టు విడువకుండా అలా తిరుగుతూనే ఉన్నాడు. ఆరు నెలలు గడిచాయి. చివరకు ఆ బ్రాహ్మణుడిని ఎలాగైనా వదిలించుకోవాలని తన దగ్గరున్న పనికిరాని నాణేలన్నీ ఒక కుప్పగా పోసి అందులో అతనికి నచ్చిన ఒక నాణేన్ని తీసుకుని మళ్ళీ ఎప్పుడూ తిరిగి రావద్దని చెప్పాడు. ఆ బ్రాహ్మణుడు చేసేదేమీ లేక నిరాశతో అక్కడ్నుంచి వెనుదిరిగాడు.

వెళుతూ వెళుతూ సరస్వతి భాయి ధార్మిక గుణం

గురించి తెలుసుకొని నేరుగా వాళ్ళ ఇంటికి వెళ్ళి, ఆమె భర్త తనను చాలాకాలం తిప్పుకుని చివరకు రిక్త హస్తాలతో ఎలా తిప్పి పంపాడో వివరించాడు. ఆమె ఆ పేద సుబ్రాహ్మణుడి పట్ల తన భర్త ప్రవర్తించిన తీరు విని చాలా బాధ పడింది. ఎలాగైనా ఆ బ్రాహ్మణుడికి సహాయ పడాలనుకుంది. కానీ తన భర్త అనుమతి లేకుండా అతని సొమ్ము చిల్లిగవ్వ కూడా ఇవ్వలేనంది. ఆ బ్రాహ్మణుడు కొద్దిగా ఆలోచించి "అయితే మీకు పుట్టింటి వారు ఇచ్చింది ఏదైనా ఉంటే ఇవ్వండి" అన్నాడు. అప్పుడామె తన ముక్కెరను తీసి ఆయనకు ఇచ్చింది. ఆ బ్రాహ్మణుడు అది తీసుకుని నేరుగా శ్రీనివాస నాయక్ దుకాణానికే వెళ్ళాడు. మళ్ళీ తిరిగి రావద్దన్నా ఎందుకొచ్చావంటూ ఆ బ్రాహ్మణున్ని కోప్పడ్డాడు శ్రీనివాస నాయక్. ఆ బ్రాహ్మణుడు శాంతంగా "అయ్యా! నేను యాచించడానికి రాలేదు. ఇదిగో ఈ ముక్కెర తాకట్టు పెట్టి కొంత ఋణం తీసుకుందామని వచ్చాను" అన్నాడు. ఆయన ఆ ముక్కెర చూడగానే తన భార్యదేనని గుర్తు పట్టేశాడు. ఆ బ్రాహ్మణుడిని అడిగితే అది ఎవరో దాత ఇచ్చిందని తెలిపాడు. ఆ బ్రాహ్మణుడిని మరలా రేపు రమ్మని, ఆ ముక్కెరను జాగ్రత్తగా ఇనప్పెట్టెలో దాచి ఇల్లు చేరాడు శ్రీనివాస నాయక్. తన భార్యను పిలిచి ముక్కెర ఏదని అడిగాడు. ఆమె పొంతన లేని సమాధానాలు ఇచ్చేసరికి దాన్ని చూపించవలసిందిగా పట్టు బట్టాడు. ఆ పేదబ్రాహ్మణుడికి ఆమే తన ముక్కుపుడక దానం చేసి ఉంటుందని ఆయన అనుమానం.

సరస్వతీబాయికి కాళ్ళకింద భూమి కదులుతున్నట్లయింది. నిజం చెబితే భర్త తన్ని ఖచ్చితంగా శిక్షిస్తాడని భయపడింది. మరో ప్రత్యామ్నాయం ఆలోచించక ఆమె ఆత్మహత్య చేసుకోవాలను కుంది. ఒక చిన్న గ్లాసులోకి విషాన్ని ఒంపుకొని నోటి దగ్గరకు తీసుకోబోయింది. ఇక తాగబోతుండగా ఆమెకు ఆ గ్లాసులో ఏదో గల గల మని సవ్వడి వినిపించింది. కిందికి దింపి చూస్తే తను బ్రాహ్మణుడికి దానం చేసిన ముక్కెర కనిపించింది. ఆమె తన కళ్ళను తానే నమ్మలేక పోయింది. ఆమె హృదయం ఆనందంతో, కృతజ్ఞతతో నిండిపోయింది. తన ఇంట్లోని కృష్ణ విగ్రహం ముందు మోకరిల్లి దాన్ని తీసుకుని వెళ్ళి తన భర్తకు చూపించింది. దాన్ని చూసేసరికి శ్రీనివాస నాయక్ కు మతిపోయినంత పనైంది. అది అచ్చం తాను అంగడిలో దాచి వచ్చిన ముక్కుపుడక లాగే ఉంది.

వెంటనే ధృవీకరించుకోవడానికి తన దుకాణానికి వెళ్ళాడు. తను ఉంచిన చోట చూస్తే ఆ ముక్కు పుడక లేదు. ఆయన మాట పెగల్లేదు. తిరిగి ఇంటికి వెళ్ళి అసలేం జరిగిందో చెప్పమని భార్యను ఒత్తిడి చేశాడు. ఆమె జరిగిందంతా పూసగుచ్చినట్లు వివరించింది. ఇదంతా విన్న ఆయన మనసులో సంక్షోభం చెలరేగింది. తీవ్ర అంతర్మథనం తర్వాత, ఆ బ్రాహ్మణుడెవరో కాదు, సాక్షాత్తూ ఆ విఠలుడే అని తెలుసు కున్నాడు. గత ఆరునెలలుగా జరిగిన సంఘటనలన్నీ ఆయన కళ్ళముందు కదలాడాయి. ఆయన పిసినారితనం మీద, ప్రవర్తన



మీద ఆయనకే అసహ్యం వేసింది. తన భార్య తన కన్నా అదృష్టవంతురాలని అనిపించింది ఆయనకు. తనకు ధనం మీద ఉన్న వ్యామోహం వల్లనే భగవంతుని ఈ విధంగా కష్ట పెట్టవలసి వచ్చిందని తలంచి, సంపద మీద ఎక్కువ దృష్టి పెట్టటం వలన జరిగిన అనర్థం అని గ్రహించి 30వ ఏటనే తన సంపదనంతా త్యాగం చేసి పరమ భక్తుడై హరిదాసుడై భాగవతోత్తముడైనాడు పుణ్యపురుషుడు పురందరదాసు.

కృష్ణదేవరాయల రాజ గురువు వ్యాస తీర్థులవారి దర్శనం వలన మార్గం సుగమం అయి శిష్యుడై పురందరదాసు నామంతో 40వ ఏట ప్రసిద్ధుడయ్యాడు. విజయనగర ఆస్థానంలో తన భక్తి కీర్తనలు గానం చేసి రాజుతో సహా అందరి మెప్పు పొందాడు.

హంపీ చేరి ఒకమండపంలో ఉంటూ చివరి జీవితాన్ని గడిపాడు దాదాపు 4 లక్షల 75 వేల కీర్తనలు రాసిన పరమభక్తుడు పురంధరదాసు. మిగిలిన 25వేల కీర్తనలూ రాసి తాను అనుకొన్న 5 లక్షల కీర్తనలు పూర్తి చేయమని చిన్న కొడుకు "మధ్వపతి" ని కోరాడు. తాను ఈ జన్మలో అంతటి పని చేయలేనని మరో జన్మలో రాసి తండ్రి కోరిక తీరుస్తామని అన్నాడు. అతడే తర్వాత కర్ణాటకలో రాయపూర్ జిల్లా చీకలపర్విలో "విజయదాసు" గా జన్మించి తండ్రికి వాగ్దానం చేసిన దాని ప్రకారం 25 వేల కీర్తనలు శ్రీ లక్ష్మీ నారాయణ స్వామిపై రచించి తండ్రి కిచ్చిన మాట నిలబెట్టుకున్నాడు. అందుకే ఆయనను నారదావతారం అన్నారు. త్యాగరాజస్వామి తన "ప్రహ్లాద భక్తవిజయం" గేయ నాటకంలో పురందర దాసును ప్రస్తుతించారు. ఆయన నివసించిన మండపాన్ని 'పురందర మండపం' అంటారు.

ఆధ్యాత్మిక వేత్తలైన వారికి మాత్రమే బోధపడే శ్రీమద్ భాగవతాన్ని సుందర సరళ తరమైన శ్రావ్యమైన పాటలుగా రాసి సామాన్యులకు కూడా భాగవత పరమార్థాన్ని తెలియజేశాడు. కర్ణాటక సంగీతంలో వ్రేళ్ల మీద లెక్కింపదగిన వాగ్గేయకారుడిగా

గుర్తింపుపొందాడు. స్వరావళి, అలంకారాలతో సంగీతానికి శోభ సమకూర్చాడు. "మాయా మాళవ" రాగాన్ని సృష్టించి సంగీతం నేర్చుకొనే వారికి మొట్టమొదట పాడుకోవటానికి సులభంగా ఉత్సాహ జనకంగా వరప్రసాదంగా అందుబాటులోకి తెచ్చాడు. ఇప్పటికీ ప్రారంభదశలో సంగీతం నేర్చుకొనేవారికి ఈ రాగం లోనే సంగీతం బోధించే సంప్రదాయం కొనసాగుతోంది స్వరావళి, జంటస్వరాలు, అలంకారాలు, లక్షణ గీత, ప్రబంధాలు, యుగభోగాలు, దాటువరస గీతాలు, సూలాది మొదలైనవి రాశాడు. ఏది రాసినా భావ రాగ లయ సమ్మేళనంతో విరిసిన పుష్పంగా కీర్తన శోభిల్లుతోంది. లక్షలాది కీర్తనలు రాసినా లభించి, ప్రాచుర్యంలో ఉన్నవి 700 మాత్రమే.

పురందరదాసు భక్తి ఉద్యమంలో దాస సాహిత్యాన్ని పోషించి వ్యాప్తి చెందించాడు. తనకన్నా చిన్నవాడైన భక్త కనకదాసుకు పురందరదాసు సమకాలికుడు. కన్నడంలో చాలా కీర్తనలు రాసినా సంస్కృతంలోనూ పురందరదాసు కృతులు రాసి కీర్తి గడించాడు. ఆయన కృతులలో "పురందర విఠల" అనేది అంకిత ముద్ర (మకుటం) గా ఉండటం విశేషం హిందూస్తానీ సంగీతంపై తీవ్ర ప్రభావం కలిగించాడు పురందరదాసు. ఉత్తరాది మహాసంగీత విద్వాంసుడు తాన్సేన్ గురువు స్వామి హరిదాసు పురందరదాసు శిష్యుడే. ఈ భక్తకవి శేఖరుడు 2-1-1564న 80 ఏళ్ళ వయసులో పురందర విఠలుని చేరుకొన్నాడు.

పురందరదాసు కన్నడ దేశస్థ మధ్వ బ్రాహ్మణ కుటుంబంలో వజ్రాల వ్యాపారికి జన్మించినట్లు శాసన ఆధారాలు సూచిస్తున్నాయి, 1484లో పూణే ప్రస్తుత మహారాష్ట్ర రాష్ట్రానికి 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న పురందరగడలో ఇతర అభిప్రాయాల ప్రకారం, అతని స్వస్థలమైన పట్టణం కర్ణాటకలోని పురందరఘట్ట. లేదా పూణే సమీపంలోని పురందరగడ్. కానీ రెండోది చారిత్రక తప్పిదంగా పరిగణించబడుతుంది - అతని "కలం పేరు" (అంకిత)ని ప్రధానంగా 15వ శతాబ్దం ప్రాంతంలో సైనిక శిబిరంగా పనిచేసిన ప్రదేశంతో అనుసంధానించడం మరియు 16వ శతాబ్దం 2018లో, పురందర దాసు జన్మస్థలాన్ని నిర్ధారించడానికి కర్నాటక ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల కమిటీ తన నివేదికను సమర్పించి తీర్థహళ్లిని అత్యంత అనుకూల మైనదిగా పేర్కొంది. ఈ కమిటీలో ప్రముఖ గాయకుడు, సంగీత విద్వాంసుడు ఆర్కే పద్మనాభ, విద్వాంసులు అరలుమల్లిగే పార్థసారథి, ఏవీ నవడ, వీరన్న రాజోర, మాజీ మంత్రి లీలాదేవి నవడ ఉన్నారు. పురందరదాసు ఆరగా, విజయనగర సామ్రాజ్యం (ఆధునిక తీర్థహళ్లి, కర్ణాటక, భారతదేశం), కర్ణాటకలో జన్మించినట్లు నిర్ధారించబడింది.

శ్రీ దాసు వాగ్గేయకారుడు (సంగీతకారుడు-ప్రదర్శకుడు), లక్షణకారుడు (సంగీత శాస్త్రవేత్త), మరియు సంగీత బోధనా స్థాపకుడు. సంగీత శాస్త్రజ్ఞులు ఆయనను కర్ణాటక సంగీతంలో సంగీత పితామహ అని పిలుస్తారు.

గురువు ద్వారా భగవత్తత్వాన్ని తెలుసుకున్న పురందరదాసు ఏదో ఒక మూల కూర్చొని తన సాధన సాగించి ఉండవచ్చు. కానీ అలా చేయలేదు. తంబుర పట్టి, ఇంటింటికీ వెళ్ళి, సామాన్య జనులను జ్ఞానమార్గం వైపు నడిపించే ప్రయత్నం చేశాడు. భిక్షాటనతో జీవనం గడిపాడు. తన సాహిత్యానికి సమ్మోహనకరమైన సంగీతాన్ని జోడించాడు. కన్నడ సంగీత. సాహిత్యాలకు సమున్నత స్థానాన్ని కల్పించాడు.

'దనియా నోడిదెను వెంకటనా' అనే కీర్తనలో తిరుపతి వెంకప్ప ఉప్పుడు ఎర్ర బియ్యాన్ని తింటాడని, వడ్డీలలో తేడావస్తే సహించడని, దోసెలు, అన్నం అమ్ముకుంటాడని పరాచికాలు ఆడుతాడు పురందరదాసు. ఆయన లాలి పాటలు అత్యంత మనోహరంగా, సంగీతబద్ధంగా ఉంటాయి. అలాగే దాస సాహిత్యంలో చిన్నికృష్ణుని బాల్యం చిలిపి చేష్టలు ప్రత్యేక స్థానం కలిగి ఉంటాయి. 'అనంత అపరాధ ఎన్నలిల', 'సాకు సాకిన్న సంసారం సుఖవు', 'నా డొంక నాదరే', 'అపరాధి నా నల్ల' తదితర గీతాల్లో భక్తుడి అపరాధ భావం, నిస్సహాయత, పశ్చాత్తాపం, శరణా గతి లాంటి భావాలను పురందరదాసు భగవంతుడి పాదాలను తాకే విధంగా వ్యక్త పరుస్తాడు. 'మాడి మాడి ఎందు మూరు మారు హారతి', 'చర్మవు తోళిదరే', 'ఆచారవిల్లాదే నాలికే' అనే గేయాల్లో అంతఃశుద్ధి ప్రాధాన్యతను చాటిచెప్పాడు. ప్రజా శ్రేయస్సును కోరి, ప్రజల కోసం సృజించిన కీర్తనలవి. నారదాంశ సంభూతుడు కనుకనే పురందరదాసు కీర్తనలు, సాహిత్యం వేదోపనిషత్తుల సారాన్ని సులువైన కన్నడ పదజాలంలో సామాన్యులకు సైతం అర్థం అయ్యే రీతిలో సొగసుగా వివరిస్తాయి. మహాభక్తునిగా, సంకీర్తనాచార్యుడిగా పురందరదాసుది అచంచలమైన స్థానం.

తిరుపతి తిరుమల దేవస్థానం ప్రచారం, దాసా సాహిత్య ప్రాజెక్ట్ కింద పురందర దాసు సాహిత్య ప్రచారం చేస్తున్నది. పురందర దాసు విగ్రహం అలిపిరిలో తిరుమల పాదాల వద్ద స్థాపించబడింది. బెంగళూర్ లో పురందర దాస ట్రస్ట్ ఏర్పడి ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తోంది. కర్ణాటక సంగీత పితామహుడు పురందరదాసు అందరికి ఆరాధనీయుడే.

నలుగురితో పాటు జన్మించి నలుగురితో పాటు మట్టిలో కలిసిపోవాల్సిన శ్రీనివాస నాయక్ పురందర దాసు అయ్యాడు. పుట్టిన కొన్ని శతాబ్దాల తర్వాత కూడా తన కీర్తనల ద్వారా ప్రజల నాలుకలపై నాట్యమాడుతూ ఉన్నాడు. పరసవేది స్పర్శతో రాయి కూడా బంగారమైనట్లు పరమ లోభి కూడా ఆ భగవంతుని కృపతో హరిదాసులకు ఆది గురువయ్యాడు. అటువంటి భగవంతుడు చరాచర ప్రపంచమందు ఉండే సకల ప్రాణులకు రక్షామణిగా ఉన్నాడు.

**ఓం నమో భగవతే వాసుదేవాయనమః**

# శ్రావణ మాసం విశిష్టత

– ఆర్.బి.శేషశాయి రామాచార్యులు

శ్రావణ మాసం అంటే శుభ మాసం. శ్రావణ మాసాన్ని నభో మాసం అని కూడా అంటారు. నభో అంటే ఆకాశం అని అర్థం. ఈ నెలలో వచ్చే... సోమవారాలు, మంగళవారాలు, శుక్రవారాలు, శనివారాలు ఎంతో పవిత్ర మైనవి. ఈ నెలలో వచ్చే ముఖ్యమైన పర్వదినాలు.శ్రావణ నక్షత్రం విష్ణుమూర్తి జన్మనక్షత్రం కూడా...

**'శ్రవం నయ తీతి శ్రేణ నీయత ఇతివా శ్రవణం' - వేద వాఙ్మయం**

హయగ్రీవుడనే రాక్షసుడు వేదాలను అపహరిస్తే విష్ణుమూర్తి హయగ్రీవుడిగా వచ్చి వేదాలను సంరక్షించాడు. హయగ్రీవుడు అవతరించింది శ్రావణ మాసం.

శ్రావణ శుద్ధ పౌర్ణమి, జంధ్యాల పౌర్ణమి, కృష్ణాష్టమి. పోలాల అమావాస్య. నాగ చతుర్థి , నాగ పంచమి పుత్రదా ఏకాదశి , దామోదర ద్వాదశి, వరాహ జయంతి ఇలా అనేక పండుగలు వస్తాయి. శ్రావణ మాసం చంద్రుడి మాసం కూడా, చంద్రుడు మనః కారకుడు. అంటే సంపూర్ణముగా మనస్సు మీద ప్రభావము చూపే మాసము ఈ మాసం.

ఈ మాసమందు రవి సంచరించు నక్షత్రముల ప్రభావము చంద్రుని మూలముగా మన మీద ప్రభావం చూపును. చంద్రుని చార నుంచి జరగబోవు దుష్ఫలితాలను నివారించుటకు. మంచి కలిగించుటకు, ధర్మాచరణములను పండుగగా ఆచరించడం నియమమైనది.



మనస్సు మీద మంచి ప్రభావము ప్రసరించి పరమార్థము వైపు మనస్సును త్రిప్పుకొని మానసిక శాంతి పొందడానికి. ప్రకృతి వలన కలిగే అస్తవ్యస్త అనారోగ్యముల నుండి తప్పించుకొనుటకు, మంచి ఆరోగ్యాన్ని పొందడం కోసం...

శ్రావణమాసంలో వచ్చే పండుగలలో నిర్దేశించిన ఆచారాలను పాటించడం ముఖ్యోద్దేశమైనది.

## శ్రావణమాసం - లక్ష్మీ కటాక్షం

ప్రకృతి సంపూర్ణ కళలతో సౌందర్యం చిందే కాలం శ్రావణ మాసం. ఇది ప్రకృతి మాత యవ్వన దశ అనవచ్చు. పూర్తిగా సౌభాగ్యానికే ప్రత్యేకంగా కేటాయించబడిన ఉత్తమ నోములు శ్రావణ మంగళవారాల నోములు. దివ్యమైన శుభకరమైన పండుగలతో, పర్వదినాలలో అలరారుతూ భక్తుల పాలిట సౌభాగ్యదాయినిగా నిలిచిన మాసం శ్రావణం.

చాంద్రమానం ప్రకారం సంవత్సరంలో అయిదవ దివ్యమైన మాసం శ్రావణం. వర్షఋతువు ప్రారంభమయ్యేమాసం. ఈ మాసంలో పౌర్ణమినాడు చంద్రుడు శ్రవణా నక్షత్ర సమీపంలో ఉండటం చేత ఈ మాసానికి శ్రావణమాస మనే పేరొచ్చింది.

'శ్రవణం' విష్ణుమూర్తి జన్మనక్షత్రం. శ్రీ మహావిష్ణువుకు, ఆయన దేవేరి శ్రీ మహాలక్ష్మీదేవికి అత్యంత ప్రీతి కరమైన వివిధ వ్రతాలు, పూజలు ఆచరించడంవల్ల విశేష ఫలితాలు. సకల సౌభాగ్యాలు ప్రసాదించే దివ్యమైన మాసం శ్రావణమాసం.

శ్రావణమాసంలో మంగళవారాలు శ్రీ గౌరీదేవి పూజకు, శుక్రవారాలు శ్రీ లక్ష్మీదేవి పూజకు, శనివారాలు శ్రీ మహావిష్ణువు పూజకు ఉత్కృష్ట మైనవి. శ్రావణమాసంలో సోమవారంనాడు పరమశివుడిని పూజించడం విశేష ఫలితాల నిస్తుంది.

సోమవారంనాడు శివాలయంలో గానీ, ఇంటిలోగానీ అభిషేకం చేయడంతోపాటు బిళ్వదళముల తో అర్చన చేయవచ్చు.

భగవాన్ శ్రీకృష్ణుని జననం శ్రావణమాసంలోనే జరిగింది. హయగ్రీవుడు, అరవిందయోగి వంటి

పుణ్యపురుషులు జన్మించింది ఈనెలలోనే. వర్షఋతువు, ఓషధులు, పంటలు, ధనధాన్యాలకు శుభకరమైనది ఈ మాసం.

ఈ కాలంలో దాడిచేసే రోగాలను దూరంగా పెట్టడానికి ఆహార నియమాలు పాటిస్తూ ఉపవాసాలకూ ప్రాధాన్యత ఇస్తారు. అంతేగాక దక్షిణాయనంలో దేవతల అనుగ్రహం భూమిపై ప్రసరిస్తూ ఉంటుంది. ఈమాసంలో మంగళ గౌరీ, వరలక్ష్మీ వ్రతాలతోపాటు అందరిమదిలో మెదిలేది శ్రావణపూర్ణిమ.

శ్రీ రాఘవేంద్రస్వామి ఆరాధన మరియు శ్రీకృష్ణాష్టమి. శ్రీకృష్ణుడు భువిపై అవతరించిన పుణ్యదినమే శ్రావణ బహుళ అష్టమి. శ్రావణంలో గృహ నిర్మాణాన్ని ఆరంభించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని మత్స్యపురాణం చెబుతున్నది. శ్రావణ శుద్ధ చవితిని నాగుల చవితి అని, పంచమిని నాగ పంచమి అంటారు. నాగచతుర్థి నాడు ఉపవాసం ఉండి పుట్టలో పాలుపోసి నాగదేవతను పూజించాలి.

నాగపంచమినే గరుడ పంచమని కూడా అంటారు. నాగులకు పాలు, పాయసం, నువ్వుల పిండి, చలిమిడి నైవేద్యంగాసమర్పించాలి. దీనివల్ల సర్పదోషం తొలగుతుంది.

కొత్తగా పెళ్లయిన ఆడపిల్లలు తమ అయిదోతనం కలకాలంనిలవాలంటే ఈమాసంలో ప్రతి మంగళవారం మంగళగౌరీ వ్రతాన్ని చేస్తారు. పెళ్లయిన సంవత్సరంనుంచి వరుసగా అయిదు సంవత్సరాల పాటు నోము నోచి చివరి సంవత్సరం ఉద్యాపన చేస్తారు.

శ్రావణ పౌర్ణిమకు ముందు వచ్చే శుక్రవారము స్త్రీలు వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తారు. ఈ వ్రతం చేయడంవల్ల లక్ష్మీదేవి కృప కల్గి, సకల శుభాలు కలుగుతాయని శాస్త్ర వచనం. ఈ వ్రతాన్ని గురించి పార్వతీదేవికి శివుడు ఉపదేశించాడు.శ్రావణ పూర్ణిమను భారతావని మొత్తం ఎంతో పవిత్రంగా భావిస్తారు.

ఏడాదికి వచ్చే ద్వాదశ పూర్ణిమల్లోనూ శ్రావణ పూర్ణిమకు గల విశిష్టత ఇంతింతని చెప్పనలవికాదు. ఈ రోజున చేసే హయగ్రీవ ఆరాధన ఉన్నత విద్యను ప్రసాదిస్తుంది.

చదువుల తల్లి సరస్వతికి గురువు హయగ్రీవుడని దేవీభాగవతం చెబుతోంది. శ్రావణపూర్ణిమనే 'రాఖీపూర్ణిమ'. శ్రావణ బహుళ విదియ శ్రీ రాఘవేంద్ర స్వామి ఆరాధన తిథిగా చెప్పబడింది.

ఈ తిథి రోజు మంత్రాలయంలో శ్రీ రాఘవేంద్రులు సశరీరంగా సజీవంగా బృందావన ప్రవేశాన్ని పొందారు. లోకానికి భగవద్గీతను ప్రబోధించిన శ్రీకృష్ణ భగవానుడి జన్మదినమే బహుళ అష్టమి.

బహుళ ఏకాదశి కామ్య ఏకాదశి, శ్రావణ అమావాస్యను పోలాల అమావాస్యగా జరుపుకుంటారు. ఈ విధంగా ప్రతిరోజూ విశేష దాయక మైన శ్రావణమాసాన్ని మనం పాటిద్దాం– మోక్షాన్ని పొందుదాం.

# మీ ప్రశ్న మా సమాధానం

**నిర్వహణ: డా. మరింగంటి లక్ష్మణాచార్యులు**

**1. మన పూర్వీకులలో ఋషులు లేదా మహానుభావులు సమాజానికి చేసిన సేవను క్లుప్తంగా వివరించండి.**

**- అరన సతీష్, హబ్సీగూడ**

జవాబు – ఋషులు, మునులు ఇతర మహానుభావులు తమ ఆత్మోన్నతికి కృషి చేసినా సామాజిక అభ్యున్నతి కోసం కోసం కూడా ఎంతో కృషి చేశారు. ఎన్నో రచనలు చేశారు. తమ నడవడిక ద్వారా కూడా ఆదర్శంగా నిలిచారు. తమ తపోశక్తితో ద్రష్టలుగా వేదమంత్రాలు రచించి, తమ జ్ఞానాన్ని శాస్త్రాలుగా రూపొందించి నాటి సమాజానికే కాక నేటి సమాజానికి కూడా మార్గదర్శకంగా ఉండేట్లు రూపొందించారు. వసిష్ఠుడు, వామదేవుడు, విశ్వామిత్రుడు, భృగువు, భరద్వాజుడు, గౌతముడు ఇలా చాలామంది తమ ప్రతిభను సమాజ సేవకే ఉపయోగించారు. ఎవరెవరు ఏయే ధర్మాలను పాటించాలో వివరిస్తూ, ఆయా ధర్మాలను సమాజంలో చక్కగా ఏర్పాటు చేసి సమాజాభివృద్ధికి తమ వంతు కృషి చేశారు.

**2. భగవద్గీత వైభవం గురించి తెలుసుకోవాలని ఉంది.**


**– డా.శారద, కవాడీగూడ**

జవాబు – మంచి ప్రశ్న. భగవద్గీత స్వయంగా భగవానుడైన శ్రీకృష్ణునిచే బోధించబడిన నిరుపమాన, సార్వకాలీన, సార్వజనీన అద్భుత గ్రంథం. యోగసాధనాలైన జ్ఞాన, ధ్యాన, కర్మ, భక్తి గురించి చక్కగా వివరించి వీటిలో ఏది చేపట్టినా అది సిద్ధిని లభింపచేస్తుందని తెలియజేస్తుంది. ఆత్మ, పరమాత్మల గురించి, జ్ఞానం, భక్తి, ముక్తి గురించి, బ్రతకడానికి, జీవించడానికి, ఉత్తమంగా, పునర్జన్మ లేకుండా చేసుకునే సాధన గురించి 'గీత' చెప్పినట్లు మరే గ్రంథమూ చెప్పలేదు. అందుకే అది విదేశీయులను కూడా అంత గొప్పగా ఆకర్షించింది. ఇప్పుడు అన్ని భాషలలోనూ లభిస్తున్న ఉత్తమోత్తమ గ్రంథం, మనిషి జీవితానికి దిక్సూచి, శ్రీ భగవద్గీత.

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు. భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు.**

**– ఎడిటర్, శ్రీవేంకటేశం**

ధారావాహికం



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా॥ విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## ఆదిత్య పురాణాంతర్గతం

### శ్రీనివాస వైభవం

శౌనకాది మహర్షులు సూతమహర్షితో యిలా అన్నారు – "మహాత్మా! శ్రీనివాసుని దివ్యానుగ్రహం వలన లక్ష్మీప్రదమైన శ్రీ వేంకటేశుని మాహాత్మ్యాన్ని దయతో చెప్పారు. ఇకపైన లక్ష్మీపతి, సర్వాభీష్టప్రదాత అయిన శ్రీనివాసుడు సంప్రీతుడై అందరకు అభీష్ట ఫలాలను ఎలా ప్రసాదిస్తాడో ఆ విధానాన్ని మాకు తెలియజేయండి. ఓ దయామయా! సర్వశాస్త్రవిశారదా! వేంకటేశ కథామృతాన్ని మాకు వినిపించండి. మేమంతా మీ దయకు పాత్రులం."

వారంతా యీ విధంగా ప్రార్థించగా సూతమహర్షి యిలా చెప్ప నారంభించాడు – 'ఓ మునులారా! మీరంతా సావధానంగా వినండి. మీరడిగినట్లే ఆ దివ్యగాథను, శుభప్రదమైనదానిని మీకు వివరిస్తాను.

**వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన ।**
**వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥**

**– శ్రీ. వేం. మా. ఆదిత్య. పు. అ. 1. శ్లో 5.**

ఈ బ్రహ్మాండంలో వేంకటాద్రితో సమానమైన దివ్యక్షేత్రం మరొకటి లేదు. వేంకటేశునితో సమానమైన దైవంకూడ లేడు, ఉండబోడు. అద్భుతమైన ఆయన చరిత్రను వర్ణించడానికి ఎవరికి సాధ్యం? అయినప్పటికీ జనన మరణ రూప సంసారము నుండి తరింప జేయునది, సర్వపాపములను పోగొట్టునది, పుణ్యమును పెంపొందించునది, అతి విచిత్రమైనది, అపూర్వ మైనది, బ్రహ్మాది దేవతల చేత, నారదాది మహర్షుల చేత అత్యంతప్రీతితో కొనియాడబడినది, లోకోత్తరమైనది, మహైశ్వర్యకరమైనది, సకలాభీష్ట ప్రదమైనది అయిన ఆ వేంకటేశ్వరుని వైభవాన్ని యథాశక్తిగా చెబుతాను. వినండి.

శేషాచలంలో ఉన్నటువంటి మాహాత్మ్యం ఇతర క్షేత్రాలలో లేదు. అలాగే ఆ క్షేత్రంలో నెలకొన్న శ్రీనివాసుని మహిమ ఇతర దైవాలలో కనబడదు. ఆ వేంకటేశ్వరుని కథామృతము వేదాలలోను, పురాణాలలోను, ఇతిహాసాలలోను, ఆగమాలలోను వర్ణించబడింది. అది వినడానికి చాలా మనోహరంగా ఉంటుంది. అలాగే ఇహపరాలలో సర్వాభీష్టాలను ప్రసాదిస్తుంది. విశేషించి జ్ఞానప్రదమైనది. మహైశ్వర్య కారకమైనది. వైరాగ్యము, భక్తి, సత్త్వగుణము, ఇంద్రియనిగ్రహమును ప్రసాదించే వేంకటాద్రిలో, పవిత్ర క్షేత్రంలో అశుచిదోషం లేదు.

కావున వేంకటేశ్వరునికి నివేదించిన ప్రసాదాన్ని స్వీకరించడం ఉత్తమమైనది. దానివలన ప్రజలకు క్షేమం కలుగుతుంది. అలా కాకుండ గర్వంతో నిరాకరిస్తే అనిష్టం ప్రాప్తిస్తుంది. ఆ శ్రీనివాసుడు

సృష్టి స్థితి లయ కర్త. సత్త్వరజస్తమో గుణములను ధరించినవాడు. ఆద్యంత శూన్యుడు. అవాఙ్మానసగోచరుడు. అనాది, అనంతుడు, వాక్కులతో వర్ణింప వీలుకానివాడు, సజ్జనులకు ఆశ్రయుడు. దేవతాశ్రేష్ఠుడు, సర్వశ్రేష్ఠుడు, నిత్యము బ్రహ్మదేవుడు, శివుడు, శేషుడు, గరుడుడు, ఇంద్రాది దేవతాప్రముఖులంతా లక్ష్మీదేవితో కూడ శ్రీ వేంకటేశ్వరుని మహాభక్తితో పూజిస్తారు.

ఆయన చరాచర జగత్తుకు గురువు. సర్వసాక్షి. మహేశ్వరుడు, జపింప దగినవాడు, తపస్సు చేయదగినవాడు, పూజనీయుడు, స్మరింపదగినవాడు, అందరికీ ధ్యానింపదగినవాడు, ఆయన యందే మనను నుంచి, ప్రాణాన్ని ఆయనయందే నిలిపి భక్తితో ఆయన నామాన్ని స్మరించాలి. గోదానాలు, అశ్వమేధాది యాగములు, అసంఖ్యాకాలైన కన్యాదానాలు, సువర్ణ దానాలు, ఇంకా అనేక యితర దానాలు ఆయన నామస్మరణతో సమానం కావు. ఇక అద్భుతమైన ఆయన మహిమ గురించి ఏమని చెప్పాలి? అని ఆదిశేషుడు మహాత్ముడైన కపిలునికి చెప్పాడు. ఆ కపిల మహాయోగి వలన నేను దీన్ని విన్నాను. దానిని ఇప్పుడు మీకు చెబుతున్నాను. ఇది శ్రీహరికి వెంటనే ప్రీతిని కలిగిస్తుంది. కాబట్టి మీరంతా శుభములు పొందుటకై నేను చెప్పే విషయాన్ని శ్రద్ధగా వినండి.

మీరంతా దృఢవ్రతులై, దీక్షబూని వేంకటాచలయాత్రకు వెళ్ళండి. ఆ శ్రీమహావిష్ణువును సందర్శించి భక్తియుక్తులై, జితేంద్రియులై, ఆయన్ను స్తోత్రం చేయండి. ఆ భగవంతుని గుణగణాలను వర్ణిస్తూ ఆయన ప్రీతి చెందునట్లుగా ఆయన కల్యాణగుణాలను కీర్తించండి. ఆయన దివ్యగుణాలను తెలుసుకొని కీర్తిస్తే ఆయన మిక్కిలి సంతోషిస్తాడు. అలా కాకుండ అజ్ఞానంతో భక్తి లేకుండ కీర్తిస్తే ఆయనకు ప్రీతి కలుగదు.

భక్తితో ఆ శ్రీనివాసుని స్తుతిస్తే ఆయన సంతుష్టుడై సర్వాభీష్టాలను వర్షిస్తాడు. భక్తితో స్తోత్రం చేయని వానికి ఏమి యివ్వడు. ఈ సందర్భంగా మీకు ఒక ప్రీతికరమైన ప్రాచీన ఇతిహాసాన్ని (చరిత్రను) చెబుతాను. దానిని వినుటవలన, స్మరించుటవలన విష్ణుపాదాంబుజముల యందు భక్తి పెంపొందుతుంది.

పూర్వం వాయుదేవునికి శిష్యుడైన దేవశర్మ అనే విష్ణు భక్తుడుండే వాడు. అతడు జితేంద్రియుడు, తపస్వి, చాలా నిష్ఠ కలవాడు, ఎల్లప్పుడు విష్ణువునే చింతిస్తూండేవాడు. అహంకార మమకారములు లేనివాడు. విషయాల యందు ఆసక్తి లేనివాడు, విరక్తుడు, కామక్రోధలోభమోహ మద మాత్సర్యాలనే అరిషడ్వర్గాన్ని జయించినవాడు, పరమ శాంతుడు, షడింద్రియాలను నియమించినవాడు అతడు దారిద్ర్యముతో బాధపడుతున్నప్పటికి కుటుంబపోషణ విషయంలో మనసు పెట్టలేదు. అయన భార్య దారిద్ర్యము నుండి బయటపడాలని ప్రతిరోజు ఆయనను ఈ విధంగా ప్రార్థించేది – 'నాథా! స్వామి! కరుణామయా! ప్రసన్నచిత్తంతో నా మాటలాలకించు. మన బిడ్డలు ఆకలితో బాధపడుతున్నారు. అడవులకు వెళ్ళి కందమూలాదులను సంపాదించడానికి నేనశక్తురాలను. ఈ బిడ్డలను పోషించడానికి, నన్ను రక్షించడానికి మీరు తప్ప వేరే దిక్కు లేదు. ఈ బిడ్డలయందు దయపెట్టండి. నా ఈ విన్నపాన్ని వినండి –

**కులస్వామీష్టదేవో నో జగద్రక్షణదీక్షితః ।**
**శరణాగత సంత్రాణః శ్రీనివాసః సతాం గతిః ॥**

**– శ్రీ. వేం. మా. ఆదిత్య. పు. అ. 1. శ్లో. 30.**

'జగద్రక్షణదీక్షితుడు, శరణాగత రక్షకుడు, సత్పురుషులకు పరమగతి అయిన శ్రీనివాసుడు మనకు కులదైవం, ఇష్టదైవం. ఆయన అనేకమంది భక్తులను కాపాడాడు. భక్తవత్సలుడు, కాబట్టి మీరు ఆయన వద్దకు వెళ్ళి ఆ లక్ష్మీపతి పాదపద్మాలను శరణువేడి ఆయనను ప్రార్థించండి. దానివల్ల ఆయనకు ప్రీతి కలుగుతుంది. వెంటనే అనుగ్రహిస్తాడు. దానితో మన జీవనం గడుస్తుంది. కాబట్టి ఓ దయానిధీ! మీరు ప్రసన్నులు కండి. మాయందు దయ ఉంచండి!

ఈ విధంగా అతి దీనంగా ఆమె రాత్రి, పగలు ప్రార్థించినప్పటికీ దేవశర్మ తన తపస్సుకు విఘ్నం కలుగుతుందనే భయంతో ఆమె మాటలను పట్టించుకోలేదు. ఇలా ఉండగా ఒకనాడు దైవవశాత్తు వాళ్ళ పుణ్యం పండగా ఆతని గురువైన వాయుదేవుడు వారింటికి విచ్చేశాడు. ఆయన ఆ పతివ్రతయందు ఆ బిడ్డల యందు ప్రసన్నుడై దయతో ఏతెంచాడు.

దేవశర్మ తన తపస్సమాప్తి సమయంలో విచ్చేసిన తనగురువు, జగద్గురువైన వాయుదేవుని చూచి సంతోషంతో వెంటనే లేచి నిలబడి, భక్తితో సాష్టాంగ నమస్కారం చేసి అంజలిబద్ధుడైనాడు. అప్పుడు వాయుదేవుడు తన శిష్యుడైన దేవశర్మతో ఇలా మధురంగా హిత వచనాలు పలికాడు –

**శ్రీమద్వేంకటనాథస్య యాత్రార్థం గచ్ఛ మాచిరమ్ ।**
**తేనే హాముత్ర తే-భీష్ట సిద్ధిర్భ వతి నాన్యథా ॥**

**– ఆదిత్య పురాణం. అ. 1. శ్లో. 37.**

ప్రియశిష్యా! దేవశర్మా! నీవు వెంటనే వేంకటనాథుని సేవించుటకై వేంకటాచల యాత్రకు బయలుదేరు. దాని వలన నీకు ఇహపరాల్లో అభీష్ట సిద్ధి కలుగుతుంది. లేనియెడల నీకు అభీష్ట సిద్ధి కలుగదు. లక్ష్మీపతి, దయాసముద్రుడు, బ్రహ్మాది దేవతలకు కూడ వరప్రదాత అయిన వేంకటేశ్వరుని యాత్ర విషయంలో సందేహం వలదు. శ్రద్ధా భక్తులతో వెంటనే బయలుదేరుము.

ఈ విధంగా తన గురువైన వాయుదేవుడు మరల మరల బోధించగా విష్ణుదేవుని యాత్ర యందు మహాదరం కలవాడై, గురువుగారుపదేశించిన విషయాన్ని గ్రహించాడు దేవశర్మ. దానినే మరల మరల చింతించాడు. గురూపదేశం బలమైనది.

గురువుగారు ఆజ్ఞను ఉల్లంఘించరాదు. 'గురూపదేశోబలవాన్ గురోరాజ్ఞాంనలంఘయేత్' అనే ధర్మ శాస్త్రార్థాన్ని స్మరించుకొని వేంకటాచలానికి బయలుదేరాడు.

దేవశర్మ శేషాద్రికి వెళ్ళి అక్కడ శ్రీనివాసుని దర్శించాలనే కుతూహలంతో ఆనందమును, జ్ఞానమును ప్రసాదించేవాడు, విష్ణుమూర్తి, ఆనందమయమైన పేరుగలవాడు, అయిన శ్రీ వేంకటేశుని ఆనందనిలయంలో ఆనందంతో దర్శించాడు.

**ఆనంద జ్ఞానదం విష్ణుం ఆనందమయనాయకమ్ ।**
**ఆనందేన దదర్శా-యం ఆనంద నిలయాయమే ॥**

**– ఆదిత్య పురాణం. అ. 1. శ్లో. 42.**

శ్రీదేవి, భూదేవులతో విహరిస్తున్నవాడు, అనేక లీలా విలాసాలు కలవాడు, భక్తులను చూచినంత మాత్రాన్నే అనుగ్రహంతో చిరునవ్వులు చిందించే శ్రీ వేంకటేశ్వరునికి భక్తితో నమస్కరించి దేవశర్మ ఈ విధంగా స్తుతించాడు –



## శ్రీనివాసస్తుతి

**దయానిధే! దయానిధే! దయానిధే! దయానిధే! ।**
**నమోనమో నమోనమో నమోనమో నమోనమోః ॥**

**– ఆదిత్య పు. అ. 1. శ్లో. 44.**

ఓ కరుణా సముద్రా! నీకు నమస్కారము. ఓ పద్మనాభా! లక్ష్మీపతీ! బ్రహ్మరుద్రేంద్రాదులకు పూజ్యుడా! పద్మమాలాధరా! పద్మ పత్రముల వంటి నేత్రములు కలవాడా! చతుర్భుజాలలో శంఖ చక్రములను, అభయముద్రను, పద్మమును ధరించినవాడా! పద్మముల వంటి కోమలమైన హస్తములు, పాదములు కలవాడా! సకల ప్రాణుల హృదయ కమలములందు నివసించే ఓ శ్రీనివాసా! సుందరాతిసుందరములైన నీ దివ్యపాద పద్మములకు నమస్కరిస్తున్నాను.

ఓ వేంకటేశా! నీ పాదపద్మముల మహిమ అనంతమైనది. నీవు త్రివిక్రమావతారమును ధరించి ఒక్క పాదములోనే బ్రహ్మాండాన్నా క్రమించావు. నీ పాదపద్మముల యొక్క చిటికెన వ్రేలి గోటియందలి మాణిక్యమువలె ప్రకాశిస్తున్న నీ అనంత కల్యాణగుణములను, మహిమా విశేషాలను నిరంతరం దర్శిస్తూ, సేవిస్తున్న లక్ష్మీదేవి వాటి మహిమను వర్ణించాలని దీక్షబూని ఆనందంతో ఆశ్చర్య సాగరంలో మునిగిపోయింది. అనంతాలైన వేదాలకు కూడా గోచరంకాని నీ మహిమను వర్ణించలేకపోయింది.

నీవు బ్రహ్మదేవునికి స్వయంగా పుత్రవాత్సల్యంతో వేదాలను పదేశించావు. ఆయన నీ కల్యాణగుణాలను స్మరిస్తూ పరమానందాన్ని పొందుతున్నాడు. దేవేంద్రుడు నీ గుణగణాలను

లెక్కిస్తూనే ఉన్నాడిప్పటికీ. సకల వేదార్థ విశారదుడైన, వేయి ముఖములుగల ఆదిశేషుడు కూడ నీ కాలికొనగోటి వైభవాన్ని కూడా తెలుసుకోలేక పోయాననంటున్నాడు.

అనంతాలైన వేదాలు తమలోతాము పరస్పరం విచారించుకొని ఈ విధంగా చెబుతున్నాయి – శ్రీమహావిష్ణువుయొక్క ఆజ్ఞచే బ్రహ్మాది దేవతలందరు సత్యాదిలోకాల్లో ఒక్కొక్కరు ఒక్కక్కలోకానికి అధిపతిగా నియమించబడ్డారు. ఇష్టభోగాలననుభవిస్తున్నారు. భక్తితో శేషాచలంలోని శ్రీనివాసుని సేవిస్తున్నారు. అనంతాలైన వేదరూపాలలో ఉన్న మేము కూడా ఆ భగవంతుని దివ్యగుణాలను కీర్తించడానికి వర్ణించడానికి శ్రీహరిచే నియమించబడినాము. భగవంతుని గుణాలు అనంతాలు. కావున మేమంతా కలిసి (వేదాలన్నీ కలిసి) కూడ ఆ పురుషోత్తముని పాదనఖాగ్రమందలి ఒక్క భాగాన్ని కూడా వర్ణించలేకపోతున్నాము.

వేదాలు ఆయనను స్తుతించడానికే పుట్టినవి. కావున ఈ విధంగా నిశ్చయించుకొని వేదాలు ఆ భగవంతుని కొన్నిగుణాలను మాత్రమే వర్ణించగలిగినవి. అయినప్పటికీ ఒక్కొక్క గుణము అనంతంగా కనబడింది. అది చూచి వేదాలు పరస్పరం ఇలా అనుకొన్నాయి – సూర్యకిరణాలు దిక్కులంతా వ్యాపించినట్లు భగవంతుని గుణాలు అనంతంగా ఉన్నాయి. కావున మిగిలిన గుణాలన్ని వదలిపెట్టి ఒక్కగుణాన్నే వర్ణిద్దామనుకొన్నాయి.

ఇలా నిర్ణయించుకొని వేదాలు భగవంతుని ఒక్కగుణాన్నీ వర్ణించడం మొదలు పెట్టినై. కానీ ఆ ఒక్క గుణం కూడా అనంతం కావడం చేత దానిని కూడా పూర్తిగా వర్ణించలేకపోయినై. అన్నిదిక్కులా, పైనా, క్రిందా వ్యాపించిన భగవంతుని దివ్యగుణాలు సర్వ వ్యాపకాలని తెలుసుకొన్నాయి. ఆయన దివ్యగుణాలు అత్యద్భుతాలని కీర్తించినై. 'ఆ భగవంతుని దివ్యగుణాలను దర్శించుటకు, వినుటకు, కీర్తించుటకు, తెలిసికొనుటకు మనకు సాధ్యంకాదు. ఇక స్తోత్రం ఎలాచేస్తాం? అవి మనకు అతీతమైనవి. మనము అల్పజ్ఞులము. కావున మనమేమని వర్ణిస్తాము? ఇక ప్రశంసించుట చాలు! అని వేదాలు తమ శక్త్యనుసారం భగవంతుని కల్యాణ గుణాలను వర్ణించాయి.

అట్లయినప్పటికి నీ పాద కొనగోటి గుణాలలో అనంతమైన వాటిని విభజిస్తే, ఒక్క గుణంలో ఒకవంతు మాత్రమే వేదాలు వర్ణించగలిగాయి. అనేక గుణాలు వర్ణించబడలేదు నీ అనంత గుణాలను పూర్తిగా వర్ణించలేక పోయాయి. ఈ విధంగా లక్ష్మీదేవి, బ్రహ్మదేవుడు, ఆదిశేషుడు, నాలుగు వేదాలు నీ గుణాలను దర్శించుటకు అశక్తులైనాయి. శ్రీమహావిష్ణువుయొక్క సమస్త గుణాలను వర్ణించడానికి అనంతాలైన వేదాలకు కుడ సాధ్యం కాలేదు. నీ గుణాలు అత్యద్భుతాలైనవి. నీవు సకల కల్యాణ గుణపరిపూర్ణుడవు.

## శ్రీనివాసుని దివ్యసౌందర్యం

దేవశర్మ శ్రీనివాసుని యింకా యీ విధంగా స్తుతించాడు. 'దేవదేవా! నీ పాదసౌందర్యం అత్యద్భుతమైనది. నీ ప్రేరణతో యథాశక్తి కీర్తిస్తాను. లక్ష్మీ దేవి నీ వక్షస్థలంలో ఉన్నప్పటికీ నీ పాద పద్మముల దివ్యసౌందర్యాన్ని చూసి ముగ్ధురాలయ్యింది. ఆమె ఆశ్చర్య చకితురాలై తన రెండు నేత్రాలతో మీ పాదసౌందర్యాన్ని పూర్తిగా దర్శించటం అసాధ్యమని తలిచి మూడు రూపాలు ధరించింది. కుడివైపున శ్రీదేవిగాను, ఎడమవైపు భూదేవిగాను, ముందర నీలాదేవి గాను మూడు రూపాలు ధరించి, ఆరు నేత్రాలతో నిశ్చల చిత్తంతో నీ పాదపద్మాలను దర్శిస్తూ నీ దివ్యసౌందర్య రసామృతాన్ని నిత్యం గ్రోలుతున్నప్పటికీ ఆమెకు యిప్పటికీ తృప్తి కలుగలేదు.

ఓ సుందరరూపా! శ్రీనివాసా! నీ నాభికమలం నుండి ఉద్భవించిన చతుర్ముఖ బ్రహ్మ నీ పాద సౌందర్యంలో మనస్సును లగ్నంచేసి తన ఎనిమిది నేత్రాలతో రాత్రింబగళ్ళు ఆ అద్భుత సౌందర్యాన్ని దర్శిస్తున్నాడు. అయినప్పటికీ ఆయన ఆ సౌందర్యాన్ని చూడడానికి ఎనిమిది కళ్ళు చాలవని అనేక రూపాలు ధరించాడు. కంఠంలో కౌస్తుభమణిగాను, నాభికమలంగాను, శ్వేత ద్వీపం, అనంతాసనం, వైకుంఠము అనే మూడు చోట్ల, సత్యలోకం, మేరు పర్వతం మొదలైన అన్నిచోట్ల ఒక్కొక్క రూపం ధరించాడు.

అమృతాన్ని కూడా తిరస్కరించే మీ పాదసౌందర్య రసాన్ని ఆ బ్రహ్మదేవుడు ఇన్ని రూపాలు ధరించి రాత్రింబగళ్ళు ప్రీతితో ఆస్వాదిస్తున్నాడు. అయినప్పటికీ ఆయనకు కూడా యిప్పటికీ తృప్తి కలుగలేదు. ఆహా! ఏమి మీ పాద సౌందర్య భాగ్యం! మీకు శయ్యగాను, ఆసనంగాను, గొడుగుగాను, అనేక విధాల బహు రూపాలలో మిమ్మల్ని సేవిస్తున్న ఆదిశేషుడు వేయి కళ్ళతో ఎల్లప్పుడు మీవద్దనే ఉండి మీ పాద సౌందర్యాన్ని దర్శిస్తూ యిలా అనుకున్నాడు. ఆహా! మన ప్రభువు యొక్క పాద సౌంద్యం అతి విచిత్రమైనది. మనోహరమైనది. ఇంతకు ముందెన్నడూ కనీవినీ ఎరుగని అతి గంభీరమైనది, విలక్షణమైనది, సులక్షణమైనది, పరమ భక్తితో దర్శింపదగినది, జగత్తును మోహింపజేసే వాటిని కూడా మోహింపజేసేది. నాకు భగవంతుడు బహు నేత్రాలను ప్రసాదించాడు. ఆయన అనుగ్రహం వల్ల ఎప్పుడూ ఆయన వద్దనే ఉండి ఆయనను సేవించే భాగ్యం కలిగింది, అని ఎంతో ఆనందపడుతూ శ్రీహరికి అత్యంత ప్రీతిపాత్రుడై అనేక వేల నేత్రాలతో ఆ లక్ష్మీపతి పాద పద్మాల యొక్క అసాధారణ దివ్య సౌందర్యాన్ని మరలా మరలా దర్శించి దర్శించి ఆ ఆదిశేషుడు మహానంద సాగరంలో మునిగి పోయి యీ విధంగా అనుకున్నాడు నేను నా ప్రభువు యొక్క పాదాల చెంతనే ఎల్లప్పుడు నివసిస్తాను. విష్ణుమూర్తి పాదపద్మాలను వదలి వైకుంఠానికి వెళ్ళను. ఈ పాద సౌందర్యాన్ని తిలకించుట


వలన కలిగే ఆనందం వైకుంఠంలో గాని, మోక్షం వల్ల గాని లభించదు. శ్రీహరి పాదాల క్రింద పాతాళలోకం ఉంది కాబట్టి అక్కడికి వెళ్ళినా ఆయన పాదసౌందర్యాన్నే ఆస్వాదిస్తాను గానీ ఆ సౌందర్యామృతాన్ని వదలి క్షణకాలం కూడా ఉండలేను! అని ఆదిశేషుడు నిశ్చయించుకొని శ్రీహరి పాదసౌందర్యమోహితుడై ఎక్కడెక్కడ ఆ లక్ష్మీపతి పాదమూలాలు కనబడతాయో అక్కడక్కడ ఎల్లప్పుడు ఆ దివ్యపాదారవింద సౌందర్యామృతాన్ని గ్రోలుతూ ఉన్నాడు.

ఇక సర్వలోకాలకు శుభంకరుడైన శంకరుడు ఈ విధంగా చింతించాడు ఆ శేషాద్రి నాథుని అనుగ్రహం వలన ఆదిశేషునికి ఏమదృష్టం కలిగింది? ఆయనకి బహునేత్రాలు ఉన్నాయి. అన్ని నేత్రాలతో ఆయన పాద సౌందర్యామృతాన్ని సేవిస్తున్నాడు. ఈ రెండు నాకు దుర్లభమైనవి కదా! నాకు మూడు నేత్రాలున్నప్పటికీ ఈ భాగ్యం కలుగలేదు కదా! వచ్చే జన్మలో శేషుడుగా జన్మించుటకు గొప్ప తపస్సు చేస్తాను అనుకొని శివుడు వైరాగ్యంతో కైలాసానికి వెళ్ళాడు.

ఓ వేంకటేశా! లక్ష్మీపతీ! నీ ముఖ పద్మమునుండి జన్మించిన ఇంద్రుడు వేయి కనులు కలవాడైనప్పటికిని అందరికీ దర్శించుటకు వీలు కాని ఆశ్చర్య కరమైన నీదివ్య పాదసౌందర్యాన్ని రాత్రింబగళ్ళు సందర్శిస్తున్నప్పటికిని ఆ పాదసౌందర్యమోహితుడై యిలా అనుకున్నాడు. నేను పూర్వం అమృతం తాగినప్పుడు కూడా యింతటి ఆనందం కలుగలేదు. అతి దగ్గరగా ఉండి చూస్తే ఆ సౌందర్యం సరిగా కనపడదు. కొంచెం దూరంగా ఉండి, చూస్తేనే ఎక్కువ ఆనందం కలుగుతుంది. అందువల్ల స్వర్గంలో ఉండే, కనురెప్పలు వాల్చకుండా వేయి కనులతో రాత్రింబగళ్ళు ఆయన్ను దర్శిస్తాను. ఎప్పుడు 'ఇక చాలు' అని తృప్తి కలుగుతుందో అప్పుడు నా స్థానానికి వెడతాను! అని అనుకొని స్వర్గానికి వెళ్ళి రాత్రి, పగలు ఆ లక్ష్మీపతి తేజోవంతములైన పాద సౌందర్యామృతాన్ని పానం చేస్తూ ఉన్నాడు. అయినప్పటికీ ఇప్పటికి ఆయనకు తృప్తి కలుగలేదు. కాబట్టి అక్కడే స్థిరపడ్డాడు.

ఓ లక్ష్మీపతీ! నీ పాదసౌందర్యం బ్రహ్మాది దేవతలకే దుర్లభమైతే యిక యితరుల సంగతేమని చెప్పాలి? శ్రీమహావిష్ణుమూర్తీ! నీ పాద రేఖల మహిమ లోకాన్ని పవిత్రం చేస్తుంది. వాటిని గురించి విన్నవించు కుంటాను. నా అపరాధాన్ని క్షమించండి. ఓ భక్తవత్సలా! నీ పాద మాహాత్మ్యాన్ని గురించి వినే భక్తుల అజ్ఞానాంధకారాన్ని పోగొట్టి జ్ఞాన ప్రకాశాన్ని కలిగించి నిన్ను చేరే మార్గాన్ని దర్శింప చేయుటకై నీ పాదములందు చక్రరేఖను కలిగి ఉన్నావు.

నీ పాదమహిమను నిరంతరం మననం చేసేవారికి షడంగాలతో పాటు నాలుగు వేదములను, రామాయణ, భారతాలనే ఇతిహాసములను, పురాణములను, మంత్రోపనిషత్తు రూపములైన సర్వ విద్యలను ప్రసాదిస్తాను అని తెలుపుచు నీ పాదములందు శంఖరేఖను ధరించావు. శ్రీహరీ! నీ పాదమాహాత్మ్యాన్ని ధ్యానం చేసేవారికి ఉపద్రవాలను కలిగించే దుష్టులైన దైత్యులు, రాక్షసులు, పిశాచులు, కూష్మాండులు, బ్రహ్మరాక్షసులు మొదలగు వారిని చూర్ణం-చేస్తాను అని తెలియజేస్తూ నీ పాదంలో గదారేఖను ధరించావు.



ఓ లక్ష్మీపతీ! పద్మనాభా! నీ పాద మాహాత్మ్యమును గురించి స్తుతించేవారి ఉత్తమ మందిరాలలో భార్య అయిన లక్ష్మీ దేవితో, కుమారుడైన బ్రహ్మతోను, సకుటుంబంగా నివసిస్తాను అని తెలుపుతూ నీ పాద పద్మంలో పద్మ రేఖను ధరించావు. నీ పాదపద్మాలలో మహాపాపాలను పోగొట్టే విరజానది, మానస సరోవరం, ధనుష్కోటి, గంగాది సర్వతీర్థాలు నివసిస్తున్నాయి. ఆ తీర్థాలలో ప్రతిరోజు సహస్రదళ పద్మాలు వికసిస్తాయని సూచిస్తూ నీవు నీ పాదములో పద్మరేఖను ధరించావు. శ్రీదేవి నీ హృదయ పద్మంలో ఉన్నప్పటికీ నీ పాదపద్మములయందలి విలక్షణమైన సౌందర్యాన్ని తన నేత్ర పద్మములతో నిరంతరం దర్శిస్తూ తన

హృదయంలో ధ్యానిస్తున్నది. వేదాలచే కీర్తించబడిన నీ పాదాలను తన కరకమలాలతో ఎల్లప్పుడు సేవిస్తూ తన తొడలపై నీ పాద పద్మాలను ఉంచుకొని అర్చిస్తున్నది. దీన్ని సూచించడానికే నీవు నీ పాదములో పద్మరేఖను ధరించావు.

నీ పాద పద్మముల మహిమను తమ స్వహస్తాలతో వ్రాసి, వైష్ణవోత్తములకు దానం చేసేవారి పర్వతాల వంటి పాపరాశులను భేదిస్తాను అని తెలియజేయడానికి నీవు నీ పాదములో వజ్రరేఖను ధరించావు. నీ పాదములను పూజించేవారికి నిగ్రహించుటకు సాధ్యము కాని కామక్రోధాలనే మదగజాలను నిగ్రహిస్తాను అని తెలుపుచు అంకుశ రేఖను ధరించావు.

భక్తితో ఆదరంతో నీ పాదమహిమలను విని ఆనందించే భక్తులను పతాకము వలె ఉన్నతస్థితికి తేగలనని సూచించుటకై ధ్వజరేఖను ధరించావు. గోళాకారంలో ఉండే బ్రహ్మాండానికి వెలుపల జలం, అగ్ని, వాయువు, ఆకాశం, అహంకారం, మహత్తత్వం, సత్త్వరజస్తమోగుణాలు అనే తొమ్మిది ఆవరణలు ఉంటాయి. ఇవి ఒకదానికంటె ఒకటి పదిరెట్లు ఎక్కువ విశాలమైనవి. ఓ శ్రీహరీ! ఇంతటి దృఢమైన బ్రహ్మాండం కేవలం నీ కాలివేలి కొన గోటి నుంచి ఆవిర్భవించింది. ఇంతటి పరమాద్భుతమైన నీ పాదమహిమను ఎవరు వర్ణించగలరు?

ఆదిశేషుడు చాలా గొప్ప తపస్సు చేసి జగత్ప్రభువైన నిన్ను ఆరాధించి నీ దివ్యాను గ్రహంతో దుర్లభమైన మహాభాగ్యాన్ని పొందాడు. నీకు శయ్య గాను, ఆసనంగాను, పాదుకలుగాను, గొడుగుగాను ఉంటూ నిన్ను సేవిస్తున్నాడు. అది చూచి లక్ష్మీదేవి నా పతియొక్క శరీరసుఖాన్ని నేనే అనుభవిస్తాను అనుకొని ఛత్రరూపంలో ఉండుట వలన పాదుకలుగా ఉండుట వలన కలిగే సుఖమంతా నాకే కలగాలని ఆమె నీ వక్ష స్థలంలో చేరింది.

ఇంకను వైకుంఠాది లోకాలలోను, చతుర్దశ భువనాలలోను బ్రహ్మాండం లోపల బయట అందరి హృదయ కమలాలలోను భగవంతుడు ఎక్కడెక్కడ ఉంటాడో అక్కడక్కడ నేను కూడా ఉంటాను. ఆ భగవానుడు నా హృదయ కమలంలో కూడా ఉన్నాడు. నాహృదయ కమలాన్ని సుగంధ పరిమళ వాయువుతో కూడిన క్రీడా వనంగా చేస్తాను. ఆ క్రీడా వనం మల్లె, మొగలి, సంపంగి, జాజి మొదలైన పుష్పాలతోను, ఖర్జూరం, పనస, ద్రాక్ష, అరటి, కొబ్బరి, రేగు, మాది, వెలగ, మామిడి, దానిమ్మ, నేరేడు, నిమ్మ, పోక మొదలగు ఫల వృక్షములతోను, పారిజాతాలతోను, కల్పవృక్షాలతోను, మందార వృక్షాలతోను, తుమ్మెదలు మొదలైనవాటితో నిండి ఉంటుంది.

ఆ క్రీడావనంలో స్వచ్ఛమైన నీటి సరస్సు ఉంది. అది బంగారు మెట్లతో అలంకరించబడి ఉంది. నవరత్నాల కాంతితో శోభించే సువర్ణఛాయ గల కమలాలు, పచ్చని కలువలు, ఎర్ర కలువలు, మత్స్యాలు, తాబేళ్ళు, హంసలు, మదించిన తుమ్మెదల ఝంకారాలతో నిండి ఉంది. దానిలో రత్నమయమైన క్రీడామంటపంగాను దివ్యరత్నాల కాంతితో శోభిస్తున్న రత్నపీఠంగాను, లక్ష్మీదేవియే రూపుదాల్చింది.

అక్కడ ఆ జగన్మాత షోడశోపచారములతో నిన్ను పూజిస్తున్నది. క్షీరాన్నం, పంచభక్ష్యాలు, వ్యంజనాలు, పంచామృతాలు, పంచ శాకాలు, పవిత్రములు అయిన రుచికరాలైన క్రొత్త క్రొత్త ఫలాలు, కందమూలాదులు, స్వర్ణపాత్రలో మంచినీరు మొదలగు వాటిని, నిత్యతృప్తుడవు, పూర్ణకాముడవు, సమస్త పదార్థ సార స్వరూపుడవు అయిన నీకు సర్వసార స్వరూపిణియైన లక్ష్మీదేవి ప్రీతితో స్వయంగా అర్పిస్తున్నది.

ఆ తరువాత నీవు భోజనానంతరం విశ్రమించుటకు– అతి మనోహరమైన తూగుటుయ్యలగా తన్ను తాను కల్పించుకుంటుంది. ఆ ఊయల చాలా విశాలంగా శుభలక్షణ సంపన్నమై బంగారు గొలుసులతో వ్రేలాడుతూ ఉంది. దాని పాదాలు (కోళ్ళు) పగడాలతో చేయబడినాయి. దాని పలకలు మంచి వజ్రాలతో చేయబడినాయి. బంగారు పట్టీలతో ఓతప్రోతంగా నేయబడింది. ఇంకా దానిని మాణిక్యాల గుత్తులు, బంగారు చాందినీలు, ముత్యాల సరాలతో– అలంకరించారు. లక్ష్మీదేవి నీ సేవకై ఆ ఉయ్యాలలో భూరూపిణియై శయ్యగా మారింది. శ్రీరూపిణియై తలగడగాను అమరింది. నీలారూపిణియై నిన్ను సేవించుటకై తాంబూలం, బంగారు విసనకర్ర, మెరపు కాంతిగల చామరాలు, వైడూర్యమణుల గుత్తులతో– కూడిన ఛత్రం, రత్నపీఠంలో పాదుకలు, యింకా సర్వ రాజోపచారాలుగాను అమరింది.

అపరిమిత తేజశ్శాలివైన దేవదేవుడవైన నీకు లక్ష్మీదేవి సర్వభోగ్య వస్తువులుగా మారింది. ఈ విధంగా నీ సేవ చేయగోరి యిన్ని రూపాల్లో నిన్ను సేవిస్తూ ఆ లక్ష్మీదేవి మహానంద సాగరంలో మునిగి నీతో క్రీడిస్తున్నది. నీవు కూడా వైకుంఠాది లోకాలలో ఆ లక్ష్మీదేవితో క్రీడిస్తున్నావు. ప్రత్యేక ఆవరణంలో బ్రహ్మాది దేవతలు, దిక్పాలకులు తమ తమ రూపాలలో నిన్ను ఉన్నతాసనంలో సేవిస్తున్నారు.

శ్రీనివాసా! రమానాథా! నీ నాభికమలంలో చతుర్ముఖ బ్రహ్మను, హృదయంలో పరమ శివుని, యితర అవయవములలో ఇంద్రాది దేవతలను, మహర్షులను, స్వేదజ – అండజ – ఉద్భిజ – జరాయుజాలనే నాలుగువిధాలైన ప్రాణులను సృష్టించి నీవు వారిలో ప్రవేశించి, లోపల బయట వ్యాపించి వెలుపల ఉండి రక్షిస్తున్నావు. జడాత్మకమైన ప్రకృతి, జీవులు అందరూ నీకు భిన్నమైనవారు. నీకు పరాధీన దోషం లేదు. నీవు సర్వత్ర స్వతంత్ర గుణాలచే ప్రకాశిస్తున్నావు. నీకు దేనియందు కోరిక లేదు. నీవు నిత్యతృప్తుడవు. పూర్ణకాముడవు, దయార్ద్రహృదయుడవు. సత్య స్వరూపుడవు, సత్య సంకల్పుడవు, లక్ష్మీదేవి, బ్రహ్మ, శివుడు, ఇంద్రాదులచే పూజించబడేవాడవు.

**(సశేషం)**

ధారావాహికం



# శ్రీ కృష్ణ తత్వం

– రాళ్ళబండి శ్రీనివాసన్

కాళిందీనదీ తీరాన అశోక వృక్షంకింద నందనందనుని దర్శించినారు ముని పత్నులు.ఆ సమయంలో కృష్ణుడు ఏవిధంగా వున్నాడంటే– ఒక చెలికాని మీద ఒక చేయిచాచి–వేరొక చేతితో కమలాన్ని పట్టుకుని విలాసంగా తిప్పుతున్నాడు.నల్లని కొప్పునకు అందని ముంగురులు లేతచెక్కిళ్లపై చిందులువేస్తున్నాయి. శ్యామసుందరుని తనువుపై పట్టు పీతాంబరం ఎంతో నిగనిగలాడుతోంది.మెడలో వనమాలతో పాటు– నెమలి పింఛం ధరించాడు.సకల జగత్తుని సమ్మోహపరిచేటట్లు నటవేషంతో విరాజిల్లుతున్నాడు.ఆ దివ్యమైన కృష్ణ భగవానుని కన్నుల కరువుతీరేటట్లుగా చూసారు ముని పత్నులు.

బలరామకృష్ణులకు గోపబాలురకు వడ్డించారు బ్రాహ్మణ భార్యలు. అందరూ తనివితీరా తిన్నారు. తరువాత కృష్ణుడు అంటున్నాడు ఇలా– సాధ్వీమణులారా! మీ నిష్కామభక్తి అపూర్వమైంది.లోకంలో సహజంగా భార్యాబిడ్డలమీద– ఆస్తిపాస్తులమీద ప్రేమానురాగాలు ఎక్కువ. అయితే నన్ను మించిన ప్రియమైనది లేదని– తెలుసుకుని–మీరందరునూ ఇక్కడికి వచ్చారు. ఇక మీ సంకల్పం తప్పకుండా నెరవేరుతుంది. ఇక వెళ్లండి.

స్వామీ!మీ అనుగ్రహానికి పాత్రులమైన మమ్ములను మళ్లీ సంసారకూపంలోనికి తోస్తారా? వద్దు తండ్రీ! మేం నీ కోసం అందరినీ విడిచిపెట్టి వచ్చాం. తిరిగి వెడితే తిరస్కరించబడుతామని కృష్ణ భగవానునికి శరణాగతి చేసారు. అమ్మలారా! మీ వాళ్లు ఆగ్రహించరు.నా మాట నమ్మండి. త్వరలో మీరందరూ నా సన్నిధిని చేరుకుంటారు. ముని పత్నులు వెళ్లారు.

పూతనాదుల సంహారంలో బాలకృష్ణుడు లీలామానుష రూపుడని–సాక్షాత్తు నారాయణుడని వేదవేత్తలైన బ్రాహ్మణులకు తెలుసు.బతుకుతెరువు కోసం–పరమదుర్మార్గుడైన కంసునికి భయపడ్డారు. అందుకే కృష్ణభగవానునికి అన్నాదులను సమర్పించలేకపోయారు.

అయితే మధురానగరంలో కంసునికి సేవలు చేసే–దాసి కుబ్జ ఆ రాజుకు భయపడలేదు. బలరామకృష్ణులకు తన కళానైపుణ్యాన్ని ప్రదర్శించి అంగరాగాదులతో అద్భుతంగా అలంకరించింది. ప్రతిఫలంగా ఆమె వికృత రూపం పోయింది సౌందర్యవతిగా మారింది. లౌకిక సుఖభోగాల కోరింది.

ఆవిధంగానే మాలాకారుడు కూడా కంసునికి భయపడలేదు. చక్కని పుష్పమాలతో కృష్ణుని అలంకరించాడు. అయితే అలౌకికమైన భక్తిని– సేవాభావాన్ని– భూతదయని కోరుకున్నాడు.

కృష్ణ భగవానుని ఆదేశంతో బ్రాహ్మణ భార్యలు తిరిగి యాగ శాలను చేరారు. తమ భార్యలను ఎటువంటి దోషదృష్టితో చూడలేదు.పైగా ప్రేమతో ఆదరించారు. కృష్ణార్పణం అంటూ పరులకు అన్నం పెట్టినపుడు అనంత పుణ్యఫలాన్ని పొందుతారట. అయితే మరి సాక్షాత్తూ కృష్ణభగవానుడే స్వయంగా అన్నాన్ని స్వీకరిస్తే లభించే ఫలమనేది ఏవిధంగా వుంటుందో చెప్పలేం కదా. పోతే కృష్ణ భగవానుని మీద తమ తమ పత్నులకు వున్న అలౌకికమైన భక్తిని– బ్రాహ్మణులు మెచ్చుకున్నారు.

చెప్పాలంటే చతుర్విధ వేదాధ్యయనం– లెక్కలేని జపతపాలు– అదే విధంగా ఒక్కటేమిటి– వైదికమైన విజ్ఞానాన్ని పుక్కిటపట్టినాం.అయితే అలాంటివి ఏమీ చేయ కుండానే మీకు ఆ సర్వ జగద్రక్షకుడు– మోక్షప్రదాతయైన కృష్ణ పరమాత్మ అనుగ్రహం లభించింది.మేమందరమూ పరమ పాపాత్ములం. స్వర్గం మీద ఆశతో– వ్యర్థమైన కర్మకాండను నమ్మి మాయామోహితులమైపోయాంకదా– ఆవిధంగా పశ్చాత్తాపపడ్డారు.

నందగోపవృద్ధులు కృష్ణునితో ఈవిధంగా అంటున్నారు– వర్షాధిదేవత దేవేంద్రుడు.దేశం సస్యశ్యామలం కోసం యాగం చేస్తూ–దేవేంద్రుణ్ణి పూజించడం పరిపాటి.ఇది అనాదిగా వస్తున్న ఆచారం.అందుకు కృష్ణుని జవాబు–

**కర్మణా జాయతే జంతుః కర్మణైవ విలీయతే ।**

**సుఖం దుఃఖం భయం క్షేమం కర్మణైవాభిపద్యతే ||**

విశ్వంలోని సకల జీవుల సుఖదుఃఖాలు భయాలు క్షేమాదులు కర్మబద్ధాలు. భగవానుడే కర్మఫలప్రదాత. కర్మలు ఆచరించకపోతే ఏవిధమైన ఫలమూ లభించదు. దేవేంద్రునికి మనం భయపడాల్సిన పనిలేదు.కొండలే మనకూ- పశువులకూ జీవనాధారం. కనుక గోవర్ధన పర్వతాన్ని పూజిద్దాం.

కృష్ణుని మాటలకు గోపవృద్ధులు అందరూ అంగీకరించారు. వెంటనే బ్రాహ్మణులతో యజ్ఞాన్ని చక్కగా చేయించారు. అప్పాలు పరమాన్నాలు రకరకాల పిండివంటలు ఇంకా కూరలు పప్పు అన్నం మొదలైనవి నైవేద్యంగా సమర్పించారు.

తరువాత కృష్ణుడు గోవర్ధన గిరి మీదకు ఎక్కాడు. దివ్యాద్భుతమైన రూపాన్ని ధరించాడు.పర్వతాన్ని నేనే అంటూ నివేదించిన సమస్త పదార్థాలను ఆరగించాడు. గోపీ గోపికలు అందరి ముందు చేరి-తన మహాద్భుతమైన రూపానికి నమస్కారం చేసాడు. గోవుల సంక్షేమం కోసం ఈ దివ్య పర్వతానికి ప్రణమిల్లి కృతజ్ఞతలు తెలుపుదాం-అన్నాడు కృష్ణుడు. అందరూ అలాగే చేసారు. వ్రజవాసుల మీద ఆగ్రహోదగ్రుడైనాడు ఇంద్రుడు. జలప్రళయంతో వాళ్లందరిపై భయంకరవిలయాన్ని సృష్టించాలని సంకల్పించాడు. మానవమాత్రుడైన కృష్ణుడు ఒక యాగవిఘ్నకారకుడని- వాడిని గో గోపికా గోపాలురని అంతం చేయడానికి సంవర్తక మేఘసమూహాన్ని ప్రేరేపించాడు.

ఇంద్రుని ఆదేశంతో విజృంభించాయి మేఘాలు. గోకులాన్ని కుంభవృష్టితో ముంచెత్తాయి. వెంటనే ఉరుములతో మెరుపులతో కూడిన పిడుగులని కురిపించాయి. ఎడతెరిపి లేకుండా రాళ్లవాన పడుతోంది.పరిసరాలన్నీ జలప్రవాహాలైనాయి. ఆ ప్రభంజనం ధాటికి గోకులమంతా కృష్ణుని ఆశ్రయించింది. ఆ పాపకృత్యానికి పూనుకున్న ఇంద్రునిపై కోపించాడు కృష్ణభగవానుడు.

"గోవర్ధనాచలమ్ దధార లీలయా కృష్ణశ్ఛత్రాకమివ బాలకః"-పిల్లవాడు పుట్టగొడుగును ఎత్తినట్లు కొండను చేతితో (చిటికెన వేలుతో) ఎత్తిపట్టాడు కృష్ణుడు."పూలగుత్తిని గొడుగులాగా భావించి- మహాశైలంబున్ వలకేల (కుడిచేత్తో) దాల్చి" అన్నాడు పోతన.

అందరినీ రమ్మని పిలిచాడు. మీ మీ ఆవులను వస్తువులను తీసుకుని రండి. ఈ కొండ కిందికి వచ్చేయండి. ఈ కొండ జారిపడదు. భయపడకండని అభయమిచ్చాడు కృష్ణుడు.

**బాలుండితడు కొండ దొడ్డది మహాభారంబు సైరింపగా**
**చాలుండో యని దీని కింద నలవన్ శంకింపగా పోలదు**
**ఈ శైలంబోనిధి జంతు సంయుక్త ధరాచక్రంబు పైపడ్డ**
**నాకేలల్లాడు బంధులారా నిలుడీ క్రిందన్ ప్రమోదంబునన్.**

కృష్ణుని మాటలు వ్రజవాసులు నమ్మారు. అందరునూ గోవర్ధనగిరి కిందకు చేరుకున్నారు. ఆ పర్వతాన్ని కృష్ణుడు ఎత్తి పట్టి ఏడు రోజులు గడిచాయి. గోవర్ధన గిరి గొడుగైతే కృష్ణదేవుని భుజదండం కర్ర అయ్యింది. ఆ పర్వతరాజం వికసించిన పద్మంలా విరాజిల్లుతోన్నది. ఆ ఏడురోజులు గోగోపికాగోపాలురకు ఆకలి లేదు. దప్పిక లేదు. కృష్ణ లీలలు కథలు కథలుగా చెప్పుకుంటారు. అవే వాళ్లందరినీ ఆదుకున్నాయి.

ఇక కృష్ణ భగవానుని యోగమాయా ప్రభావాన్ని గమనించాడు ఇంద్రుడు. ఆశ్చర్యచకితుడైనాడు. అతని దురాలోచన పూర్తిగా విఫలం కావడంతో- అహంకారం అణగారిపోయింది. ఇంక చెప్పేదేముంది? వెంటనే మేఘాలు వెనక్కి వెళ్లి పోయాయి. ఆ వెంటనే జడివాన ఆగిపోయింది. మబ్బులు మటుమాయమయ్యాయి. ఆకాశంలో సూర్యుడు ప్రకాశించాడు. అంటున్నాడు కృష్ణుడు- మీరందరూ మీమీ గోవులతో భార్యాబిడ్డలతో- సమస్త సామగ్రులతో నిర్భయంగా వెళ్లండి.

గోకులవాసియైన కృష్ణుడు సాక్షాత్ పరబ్రహ్మయని సందేహం ఏమాత్రం లేదని తెలుసుకున్నాడు దేవేంద్రుడు. తన అహంకారాన్ని అణగదొక్కాడు కృష్ణ భగవానుడు. తన అపరాధాన్ని క్షమిస్తాడని ఆశతో స్వర్గలోకం నుంచి వచ్చాడు. పశ్చాత్తప్తుడై- సిగ్గుతోడ తలవంచుకున్నాడు. సూర్యకాంతులతో మెరిసిపోతున్న తన కిరీటాన్ని - కృష్ణ భగవానుని దివ్య పాద పద్మాలను తాకుతు వుండగా- నమస్కరించాడు దేవేంద్రుడు. వినమ్రుడై చేతులు మోడ్చి- స్తుతించాడు.

**వాసుదేవ!కృష్ణ!వరద! స్వతంత్ర!**
**విజ్ఞానమయ! మహాత్మ! సర్వ పుణ్య**
**పురుష! నిఖిలబీజ భూతాత్మక బ్రహ్మ!**
**నీకు వందనంబు నిష్కళంక!**

కృష్ణా! నీవు షడ్గుణైశ్వర్యసంపన్నుడవు. పరమపురుషడవంటూ అనేక విధాలుగా స్తుతించాడు దేవేంద్రుడు. దేవా! నా యాగాన్ని నీవు భంగపరచావు. అందుకని ప్రతిక్రియగా బృందావనంపై ప్రళయభీకరమైన ప్రభంజనాన్ని సృష్టించినాను. నీతో కూడ వ్రజవాసులు అందరినీ సర్వ నాశనం చేయాలనుకున్నాను. మహాపరాధిని. నాయందు ఆగ్రహించకు. అనుగ్రహించు. జ్ఞానోదయాన్ని కలిగించిన గురుడవు నీవు. కరుణానిధీ! నీకు ఇదే నా శరణాగతి.

దేవేంద్రుని మాటలను విన్నాడు కృష్ణ పరమాత్మ. ఓయీ ఇంద్రా! ఐశ్వర్య మద గర్వంతో కన్ను మిన్ను గానక ప్రవర్తించిన నిన్ను అనుగ్రహించాలనే యాగాన్ని అడ్డుకున్నాను. సర్వ సంపత్తితో అహంకరించేవారు - దండధారియైన నన్ను విస్మరిస్తారు.అలాంటి వారిని అనుగ్రహించాలని తలచినపుడు ముందుగా వాళ్ల సర్వ సంపదలను పోగొడతాను. నీ ప్రవర్తన ఆ విధంగా వుంది. అయితే బుద్ధి తెచ్చుకున్నావు. ఇకమీదట నన్ను అనుక్షణమూ స్మరించు.

**(సశేషం)**



# సిద్ధి బుద్ధి ప్రదాతా ... గణేశా!

– గొర్తి రాజేశ్వరి

**శ్లో ॥ గజాననం భూత గణాది సేవితం**
**కపిత్థ జంబూఫల సార భక్షణమ్**
**ఉమా సుతం శోక వినాశ కారణమ్**
**నమామి విఘ్నేశ్వర పాదపంకజమ్**

భారతీయ సనాతన సంప్రదాయంలో వినాయకుడు సకల దేవతా గణాలకు అధిపతి. సాత్త్వికమైన దేవతా తత్త్వానికి, తామసమైన రాక్షసబాధ కలిగితే దానిని పోగొట్టి దేవతలందరికీ, సకలమానవాళికీసంభవించేవిఘ్నాలనుతొలగించిరక్షించేవాడు గణపతి. గణపతి దేవతా గణాలకు అధిపతి. 'గ' కారం జ్ఞాన వాచకం. 'ణ' కారం నిర్వాణము. జ్ఞాన నిర్వాణ శాసకుడు గణపతి. వ్యక్తం నుంచి అవ్యక్తం వైపు సాగే పయనాన్ని గణేశతత్వం అని

అంటారు. వేదాలకు ఆదిస్వరూపమైన ఓంకారమే గణపతి. గణపతి సకల శుభప్రదుడు. సర్వసిద్ధికారకుడు. ఆయన రూపం నిశ్చలతకు, ప్రశాంతతకు, సామరస్యతకు చిహ్నం. ''ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోప శాంతయే'' అంటూ చేతులు జోడించి నమస్కరించిన వారందరి పనులు దగ్గరుండి నెరవేర్చే స్వామి విఘ్నేశ్వరుడు. అందువలననే హైందవ సంప్రదాయంలో విఘ్నేశ్వరునిది ప్రథమ స్థానం. విఘ్నేశ్వరుడు జ్ఞానానికి, కర్మలకే కాక వేదాలకు ప్రభువని రుగ్వేదం చెబుతోంది.

పార్వతీ పరమేశ్వరుల తనయుడు వినాయకుడు. తనకంటూ ఏ నాయకుడూ లేని సర్వ స్వతంత్ర ప్రభువని అర్థం. గణేశుడు ప్రసన్నవదనుడు, అనగా సుందరమైన మంచి ముఖంతో, ఏకదంతంతో, కపిలవర్ణంతో, ఏనుగు చెవులంత విశాలమైన చెవులతో, పెద్ద పొట్టతో విఘ్నాలను నాశనం చేస్తూ గుణసంపన్నుడై, ధూమ్రవర్ణంతో సకల గణాలకూ, గుణాలకూ అధినేతగా, మస్తకంలో చంద్రుని ధరించినవాడు. గజాననుడు. గజ + ఆననుడు = గజాననుడు. గజ ముఖము కలవాడని అర్థము. ఏనుగు విజ్ఞానానికి ప్రతీక. ఏనుగు తొండము అతి సూక్ష్మమైన వస్తువులను సైతం ఎంత సులువుగా గ్రహిస్తుందో, పెద్దవైన వృక్షాలను సైతం సులువుగా పెకలిస్తుంది. గణేశుని రూపంలో నకారాత్మక శక్తిని నశింపచేసే శక్తితో పాటు, ఆధ్యాత్మిక శక్తిని అద్భుతంగా పెంచగల శక్తి ఉంది. ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించి, విశ్లేషించే గుణం, శాంతం, ధైర్యం, సుఖ శాంతులు ఉంటాయి. తన విశాలమైన చెవులతో ఆర్తులు, అభాగ్యులు, అమాయకులైన భక్తుల మొరలను విని వారు సమర్పించే ఒక్క గరికె పూజకే పులకించి, పరిష్కరించే దేవదేవుడు వినాయకుడు.

తొలిపూజ అందుకునే ఇలవేల్పు గణనాథుడు. ధార్మిక, లౌకిక కార్యక్రమాలేవైనా వినాయకుడినే తొలుత పూజించడం సర్వ సాధారణం. గణపతిని సంతోషపెడితే ఆటంకాలు రాకుండా కార్యసిద్ధి లభిస్తుందని, సకల కష్టాలు తొలగుతాయని, ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని భక్తకోటి నమ్మకం. గణేశుని ఆరాధన కలికాల కష్టాలను తొలగిస్తుంది. అందుకే ఆ స్వామి అష్టోత్తరాలలో ''ఓం కలికల్మష నాశనాయ నమః'' అనే నామం ద్యోతకమవుతుంది. మంత్రశాస్త్ర ప్రకారం మానవ, జంతు ఆకృతులు కలగలిసిన దేవతామూర్తులు శీఘ్ర అనుగ్రహ ప్రదాతలు. అందుకే ఉపాసకుల్లో ఈ దేవతల ఉపాసకులే అధికంగా ఉంటారు. నమ్మి కొలిచిన వారి కొంగు బంగారు గణేశుడు. గణేశుని నవరాత్రోత్సవాల సందర్భంగా ఆ స్వామివారి దివ్యక్షేత్రాలు, నామరూప విశేషాలను గురించి పఠించడం, శ్రవణం చేయడం, స్మరించడం దివ్య ఫలితాలనిస్తుందనడంలో అతిశయోక్తి లేదు. ప్రపంచ వ్యాప్తంగా కొలువై యున్న గణపతి ఆలయాలలో, ప్రముఖ పుణ్యక్షేత్రాలలో శ్వేతార్క గణపతి దేవాలయ మొకటి ఎంతో ప్రసిద్ధి గాంచిన దేవాలయం. శ్వేతార్క గణపతి గురించి అనేక గ్రంథాలలో వ్రాయబడింది. తంత్ర శాస్త్రంలో ఈ గణపతి గురించి విపులంగా ఉంది. వరంగల్ జిల్లా లోని ఖాజీపేట రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని దేవాలయంలో తెల్లజిల్లేడు వేరు మొదలు నుంచి వినాయక మూర్తి ఆవిర్భవించింది. శ్వేతార్కమనగా తెల్లజిల్లేడు. ఈ జిల్లేడు మూలంలో గణపతి నివసిస్తాడని ప్రతీతి. భూమినుంచి పుట్టిన శ్వేతార్క గణపతి నేత్రాలు నుదురు, అరచేయి, తల్పము అన్నీ స్పష్టంగా కనిపిస్తాయి. ఈ ఆలయంలో ప్రతి మంగళవారం ప్రత్యేక పూజల్ని నిర్వహిస్తారు. హోమాలు నిర్వహిస్తారు. లక్షల సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని సంకల్పసిద్ధి కారకుడుగా కొలుస్తూ ఆరాధిస్తున్నారు. పుష్యమీ నక్షత్రం – ఆరుద్ర నక్షత్రం ఉన్నరోజు శ్వేతార్క గణపతిని పూజిస్తే ధన ధాన్య సౌభాగ్యాలు లభిస్తాయి. ఈ రోజును రవి పుష్య యోగ దినంగా పిలుస్తారు.

ఓం గం గణపతయే నమః అని స్మరిస్తూ గుడి చుట్టూ 108 సార్లు ప్రదక్షిణలు చేస్తే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. ఈ ఆలయంలో ప్రతి మంగళవారం గణేశ హోమం జరుగుతుంది. ఈ హోమం చూడటానికి, తరించటానికి లక్షలాది ప్రజలు తండోప తండాలుగా తరలి వచ్చి, వీక్షించి తన్మయులవుతారు. దారిద్ర్య నివారణకు ఓం నమో విఘ్నహరాయ గం గణపతయే నమః అనే మంత్రాన్ని ప్రతి రోజు ఐదు జపమాలలు పఠిస్తూ ఈ స్వామిని పూజించిన అఖండమైన సుఖసంతోషాలు, ఐశ్వర్యము లభిస్తాయి. గణపతి పూజలో పుష్పాలకంటె పత్రాలకే ప్రాముఖ్యతను ఇస్తాం. గణపతికి గరిక అంటే ఎంతో ఇష్టం. అందువల్లనే దూర్వారయుగ్మం పూజయామి అంటూ 21 సార్లు గరికతో పూజిస్తాము. గరికతో చేసే దూర్వారయుగ్మ పూజ అత్యంత విశిష్టమైంది. ఏకవింశతి పూజలో గరిక ఉన్నా ప్రత్యేకించి స్వామి దశ నామాలతో ప్రత్యేక పూజ చేస్తాము. ప్రకృతిలో గరికకు ఉన్న ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. వంద యజ్ఞాలకు మించిన ఫలాన్ని ఒక్క గరిక పూజ ఇస్తుంది. ఆయనను ప్రసన్నం చేసుకునేందుకు వెండి, బంగారు పుష్పాలక్కరలేదు. నాలుగు రెబ్బల గరిక ఉంటే చాలు ఎంతో ప్రసన్నత నొందుతాడు. వరాలను అనుగ్రహిస్తాడు. గరికకూ, వినాయకునికీ అవినాభావ సంబంధముంది. గరికకు, వినాయకునికి ఇంత గొప్ప అనుబంధం ఏర్పడడానికి గల కారణాలు చెప్పే కథలు అనేకం ప్రచారంలో ఉన్నాయి.

యమధర్మరాజుకు అనలాసురుడు అనే కుమారుడు ఉన్నాడు. అతడు అగ్నిస్వరూపుడు. అతని రాక్షస ప్రవృత్తి మితిమీరి భూలోకాన్ని బుగ్గి చేసి, స్వర్గలోకంపై దండెత్తాడు. దేవేంద్రుడు విషణ్ణ వదనుడై ఆ రాక్షసుని సంహరించి తనను రక్షించమని వినాయకుడిని ప్రార్థించాడు. వినాయకుడు ఆ రాక్షసునితో తలపడి నమిలి మింగేశాడు. అగ్ని గణేశుని గర్భంలో ప్రవేశించి అతనికి అమితమైన తాపం కలిగించింది. ఎన్ని ఔషధాలు వాడినా తాపం

తగ్గలేదు. చివరికి శివుని సలహాపై ఏకవింశతి (21) గరికలను తెచ్చి కప్పాడు. గరిక పోచల స్పర్శతో, వాటిలోని ఔషధ గుణాల వల్ల గణపతి తాపం చల్లారింది. అప్పటినుండి వినాయకుని గరికతో పూజ చేయడం అలవాటుగా, ఆనవాయితీగా మారింది. గణపతికి గరిక ప్రియమైన పూజాద్రవ్యంగా మారింది.

స్వయంభువుగా కొలువై యున్న గణపతి ఆలయాలలో అతి ప్రాచీన దేవాలయం అయిన అయినవిల్లిలోని విఘ్నేశ్వర స్వామి ఆలయం కూడా కాణిపాకం దేవాలయం వలె విఖ్యాతి చెందింది. కోనసీమ జిల్లాలోని అయినవిల్లి గ్రామంలో పవిత్ర గౌతమీనది తీరంలో స్వయంభువుగా దక్షిణాభిముఖుడై వెలసిన విఘ్నేశ్వరుడు భక్తుల పాలిట కొంగు బంగారమై విరాజిల్లుతున్నాడు. ఈ స్వామివారిని, ఈ క్షేత్రాన్ని వేదవ్యాస మహర్షి దర్శించి స్వామివారిని పూజించి అనుగ్రహం పొందినట్లు పురాణోక్తి.

ప్రతి దేవాలయంలో వలె ఈ ఆలయంలో కూడా స్వామివారికి నిత్యోత్సవాలు, పక్షోత్సవాలు, మాసోత్సవాలు ఘనంగా జరుగుతాయి. ప్రతిరోజూ సూర్యోదయ సమయంలో పంచామృతాలతో అభిషేకం, గణపతిహోమం, సామూహిక అభిషేకాలు సాంప్రదాయం ప్రకారం నిర్వహింపబడతాయి. ప్రతిరోజు వందలాదిమంది భక్తులు సామూహిక పూజలలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులవుతారు.

ప్రత్యేక సందర్భాలలోను, సంకష్టహర చతుర్థి వంటి సమయాలలోను వినాయక చవితి వంటి పండుగ సమయాలలో స్వామివారికి ప్రత్యేకంగా పంచామృతాలతో పాటు వివిధ పండ్లరసాలతో రుద్రాభిషేకం అత్యంత వైభవంగా జరుపబడుతుంది. ఇందులో భక్తులు సామూహికంగా పాల్గొని స్వామిని అభిషేకించి తన్మయులవుతారు. గణపతి హోమం, రుద్రాభిషేకం చూచి తరించవలసిందే కానీ, వర్ణించటానికి అలవికాని విధంగా జరుపబడతాయి. రుద్రాభిషేకం భక్తిముక్తి దాయకం. అనంతరం స్వామివారికి ఉండ్రాళ్ళు, కుడుములు, చలిమిడి, పళ్ళు నైవేద్యంగా పెడతారు.

వినాయకునికి బహుళ ప్రచారంలో ఉన్న నామాలలో హేరంబగణపతి, హారిద్రగణపతి, శ్వేతార్కగణపతి ముఖ్యమైనవి. హేరంబమనగా చిత్ర విచిత్రమైన విరుద్ధమైన పనులు చేయించేవాడు హేరంబుడు. అయిదు ఏనుగు ముఖాలతో ఉండి సింహంపై కూర్చునేవాణ్ణి హేరంబుడు అంటారు. ఉత్కృష్టమైన, ఉద్ధామమైన బలం కలవాడని అర్థం. హారిద్రమనగా పసుపు అని అర్థం. పసుపు అంటే వినాయకునికి ఎంతో మక్కువ. మనం వినాయకుని పూజించే సమయంలో కాని, వ్రతాలు నోములలో గాని ముందుగా తమలపాకులో పసుపుతో చేసిన వినాయక ప్రతిమకు బొట్టు పెట్టి, అక్షతలు చల్లి అష్టోత్తర నామాలతో పూజిస్తాం. శ్వేతం అనగా తెలుపు అని, అర్కం అనగా జిల్లేడు, స్ఫటికం అని అర్థం. వినాయకునికి జిల్లేడుపూలు, పత్రాలతో పూజిస్తే ఎంతో మోదం చెందుతాడు.

వివిధ శాస్త్రాలు, పురాణాలు వినాయకుని పార్థివ రూపాన్ని వర్ణించాయి. మట్టితో చేసిన రూపానికే, ఆ బొమ్మలకే (ప్రతిమలకే) ఎక్కువ మహిమ ఉంటుందని పురాణాలు ఘోషిస్తున్నాయి. గణేశ ప్రతిమ నిర్మాణానికి చెరువుల్లోని బంకమట్టి శ్రేష్ఠం. స్వచ్ఛమైన బంకమట్టితో చేసిన ప్రతిమను పూజించడమే ఎంతో శ్రేష్ఠం. మట్టి వినాయకుని వినాయక చవితినాడు పూజించాలని గణేశ పురాణం వివరిస్తోంది. రాళ్ళూ, రప్పలూ లేని బంకమట్టిని నీటితో తడిపి, ముద్దగా చేసి, మర్దించి, సర్వావయవ సంపూర్ణమైన ప్రతిమను తయారు చేసుకుని పూజించాలి. ఆవిధంగా పూజించిన మనసులోని కోరికలు నెరవేరుతాయి. తేజోమూర్తియైన భగవానుణ్ణి అర్చించాలంటే నిర్మలమైన మనస్సు ఉండాలి. చిత్తమెంత ప్రధానమో, మనం దైవాన్ని ఆవాహన చేసే ద్రవ్యమూ అంతే ప్రధానమై ఉండాలి. ఉత్తమమైన ద్రవ్యం లేకపోతే దేవతలు సైతం మన పూజలు అంగీకరించడానికి ఇష్టపడరని పెద్దలు చెబుతారు. బంకమట్టి వంటి ఉత్తమ ద్రవ్యం లోకి ఆవాహన చేసి, ప్రాణప్రతిష్ఠ చేసి పూజిస్తే దైవం సంతుష్టుడై త్వరగా స్పందిస్తాడు. వరాలను అనుగ్రహిస్తాడు.

భాద్రపద శుద్ధ చవితిని వినాయక చవితిగా గుర్తించి, జన్మదినంగా గుర్తించి ఏకవింశతి (21) పత్రాలతో, 21 రకాల పండ్లతోను, గరికతోను పూజిస్తున్నాము. గణపతి అర్చనకు తులసి పనికిరాదని కొందరు చెబుతుండగా మరికొందరు తులసిదళాలతో పూజించవచ్చునని పెద్దల ఉవాచ. ముద్గల పురాణాన్ని అనుసరించి ఒక ప్రత్యేక కారణంగా తులసి తన అర్చనకు పనికిరాదని గణేశుడు శాపమివ్వగా తులసి పశ్చాత్తప్తురాలై గణపతి అనుగ్రహం కోసం తపమాచరించి వరాన్ని పొందింది. తులసి కఠోర తపస్సునకు మెచ్చి ఎన్నో వరాలనిస్తూ వినాయక చవితినాడు నీ దళాలతో పూజించవచ్చని నాకు సమర్పించే 21 పత్రాలలోకెల్లా తులసి పత్రమే అత్యంత గొప్పదిగా తాను స్వీకరిస్తానని, ఆనాడు తులసిని సమర్పించకుండా పూజిస్తే ఆ ఉల్లంఘన దోషానికి వారు పాపులుగానే పరిగణింపబడతారని వరమిచ్చి సంతోషపరచాడని ఈ క్రింది శ్లోకం ద్వారా అవగతమవుతోంది.

**భాద్రపద శుక్ల చతుర్థ్యాం యే మహోత్సవ పరాయణాః**
**పూజయిష్యంతి మాం భక్త్యా తత్రత్వం ధారయామ్యహం**
**ఏకవింశతి పత్రాణి హ్యర్చయిష్యంతి మానవాః**
**తత్ర తే పత్ర మేకం మే మాన్యం దేవి భవిష్యతి**
**ఉల్లంఘన సమం పాపం న భూతం న భవిష్యతి**

పై వృత్తాంత మాధారంగా వినాయక చవితినాడు తప్పకుండా తులసిని సమర్పించాలని తెలియుచున్నది.

★★★

# తిరుమల సర్వస్వం

– పల్లపోతు వాణిశ్రీ



**గత సంచిక తరువాయి**

## పుష్పమండపం

తిరుమల క్షేత్రం పుష్పమండపంగా పేరు గాంచినదని, శ్రీవేంకటేశ్వరుడు పుష్పప్రియుడు, అలంకారప్రియుడు అని ఇంతకుముందు పెక్కు సందర్భాల్లో మనం తెలుసుకున్నాం.

తిరుమల క్షేత్రమంతటా ఎల్లవేళలా పరిమళభరిత పుష్పాలతో కూడిన ఉద్యానవనాలతోనూ, విశేష సందర్భాలలో కళ్ళు చెదిరే పుష్పాలంకరణ తోనూ నయనానందకరంగానూ భాసిస్తుంది. అలాగే, శ్రీవారు ఆసాంతం పలు రకాల పూలమాలలు ధరించి ముగ్ధమనోహరంగా దర్శనమిస్తారు. స్వామివారు అలంకరించుకునే ప్రతి పుష్పమాలకు ఒక నిర్దిష్టమైన పేరు ఉన్నట్లు కూడా ఇంతకుముందే తెలుసుకున్నాం. బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చే శ్రవణా నక్షత్రం నాడు టన్నుల కొద్దీ పుష్పాలతో శ్రీవారికి చేసే 'పుష్పయాగపు శోభ' చూసి తీరవలసిందే కానీ, చెప్పనలవి కాదు.

## పుష్ప కైంకర్యం

తిరుమలేశునికి జరిగే అనేక కైంకర్యాలలో పుష్పకైంకర్యం ప్రముఖమైనది. తిరుమల శ్రీనివాసుని పుష్పకైంకర్యంతో తరించిన భక్తులెందరో ఉండగా, ఆ సాంప్రదాయానికి ఆద్యుడిగా 'తిరుమలనంబి'ని పేర్కొనవచ్చు. వారు శ్రీవారికి ప్రతినిత్యము పుష్పకైంకర్యం సమర్పించుకోవడం కోసం, దానికి అవసరమైన ఉద్యానవనం పెంచే నిమిత్తం దాదాపు వెయ్యేళ్ళ క్రితం దుర్గమంగా, నిర్జనారణ్యంగా ఉండే కొండపై నివసిస్తూ, తిరుమల క్షేత్రంలో స్థిర నివాసమేర్పరచుకున్న మొట్ట మొదటి వ్యక్తిగా ప్రసిద్ధి కెక్కారు. తరువాత తిరుమలనంబికి శిష్యరికం జరిపిన శ్రీవారి మరో భక్తుడు అనంతాళ్వార్, కొండపై శ్రీవారి పుష్ప కైంకర్యానికి కావలసిన పుష్పాలను పెంచడం కోసం ఉద్యానవనాన్ని ఏర్పాటు చేసే నిమిత్తం నిండు చూలాలిగా ఉన్న తన భార్యతో కలిసి ఏకంగా ఒక పెద్ద చెరువునే త్రవ్వాడు. వారు పెంచిన సప్తవర్ణ శోభితమైన సుమాలను ప్రత్యక్షంగా తిలకించడం కోసం శ్రీవేంకటేశ్వరుడు ప్రతి రాత్రి పద్మావతి అమ్మవారితో పాటుగా ఆ తోటలో విహరించేవారు. మరో భక్తురాలైన తరిగొండ వెంగమాంబ శ్రీవారికి నిత్యము తులసిమాలలతో కైంకర్యం చేయడం కోసం ఒక ప్రత్యేక తులసి తోటను పెంచింది. ఇలా శ్రీవారి భక్తాగ్రేసరులెందరో పుష్పవనాలు పెంచడం ద్వారా, పుష్పకైంకర్యం చేయడం ద్వారా శ్రీనివాసునితో ఆత్మీయ అనుబంధాన్ని పెంపొందించుకున్నారు. వారందరినీ శ్రీవారు పలు రకాలుగా అనుగ్రహించి ధన్యులను గావించినట్లు ఇంతకుముందు తెలుసుకున్నాం. శ్రీవారి పుష్పప్రియత్వాన్ని చాటి చెప్పడానికి ఇంతకన్నా చక్కనైన దృష్టాంతాలు ఇంకేముంటాయి? అదే ఒరవడిని కొనసాగిస్తూ తి.తి.దే యాజమాన్యం కూడా ఎప్పటినుండో ఉద్యానవనాల పెంపకంపై విశేషంగా దృష్టి సారిస్తోంది.

## తిరుమలలో ఉద్యానవన చరిత్ర

దేవాలయాల అజమాయిషీ తి.తి.దే చేతికి వచ్చిన తరువాత, ఆంధ్రా ప్రాంతం అవిభక్త మద్రాసు రాష్ట్రంలో కలిసి ఉన్నప్పుడు తిరుమలలో ఉద్యానవనాలను సంరక్షించే బాధ్యతను అప్పటి ఆలయ పేష్కార్ చూసేవారు. ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన తరువాత,

1959వ సంవత్సరం వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు ఉద్యానవన శాఖ విధులను నిర్వర్తించేవారు. తదనంతరం 1961వ సంవత్సరంలో మైసూరు ఉద్యానవన విభాగం నుంచి, ఉద్యానవన నిర్వహణలో అప్పటికే మంచిపేరు తెచ్చుకున్న 'తమ్మన్న' అనే అధికారిని తాత్కాలిక బదిలీపై తిరుమలకు రప్పించుకుని, వారికి పూదోటల పెంపకం బాధ్యత అప్పగించడం జరిగింది. ఈ రంగంలో విశిష్టమైన సేవలు చేసిన తమ్మన్న గారు పదవీ విరమణ అనంతరం కూడా, తితిదేకు ఉద్యానవన సలహాదారుగా సేవలందించారు. అనుభవజ్ఞుడైన అధికారి సలహాలు, సూచనలు, విశేష కృషి వల్ల తిరుమలలో పూలతోటల పెంపకం మూడు పువ్వులు – ఆరు కాయలుగా వికసించింది. ఆ రోజుల్లో జాతీయస్థాయిలో జరిగిన అనేక పుష్పప్రదర్శనలలో తితిదే ఉద్యానవన శాఖ అనేక బహుమతులను, ప్రముఖుల ప్రశంసలను గెలుచుకుంది. 1961వ సంవత్సరంలో కేవలం 15 మంది సిబ్బందితో ప్రారంభమైన ఉద్యానవన శాఖలో, ప్రస్తుతం వందలమంది చేయి తిరిగిన కార్మికులు పని చేస్తున్నారు.

## చిరంజీవులైన జాతీయ నాయకులు

వైజ్ఞానిక ప్రక్రియల ద్వారా కొత్తరకాల వృక్షజాతులను రూపొందించటం ఈ శాఖకు మరింత గుర్తింపు తెచ్చింది. జాతీయ నాయకుల మరపురాని సేవలను తలపుకు తెచ్చే విధంగా కొత్తగా సృష్టించిన వృక్ష జాతులకు వారి పేర్లు పెట్టింది. ఉదాహరణకు రామానుజన్, తిరుమలనంబి, డాక్టర్ ఎన్టీ రామారావు, శారదా ముఖర్జీ, శంకర్ దయాళ్ శర్మ లాంటి ఎందరో చిరస్మరణీయులు తిరుమలలో కొత్తగా సృష్టించబడ్డ మొక్కల రూపంలో చిరంజీవులయ్యారు.

## పుష్పాలంకరణ

ఉద్యానవనాల పెంపకంలోనే కాకుండా పుష్పాలంకరణలో కూడా తితిదే ఉద్యానవన శాఖ ఎంతో నైపుణ్యం సంపాదించింది. అలంకరణ అంటే కేవలం మాలలు కట్టడం, దండలు చుట్టడమే కాదు; ఒక చేయి తిరిగిన చిత్రకారుడు తన కుంచెకు రంగులద్ది కాన్వాస్ పై జీవకళ ఉట్టిపడే చిత్రాన్ని సృష్టించినట్లు రంగురంగుల పూలను ఒద్దికగా అమర్చి, ఎప్పటికప్పుడు సరికొత్త పుష్పకళాకృతులకు తితిదే ఉద్యానవన శిల్పులు రూపకల్పన చేస్తారు. ఉత్సవ సమయాల్లో పుష్పాలతో స్వాగత తోరణాలు నిర్మించటం, స్వాగత వచనాలు వ్రాయడం, వివిధ దేవతామూర్తుల పౌరాణిక ఘట్టాలను రంగు రంగుల పూల అమరికతో సృష్టించడం లాంటివన్నీ తితిదే ఉద్యానవన శాఖకు కరతలామలకం. బ్రహ్మోత్సవాల సమయంలో, తిరుమలలో ఉన్న విద్యుత్ శాఖ, ఉద్యానవన శాఖ వీరిద్దరూ ఒకరితో ఒకరు పోటీపడి, సృజనాత్మకతను రంగరించి, ఉత్సవాలకు మరింత శోభ చేకూర్చుతారు.

## అలంకరణే కాదు – ఆరోగ్యం కూడా!

ఉద్యానవన శాఖ వివిధ రకాల మొక్కలను కూడా పెంచుతోంది. శేషాచల శ్రేణుల్లో ఉండే విలక్షణమైన ప్రాకృతిక స్వభావం వల్ల, ప్రపంచంలో మరెక్కడా లేని అత్యంత అరుదైన వృక్షజాతు లెన్నింటినో తిరుమల కొండపై చూడవచ్చు. వేంకటాచలానికి పరిమితమైన ఎర్రకొవ్వి, రత్నపురుష, చిత్రమూలం, సారిందీ, ఈశ్వర, పల్లేరు, ఏనుగు పల్లేరు, సహదేవి, నేలగల్లిజేరు, గొబ్బి, రణభేరి, దేవదారి, కుక్కతులసి, పేలకాయలు, కుక్కనాలుక, బడిత వంటి విలక్షణమైన, ఔషధ విలువలు గలిగిన ఎన్నో వృక్షజాతులకు తిరుమల క్షేత్రం ఆలవాలం. వీటన్నింటినీ నిపుణులైన వృక్షశాస్త్రజ్ఞుల సాయంతో శ్రద్ధగా, వాటి స్వాభావిక పరిస్థితులలో సంరక్షిస్తూ; ఆయా వృక్షజాతులు అంతరించి పోకుండా తితిదే శ్రద్ధ వహిస్తోంది.

## పుష్పదాతలకూ కొదవేం లేదు

శ్రీవారి పుష్పకైంకర్యం చేసేందుకు ఇప్పుడు కూడా ఎందరెందరో దాతలు ముందుకు వస్తున్నారు. ఆ పుష్పప్రియుడి సేవలకు అవసరమయ్యే మొత్తం పుష్పాల్లో 60 శాతం దాతలే విరాళాల రూపంలో సమకూర్చుతున్నారు. 30 శాతం పుష్పాలను సొంతంగా సాగుచేసే ఉద్యానవనాల ద్వారా, మిగిలిన 10 శాతం పూలను కొనుగోళ్ళ ద్వారా తితిదే భర్తీ చేసుకుంటుంది. బ్రహ్మోత్సవాలలో, వైకుంఠ ఏకాదశి పర్వదినం నాడు, పుష్పయాగం జరిగే రోజున పూల విరాళాలకై దాతలు పోటీ పడతారు. ఆ సందర్భాలలో దాదాపుగా భూమండలంపై లభించే పుష్పజాతులన్నింటినీ తిరుమల కొండపై చూడవచ్చంటే అతిశయోక్తి కాదు. దేశంలోని కేరళ, అస్సామ్, హిమాచల్ ప్రదేశ్ లాంటి సుదూర ప్రాంతాల నుండే కాకుండా, ఆస్ట్రేలియా, న్యూజీలాండ్, యూరప్ వంటి ఖండాంతర దేశాల నుండి కూడా దిగుమతి చేసుకోబడ్డ పూలు శ్రీవారి సేవలో తరించుకుంటాయి. ఆ పర్వదినాల్లో తిరుమల పట్టణమంతా ముఖ్యంగా శ్రీవారి ఆలయం ప్రత్యేక పుష్పాలంకరణతో పుష్పమయంగా గోచరిస్తుంది.

## పూదోటలకు భక్తుల పేర్లు

వందల ఏళ్ళ క్రితం శ్రీవారికి పుష్పకైంకర్యం చేసిన భక్తుల పేర్లతో కూడా తితిదే ఉద్యానవనశాఖ అనేక పూలతోటలను పెంచుతోంది. సూరాపురం వారి తోట, పేరిందేవి తోట, హాథీరామ్ జీ తోట – ఇలా తిరుమలలో ఎన్నో ప్రాంతాలు, కూడళ్ళు ఆయా పూలతోటల పేర్లతోనే పిలువబడుతున్నాయి. తిరుమలలో పెంచబడుతున్న అనేకానేక ఉద్యానవనాల్లో నారాయణగిరి



ఉద్యానవనం అత్యంత సుందరంగా తీర్చిదిద్దబడింది. గోగర్భం ఆనకట్ట ప్రాంతంలోనూ, పద్మావతి వసతి గృహంలోనూ ఉన్న పూదోటలు కూడా అత్యంత ఆకర్షణీయంగా మలచబడ్డాయి. ఇప్పుడు వైకుంఠం క్యూ సముదాయం ఉన్న ప్రాంతం కూడా ఒకప్పుడు ఉద్యానవనమే. అప్పుడది చేమకూర తోటగా ఉండేది.

## ఫల, పుష్ప ప్రదర్శన

తితిదే ఉద్యానవన విభాగం శ్రీవారికి తిరుమలలోని ఇతర ఆలయాలకు కావలసిన పుష్పాలను సరఫరా చేయడంతో పాటుగా, తిరుమలకు విచ్చేసిన భక్తులకు ఆహ్లాదాన్ని కూడా అందిస్తోంది. ప్రతి ఉద్యానవనమూ ఒక నందనవనమే. ఆయా ఉద్యానవనాలను ప్రతి ఒక్కరూ తనివితీరా చూసి ఆనందించవచ్చు. ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాల సందర్భంగా పాపనాశనం మార్గంలో ఉన్న కళ్యాణవేదిక వద్ద తితిదే వారి ఆధ్వర్యంలో 'ఫల – పుష్ప ప్రదర్శన' ఏర్పాటు చేయబడుతుంది. దేశ, విదేశాల నుండి తెప్పించిన అరుదైన పుష్పజాతులను ఇక్కడ ప్రదర్శిస్తారు. ఏదో ఒక పౌరాణిక ఘట్టాన్ని ఇతివృత్తంగా తీసుకుని, పువ్వులను సృజనాత్మకత ఉట్టిపడేలా అమర్చి ఆ ఘట్టాన్ని సజీవంగా ఆవిష్కరిస్తారు. క్రితం బ్రహ్మోత్సవాల్లో నీలాదేవి, శ్రీవేంకటేశ్వరుడి నుదుటికి తన కేశాలను అతికిస్తున్న దృశ్యం సాకారం చేయబడింది. ఇంతేకాకుండా తండ్రి జమదగ్ని ఆదేశం మేరకు క్షత్రియ సంహారం కావిస్తున్న పరశురాముడు, యాచకుని రూపంలో సీతమ్మను అపహరించి వెడలుతున్న రావణుణ్ణి అడ్డగిస్తున్న జటాయువు, అశోకవనంలో శోకతప్తయై ఉన్న సీతమ్మకు నమస్కరించుకుంటున్న ఆంజనేయుడు, బకాసురునితో తలపడుతున్న భీమసేనుడు, చెట్టుచాటు నుంచి వాలిపై బాణప్రహారం చేస్తున్న శ్రీరాముడు వంటి పదునాలుగు పౌరాణిక పాత్రలకు కూడా జీవం పోశారు. పశ్చిమ బెంగాల్ నుండి వచ్చిన ఇరవైమంది కళాకారుల ద్వారా సృష్టించబడ్డ అత్తి వరదరాజస్వామి ఆలయం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

గత కొద్ది సంవత్సరాల నుండి మైసూరుకు చెందిన గౌరి, నీలాంబిక అనే ఇద్దరు అక్కచెల్లెళ్ళు సైకత శిల్పాన్ని అత్యంత సృజనాత్మకంగా తీర్చిదిద్దుతున్నారు. క్రితంసారి బ్రహ్మోత్సవాలలో వీరిరువురూ రెండు రోజులు శ్రమించి మూడు టన్నుల ఇసుక, అనేక రంగుల నుపయోగించి 'గరుత్మంతునిపై విహరిస్తున్న శ్రీమహావిష్ణువు' యొక్క సైకతశిల్పాన్ని సాక్షాత్కరింపచేసి భక్తుల మనసును దోచుకున్నారు.

## కొండపై పూలు ధరించరాదు...

'పుష్పమండపం'గా వ్యవహరించబడే తిరుమల క్షేత్రంలో, పువ్వులన్నీ స్వామివారికే చెందాలి. అందుచేత భక్తులెవ్వరూ కొండపై పూలు ధరించరాదు. కొండపై జరిగే వివాహాలలో కూడా పువ్వులతో చేసిన మాలలు వాడటం పూర్తిగా నిషిద్ధం.

శ్రీవారికి కైంకర్యం చేయబడ్డ పువ్వుల నైర్మల్యాన్ని భక్తులకు ప్రసాదంగా ఇచ్చే సాంప్రదాయం కూడా తిరుమలలో లేదు. వెయ్యేళ్ళ క్రితం రామానుజుల వారు చేసిన కట్టడి ననుసరించి,

పూజా నైర్మల్యాన్ని ఈమధ్య కాలం వరకు సంపంగి ప్రదక్షిణ మార్గంలో ఉత్తరదిశలో ఉన్న, నేడు 'పూలబావి'గా పిలువబడే సాక్షాత్తు భూదేవిచే నిర్మించబడ్డ భూతీర్థంలో విసర్జించేవారు. అయితే ఎప్పటికప్పుడు పెరుగుతున్న భక్తులు, ఉత్సవాల కారణంగా పూజా నైర్మల్యాలు కూడా అధికమవ్వడంతో ఇప్పుడు వాటిని తిరుమల సానువుల్లో, ఎవరూ తొక్కేందుకు అవకాశం లేని నిర్జన ప్రాంతంలో వదులుతున్నారు. సంవత్సరంలో ఒకసారి తిరుచానూరులో జరిగే కార్తీక బ్రహ్మోత్సవాల చివరి రోజున మాత్రం శ్రీవారి పూజానైర్మల్యాలను పద్మావతీ అమ్మవారికి కానుకగా సకల లాంఛనాలతో పంపుతారు.

## పద్మావతీ ఉద్యానవనం

పద్మావతీ అమ్మవారి ఆలయం మాడవీధిని ఆనుకుని 'పద్మావతీ ఉద్యానవనం' ఉంది. ఇందులో కూడా కనులకు ఇంపుగా ఉండే మందార, చేమంతి, బంతి, సన్నజాజులు, కాగడామల్లెలు వంటి రకరకాల పూలమొక్కలు, కొన్ని అరుదైన వృక్షజాతులు పెంచబడుతున్నాయి. సువిశాలప్రాంగణంలో ఉండే ఈ ఉద్యానవనంలో చూడచక్కనైన కోనేరును కూడా చూడవచ్చు. ఈమధ్యనే ఎలక్ట్రానిక్ మాధ్యమం ద్వారా ఒక వినూత్నమైన ప్రదర్శనకు తితిదే శ్రీకారం చుట్టింది. ఉద్యానవనంలోని కుడ్యాలపై పద్మావతీ పరిణయంలోని విశేషాలన్నిటినీ వేరు వేరుగా క్యూ ఆర్ సంకేతంతో సహా చిత్రీకరించారు. 'పద్మావతీ పరిణయం' యాప్ ను మన చరవాణిలో డౌన్లోడ్ చేసుకుని శబ్దగ్రహణ యంత్రాలను (ఇయర్ ఫోన్స్) మన చెవులకు అనుసంధానించుకుని ఆయా చిత్రాలపై ఉన్న క్యూఆర్ సంకేతాన్ని చరవాణి ద్వారా స్కాన్ చేస్తే, ఆ చిత్రంలో ఉన్న లఘు చలనచిత్రాన్ని దృశ్య శ్రవణ మాధ్యమాల ద్వారా చూడవచ్చు. అత్యద్భుతమైన, వినూత్నమైన ఈ ప్రయోగానికి భక్తుల నుండి ఎంతగానో ఆదరణ లభిస్తోంది.

పుష్పాలకు అధిదేవత అయిన 'పుల్లుని' ఆశీస్సులతో, శ్రీవేంకటేశ్వరుని కృపాకటాక్షాలతో, తితిదే ఉద్యానవనశాఖ మరింతగా రాణించి, ప్రపంచ ఉద్యానవన రంగంలోనే అగ్రగామిగా వెలుగొందాలని ఆ దేవదేవుణ్ణి వేడుకుందాం.

## శ్రీవేంకటేశ్వర వస్తుప్రదర్శనశాల (మ్యూజియం)

వందల ఏళ్ళ నుండి శ్రీవారి భక్తులైన ఎందరో చక్రవర్తులు, మహారాజులు, జమీందార్లు మున్నగువారు శ్రీవేంకటేశ్వరునికి బంగారు ఆభరణాలు, వజ్రవైఢూర్యాలు, వెండిపాత్రలు, గృహాలంకరణ సామగ్రి, రత్నఖచితమైన ఆయుధాలు, ఇలాంటివెన్నో భక్తిపూర్వకంగా సమర్పించుకున్నారు. శ్రీవారి పట్ల వారికున్న అచంచల భక్తి, వారి రాచరికపు వైభవం, ఆనాటి కళాకారుల సృజనాత్మకత, ఈ మూడింటి మేళవింపైన ఈ వస్తువిశేషాలన్నీ ఆయా కాలాలలో ఉన్న రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, ఆధ్యాత్మిక స్థితిగతులకు నిలువుటద్దాలు, పల్లవులు, చోళసామ్రాట్టులు, విజయనగర రాజులు, మట్లకుమారులు ఇలా ఎందరెందరో శ్రీవారికి సమర్పించుకున్న కానుకలను ఎప్పటికప్పుడు ఆలయ కోశాధికారి నమోదు చేసుకుని, ఆ వస్తువులన్నింటికీ గుర్తింపు సంఖ్యనిచ్చి, వాటిపై దాతల వివరాలను చెక్కించి, కానుకలు మరీ విలువైనవైతే వాటి వివరాలను ఆలయం కుడ్యాలపై శిలాఫలకాల రూపంలో మలచి, వాటి విలువ పరిమాణాన్ని బట్టి, వేర్వేరు ప్రదేశాల్లో కట్టుదిట్టమైన రక్షణ ఏర్పాట్లతో భద్రపరిచేవారు. అవన్నీ క్రమంగా ఈనాటి శ్రీవేంకటేశ్వర పురావస్తు ప్రదర్శనశాల (మ్యూజియం)కు భద్రంగా అంచెలంచెలుగా చేరుకున్నాయి.

## ఎప్పుడు? ఎక్కడ?? ఎలా???

1939వ సంవత్సరంలో ప్రాచ్య సాహిత్యం మరియు కళలపై పరిశోధన, అధ్యయనం జరపటం కోసం తితిదే ఆధ్వర్యంలో, తిరుపతి – చంద్రగిరి రహదారిలో ప్రాచ్యకళాశాల ప్రారంభించబడింది. ఆ కళాశాల ఆవరణలోనే ఉన్న ఒక హాలులో, కళాశాల సిబ్బంది స్వచ్ఛంద సహకారంతో చిన్నపాటి మ్యూజియం ఏర్పాటు చేయబడింది. ఈ వస్తు సంపదనంతా తిరుమల నుంచి తరలించి ఆ మ్యూజియంలో భద్రపరిచారు. ప్రాచ్యకళాశాలలో పనిచేసిన ఎందరో మహామహులు కూడా ప్రాచీన కళాఖండాలను సేకరించేందుకు, వాటి చరిత్రను శోధించి ఇతివృత్తాల వారీగా అమర్చేందుకు ఎంతగానో తోడ్పడ్డారు. వారిలో ముఖ్యులు పురాతత్వ శాస్త్రవేత్తగా సేవలందించిన సాధు సుబ్రహ్మణ్య శాస్త్రి గారు, వేటూరి ప్రభాకర శాస్త్రి గారు మున్నగువారు అయితే ఆ మ్యూజియం తిరుమల – తిరుపతి పట్టణాలకు దూరంగా ఉండటం, అప్పట్లో ప్రజారవాణా సౌకర్యాలు లేకపోవటం వంటి కారణాల వల్ల సందర్శకుల సంఖ్య అంతంత మాత్రంగానే ఉండేది.

అలా ఆ మ్యూజియం అరకొర ప్రేక్షకులతోనే కొన్ని దశాబ్దాల కాలం నడిచిన తర్వాత, ఆ అమూల్యమైన చారిత్రక సంపదను జనబాహుళ్యం లోకి తీసుకురావడం కోసం 1980వ సంవత్సరంలో అప్పటి కార్యనిర్వహణాధికారి గారి చొరవ మరియు ప్రముఖ చరిత్రకారుడు జయచంద్ర గారి సహకారంతో ఆ వస్తుసంపదనంతా ఆలయానికి ఎదురుగా ఉన్న 'వెయ్యికాళ్ళ మండపం'లోకి మార్చి, దానికి 'శ్రీవేంకటేశ్వర వస్తుసంగ్రహాలయం'గా నామకరణం చేశారు. ఆ మండపంలో దక్షిణదిక్కున వస్తువులన్నింటినీ అందంగా అమర్చి, తగిన సిబ్బందిని నియమించారు. దాంతో సందర్శకుల సంఖ్య విపరీతంగా పెరిగింది. మరోప్రక్క తిరుమలలో అప్పుడు చేపడుతున్న పాలనా సంస్కరణలలో భాగంగా,

అప్పటివరకు ఆదరణకు నోచుకోకుండా కొండపై ఎక్కడెక్కడో పడివున్న కళాఖండాలన్నింటినీ ఒక్కచోటుకు చేర్చే ప్రక్రియ కూడా వేగవంతమవ్వడం వల్ల, ప్రదర్శించబడే వస్తువుల సంఖ్య దాదాపుగా రెండింతలయింది. ఈ రెండు కారణాల వల్లా విపరీతమైన స్థలాభావం ఏర్పడింది. వేలాదిగా తరలి వస్తున్న భక్తుల ఉత్సాహాన్ని, కళాఖండాలను అర్థవంతంగా అమర్చడంలో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ఆలయానికి సమీపంలో ఒక పెద్ద భవనాన్ని నిర్మించి, దానిలో ఈ కళాకృతులన్నింటినీ ప్రదర్శించాలని అప్పటి తితిదే పాలకవర్గం నిర్ణయించింది.

## సర్వాంగసుందరంగా రూపుదిద్దుకున్న నూతన వస్తుప్రదర్శనశాల భవనం

ఈ నేపథ్యంలో అన్ని హంగులతో కూడుకున్న లక్షా ఇరవై అయిదువేల చదరపు అడుగుల విస్తీర్ణంలో, వైకుంఠం–2 క్యూ సముదాయానికి ఎదురుగా, శిలా తోరణానికి వెళ్ళే దారిలో, గొప్ప రాజప్రాసాదం లాంటి భవనాన్ని నిర్మించారు. అప్పటివరకు వెయ్యి కాళ్ళ మంటపంలో ప్రదర్శింపబడుతున్న వస్తు సామగ్రినంతా ఈ భవనంలోకి తరలించి, విభాగాలవారీగా అమర్చి, ప్రతి వస్తువు వద్ద దాని చరిత్రను వివరంగా మరియు ఆసక్తికరంగా సూచించి, సుశిక్షితులైన సిబ్బందిని నియమించారు. 1997వ సంవత్సరంలో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించబడడంతో ఈ సంగ్రహాలయానికి ఎంతో ప్రాచుర్యం వచ్చింది. దానికి తోడు భక్తులందరికీ తగిన వసతులతో పాటుగా, ఉచిత ప్రవేశం కూడా కల్పించడంతో, ప్రేక్షకుల సంఖ్య ఇబ్బడి ముబ్బడిగా పెరిగి రోజువారీ సందర్శకుల సంఖ్యలో భారతదేశంలోనే ప్రథమ స్థానాన్ని సంపాదించుకుంది. కాలక్రమంలో ఎప్పటికప్పుడు సంగ్రహాలయానికీ, అందులో ప్రదర్శింపబడుతున్న వస్తుసంపదకు కొత్త సొబగులు చేకూర్చడం వల్ల ఈ మ్యూజియం తిరుమల చరిత్రనే కాకుండా, దక్షిణాది పాలకులందరూ శ్రీవారి భక్తులే కావడం వల్ల దాదాపు రెండువేల సంవత్సరాల యావత్ దక్షిణభారత చరిత్రను ప్రతిబింబించే గొప్ప వారసత్వ భాండాగారంగా రూపు దిద్దుకుని, తిరుమల సిగలో కలికితురాయిలా భాసిస్తోంది.

**ఈ సంగ్రహాలయంలో ప్రదర్శింపబడుతున్న వస్తు విశేషాలన్నింటిని ఇప్పుడు సంక్షిప్తంగా తెలుసుకుందాం.**

* దేశవిదేశాల నాణాలు ఒకటవ శతాబ్దానికి చెందిన రోమన్ సామ్రాజ్యపు బంగారు నాణాల నుంచి, 19వ శతాబ్దంలో బ్రిటిష్ వారు ముద్రించిన రాగి నాణాల వరకు, కొన్ని వందల అపురూపమైన నాణాలను ఇందులో చూడవచ్చు. ప్రతి నాణెం ఒక మరుగున పడిన చరిత్రను వెలికి తెస్తుంది. ఆలయంలో భద్రపరచబడిన నాణాలలో ముఖ్యమైనవి – ఒకటవ శతాబ్దానికి చెందిన రోమన్ సామ్రాజ్యపు బంగారు నాణాలు, హోయసల సామ్రాజ్యానికి చెందిన నాణాలు, పశ్చిమ గంగచోళుల నాణాలు, మైసూరు రాజులు ముద్రించిన నాణాలు, రామటెంకి నాణాలు, మైసూరుకి చెందిన హైదర్ ఆలీ కాలపు నాణాలు, పోర్చుగీసు సామ్రాజ్యం మరియు స్పెయిన్ రాజ్యపు వెనీషియన్ నాణాలు, జర్మన్ నాణాలు – ముఖ్యమైనవి. శ్రీవారికి సమర్పించబడ్డ కానుకలలో ఐరోపా దేశాల నాణాలు ఉండటం వల్ల శ్రీవారికి ఆరోజుల్లో కూడా అన్యమత భక్తులు అధిక సంఖ్యలో ఉండేవారని, శ్రీవారి ప్రాపకం భారతీయులకే పరిమితమవ్వలేదని తేటతెల్లమవుతుంది. ఆ కాలంలో అన్య మతస్థులకు ఆలయ ప్రవేశం నిషిద్ధమైనప్పటికీ, కొంతమంది యూరోపియన్ ఉన్నతాధికారులకు మినహాయింపు ఉండేది.
* ఈ నాణాలన్నింటినీ కాలక్రమానుసారం పేర్చుకుంటూ పోతే ప్రపంచ చరిత్ర కళ్ళకు కట్టినట్లు ఆవిష్కృతమవుతుంది.
* ఆయుధాల విభాగంలో ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక వలస రాజుల పరిపాలన కాలంలో అప్పటి పాలకులు, సైన్యం ఉపయోగించిన చురకత్తులు, పిడికత్తులు, బాకులు, ఖడ్గాలు, ఒరలు, కవచాలు, శిరస్త్రాణాలు, యుద్ధ గొడ్డళ్ళు, తుపాకులు, గావంచాలు, బళ్ళాలు మొదలగు వాటిని చూడవచ్చు. ఎందరెందరో శత్రురాజులను హతమార్చగల ఆ మారణాయుధాలు అంతిమంగా శ్రీవారి శరణు జొచ్చాయి. శరణాగత వత్సలుడైన శ్రీనివాసుడు వాటిని మన్నించి అక్కున చేర్చుకున్నాడు. శరణన్న వారిని అనుగ్రహించడం శ్రీనివాసునికి పరిపాటే.
* రాతి శిల్పాల గ్యాలరీ యందు 18, 19 శతాబ్దాల్లో తిరుమల, తిరుపతి పరిసర ప్రాంతాల్లో పురావస్తుశాఖ వారి త్రవ్వకాల్లో బయటపడ్డ రాతిప్రతిమలు, శిల్పాలు, కుడ్యశిల్పాలు, శిలాస్తంభాలు, శిథిలమైన గోపురాలు, ఇలాంటివెన్నో ప్రదర్శింపబడుతున్నాయి. ఆ శిథిలాలలో బయటపడ్డ శిలాశాసనాల ద్వారా అత్యంత అమూల్యమైన చారిత్రక సమాచారం వెలుగు చూసింది.
* వాద్యపరికరాల విభాగంలో ఈనాడు అంతగా వాడుకలో లేని సంగీత పరికరాలు ఎన్నో చూపరులను ఆకట్టుకుంటాయి. తమ గానమాధుర్యంతో శ్రీవారిని తనివితీరా సేవించుకున్న ఎందరో వాగ్గేయకారులను స్మరణకు తెచ్చే విధంగా వీణ, డోలు, తంబుర, సన్నాయి, తబలా వంటి ఎన్నో వాద్య పరికరాలు ప్రదర్శింపబడుతున్నాయి. వీటిని వీక్షిస్తుంటే అన్నమయ్య, పురందరదాసు వంటి గానగంధర్వులు అప్రయత్నంగానే మదిలో మెదులుతారు.
* స్వామివారు అలంకార ప్రియులన్న సత్యాన్ని ఎరిగిన ఎందరో భక్తశిఖామణులు, శ్రీవారికి దుస్తులు, పాదుకల వంటి ఎన్నో

అపురూపమైన అలంకరణ వస్తువులను బహూకరించారు. వాటితో పాటుగా వివిధ రకాల పూజాసామగ్రి, ఆలయంలో ఎప్పటినుంచో వాడిన పాత్రలు, మైసూరు మహారాజు సమర్పించుకున్న గంగాళం, విజయనగర రాజుల చిహ్నమైన 'యాలి' అనే కాల్పనిక జంతువు యొక్క లోహమూర్తి, నంది, నటరాజస్వామి, వినాయకుడి విగ్రహాలు, పెద్ద పెద్ద ఇనుప గంటలు, పంచముఖతాళం, శ్రీకృష్ణదేవరాయలు తిరుమలలోని ఒక పూజారికి బహూకరించిన ధూపగంట, మొదలగు వాటిని కూడా ఒక గ్యాలరీలో భద్రపరిచారు. ఇందులోనే విజయనగర సామ్రాజ్య పతనానంతరం తిరుమల – తిరుపతి ఆలయాలను పోషించిన మట్లరాజుల చిహ్నంగా మిగిలిన దారు మండపాన్ని కూడా ప్రదర్శిస్తున్నారు. ఈ మండపం ఒకప్పుడు అలిపిరి మార్గ ప్రారంభంలో ఉండేది.

* ఈ సంగ్రహాలయంలోని మరో విశిష్టమైన సేకరణ 8వ శతాబ్దానికి చెందిన శ్రీనివాస శిల్పం. ఈ శిల్పం ముమ్మూర్తులా ఆనందనిలయంలో స్వామివారి మూలమూర్తిని పోలి ఉంటుంది. సమయాభావం వల్ల స్వామివారిని ఆసాంతం చూడలేకపోయిన లోటును, నూటికి నూరుపాళ్ళూ మూలవిరాట్ ను పోలి ఉన్న ఈ విగ్రహాన్ని తనివితీరా చూడటం ద్వారా భర్తీ చేసుకోవచ్చు.
* ఈ మ్యూజియంలో ఉన్న మరో వెలకట్టలేని వారసత్వ సంపద – శ్రీనివాసుడూ–పద్మావతీ పరిణయ సందర్భంగా కుబేరుని వద్ద నుండి ఋణంగా స్వీకరించిన 15 లక్షల రామముద్ర కలిగిన నాణాలకు ప్రతిగా, ఒక రాగి శాసనం రూపంలో వ్రాసి ఇచ్చిన ఋణపత్రం (ప్రామిసరీ నోటు). ఆ ఋణపత్రానికి బద్ధుడై శ్రీనివాసుడు ఇప్పటికీ భక్తులు చెల్లించుకున్న కానుకలను కుబేరునికి వడ్డీగా చెల్లిస్తున్నాడు. కలియుగాంతం వరకు చెల్లిస్తూనే ఉంటాడు. ఇంతటి చారిత్రక, పౌరాణిక ప్రాశస్త్యం కలిగిన పురావస్తు విశేషాన్ని భక్తుల కోసం ప్రదర్శిస్తున్న తితిదే వారి కృషిని అభినందించి తీరాల్సిందే.
* బ్రహ్మోత్సవాల సమయంలో ఉపయోగించే శ్రీవారి వాహన శ్రేణి, స్వామివారు ఊరేగిన రథంపై అలంకరింపబడ్డ దారు శిల్పాలను కూడా ఈ విభాగంలో చూడవచ్చు.
* బ్రహ్మోత్సవాల్లో భక్తుల సందర్శనార్థం అన్నమయ్య విరచిత తామ్ర పత్రాల ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. అప్పుడు మాత్రమే రాగిరేకుల అసలు ప్రతులను దర్శించుకోవచ్చు. మిగిలిన సమయాల్లో వాటి నకలు ప్రతులను మాత్రమే సంగ్రహాలయంలో ప్రదర్శిస్తారు. అన్నమయ్య వారి కుమారుడు, మనుమడు రచించిన 32 వేల కీర్తనలలో కొన్నింటినైనా ఈ రాగిరేకుల రూపంలో దక్కించుకోగలగటం తెలుగువారి పుణ్యఫలమనే చెప్పుకోవాలి.
* మూడవ అంతస్తులోని చరిత్ర విభాగంలో, ఆలయ చరిత్రను దృశ్యరూపంలో వివరించే అరుదైన చిత్రాలు ప్రదర్శించబడుతున్నాయి. వీటిలో ప్రముఖ చిత్రకారుడు పిలకా లక్ష్మీనరసింహం గారు చిత్రించిన దశావతార చిత్రమాలిక ప్రముఖమైనది. ఈ విభాగంలోనే ప్రస్తుతం వాడుకలో లేని శ్రీవారి అమూల్యమైన ఆభరణాలను కూడా భద్రపరిచారు.
* కాంస్య విభాగంలో శతాబ్దాల కిందట పోతపోసిన కంచు విగ్రహాలు, వక్కలను కత్తిరించే కత్తెర వంటి సాధనాలు (నట్ క్రాకర్స్), కంచు గంటలు, లోహపు పాత్రలు ఉన్నాయి.
* తరతరాల ఆలయ చరిత్రను ఆసాంతం వర్ణించే వెయ్యికి పైగా శిలాశాసనాలను మ్యూజియం బయట ఉన్న గ్యాలరీలో ప్రదర్శిస్తున్నారు. ఈ శాసనాల ద్వారానే ఆలయానికి చెందిన చారిత్రక విశేషాలు, ఆయా పాలకులు ఆలయ అభివృద్ధికి చేసిన కృషి, శ్రీవారికిచ్చిన కానుకల వివరాలు వెలుగులోకి వచ్చాయి.
* శ్రీవారి సేవలో తరించిన 12 మంది ఆళ్వారుల లోహ ప్రతిమలు సంగ్రహాలయానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ మూర్తుల ముఖారవిందాలలో ఉట్టిపడే జీవకళ అనన్య సామాన్యమైనది. ఈ పన్నెండు ఆళ్వారుల గురించి మరో ప్రకరణంలో విస్తారంగా తెలుసుకుందాం.

ఎందరెందరో సాహిత్యకారులు, చరిత్రకారులు, పురావస్తు శాస్త్రవేత్తలు, ఆలయ సిబ్బంది యొక్క సమిష్టి కృషితో అత్యద్భుతంగా రూపుదిద్దుకున్న ఈ సంగ్రహాలయం, తిరుమల చరిత్రను భావితరాల కందించే విశేషమైన కృషిలో ఒక మైలురాయి. మొత్తం పది విభాగాలలో ఏర్పాటు చేయబడ్డ 'శ్రీవేంకటేశ్వర వస్తుప్రదర్శనశాల' తరతరాల తిరుమల చరిత్రకు సాక్షీభూతంగా నిలిచి, తిరుమలలో దర్శించుకోదగ్గ ముఖ్యమైన ప్రదేశాలలో ఒకటిగా రాణిస్తోంది. శ్రీవారి భక్తులు చారిత్రక అంశాలపై ఆసక్తి కలవారు, చరిత్రకారులు, పురావస్తు శాస్త్రవేత్తలు అందరూ తప్పనిసరిగా చూసి తీరవలసిందీ ప్రదర్శనశాల.

తిరుపతి నగరంలో కూడా ఇలాంటిదే ఒక అద్భుతమైన ప్రదర్శనశాలను 1983వ సంవత్సరంలో గోవిందరాజస్వామి ఆలయానికి ఉత్తర మాడవీధిలో ఉన్న ఓ పురాతన మండపంలో తితిదే ఏర్పాటు చేసింది. దీనిలో వివిధ ఆలయాల ఆకృతులు, వాటి కొలతలు, నిర్మాణ శైలులు, పూజావిధానాలు, పూజాసామగ్రి, మతపరమైన సాంప్రదాయాలు, ఆలయ కళలు, ఆలయ నిర్వహణకు సంబంధించిన వివిధ వృత్తులు మొదలగు వాటిని ప్రదర్శిస్తున్నారు. తిరుపతి నగరంలో తప్పనిసరిగా చూసి తీరవలసిన ప్రదేశాల్లో ఇది కూడా ఒకటి. దీనికి సంబంధించిన పూర్తి సమాచారం ముందు ముందు తెలుసుకుందాం.

# సేక్రెడ్ ఫుడ్స్ ఆఫ్ గాడ్

## - తిరుమల శ్రీవారి ప్రధాన అర్చకులు
## శ్రీ రమణ దీక్షితులు

తిరుమల అంటే అందరికీ లడ్డూ ప్రసాదం గుర్తుకొస్తుంది. ఆయా సేవలను బట్టి చక్కెర పొంగలి, పెరుగన్నం ప్రసాదాలు స్వామివారికి సమర్పిస్తారని తెలుసు. మరి వెంకన్నకు కమ్మని దోసెలు పెడతారని తెలుసా!

ఘాటైన మిరియాల అన్నం వండి వడ్డిస్తారని తెలుసా! ఇవి మాత్రమే కాదు. ఏడు కొండల వాడికి పూట పూటకూ ఒక మెనూ! రుతువులను బట్టి ఆహారం! స్వామి వారికి సకల విధమైన నైవేద్యం! అతి తక్కువ మందికి మాత్రమే తెలిసిన ఈ వివరాలతో శ్రీవారి ప్రధాన అర్చకుడు రమణ దీక్షితులు సేక్రెడ్ ఫుడ్ ఆఫ్ గాడ్ (స్వామివారి పవిత్ర ప్రసాదాలు) అనే పుస్తకం రాశారు. దాని తొలి ప్రతిని ఆయన భారత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి అందించారు. ఏడు కొండలవాడి దివ్య ప్రసాదాలపై పుస్తకంలోని విశేషాలు...

సర్వజగద్రక్షకుడైన ఏడు కొండల వాడికి నైవేద్యం ఎప్పుడు పెట్టాలి? ఏమి పెట్టాలి? పదార్థాలు ఏ కొలతలతో ఉండాలి? ఎవరు వండాలి? ఎలా పెట్టాలి, ఎవరు పెట్టాలి ఇటువంటివన్నీ ఆగమశాస్త్రంలో స్పష్టంగా పేర్కొన్నారు. అచ్చంగా దాని ప్రకారమే తిరుమలలో ప్రసాదాల తయారీ, సమర్పణ జరుగుతుంది. ప్రసాదాల తయారీ కోసం మామిడి, అశ్వత్థ, పలాస వృక్షాల ఎండు కొమ్మలనే ఉపయోగిస్తారు. పాలుగారే చెట్ల కొమ్మలు, ముళ్ళచెట్లు వంటకు వినియోగించరు. ప్రసాదం వండేవారు వంట సమయంలో గానీ తర్వాత గానీ వాసన చూడరు. వాసన పోకుండా ముక్కు, నోటికి అడ్డుగా వస్త్రం పెట్టుకుంటారు. ఇక శ్రీవారికి సమర్పించేదాకా బయటి వారెవరూ దానిని చూడకూడదు.

**నైవేద్యం పెట్టేది ఇలా**

ప్రసాదం సమర్పించడానికి ముందు గర్భాలయాన్ని నీళ్ళతో శుద్ధి చేస్తారు. గాయత్రీ మంత్రం జపిస్తూ నీళ్ళు చల్లుతారు. వండిన ప్రసాదాలను మూత పెట్టిన గంగాళాల్లో దేవుడి ముందు ఉంచుతారు. స్వామి, ప్రసాదాలు, నైవేద్యం సమర్పించే అర్చకుడు మాత్రమే గర్భగుడిలో ఉంటారు. గర్భాలయం తలుపులు మూసేస్తారు. విష్ణు గాయత్రీ మంత్రం పఠిస్తూ అర్చకుడు ప్రసాదాల మీద నెయ్యి, తులసి ఆకులు చల్లుతారు. కుడిచేతి గ్రాసముద్రతో ప్రసాదాన్ని తాకిన అర్చకుడు స్వామి కుడి చేతికి దానిని తాకించి, నోటి దగ్గర తాకుతారు (స్వామికి గోరుముద్దలు తినిపించడం అన్నమాట). పవిత్ర మంత్రాలు ఉచ్చరిస్తూ అన్న సూక్తం నిర్వర్తిస్తారు. చరాచర సృష్టికి కర్త అయిన స్వామి నైవేద్యం సమర్పించడం అంటే, సృష్టిలో ఆకలితో ఉన్న సమస్తాన్నీ సంతృప్తి పరచడమే. ఈవిధంగా స్వామిని వేడుకుంటూ, ముద్ద ముద్దకి నడుమ ఔషధ గుణాలున్న ఆకులు కలిపిన నీటిని సమర్పిస్తారు.

నైవేద్యం సమర్పించేంత వరకు ఆలయంలో గంట మోగుతూనే ఉంటుంది. ఇది స్వామికి భోజనానికి పిలుపుగా భావిస్తారు. రోజుకు మూడు పూటలా స్వామికి నైవేద్యం సమర్పిస్తారు. ఉదయం ఆరు, ఆరున్నర గంటల మధ్య బాలభోగం సమర్పిస్తారు. పది, పదకొండు గంటల మధ్య రాజభోగం, రాత్రి ఏడు-ఎనిమిదింటి మధ్య శయనభోగం సమర్పిస్తారు. తిరుమల గర్భగుడిలోని స్వామి మూల విగ్రహం ఎత్తు 9.5 అడుగులు. దీనికి అనుగుణంగానే స్వామికి ఏ పూట ఎంత పరిమాణంలో ప్రసాదం సమర్పించాలో కూడా శాస్త్రంలో నిర్దేశించారు. నైవేద్యం సమర్పించిన తర్వాత భక్తులకు దీనిని పంచుతారు. ప్రత్యేక రోజులలో ప్రత్యేక నైవేద్యాలు కూడా సమర్పిస్తారు.

**ఉదయం బాలభోగం;** మాత్రాన్నం, నేతి పొంగలి, పులిహోర, దధ్యోదనం, చక్కెర పొంగలి, శకాన్నం, రవ్వకేసరి.

**మధ్యాహ్నం రాజభోగం:** శుద్ధాన్నం (తెల్ల అన్నం), పులిహోర, గూడాన్నం, దధ్యోదనం, శీర లేక చక్కెరన్నం

**రాత్రి శయనభోగం:** మరీచ్య అన్నం (మిరియాల అన్నం), దోసె, లడ్డు, వడ, శాకాన్నం (వివిధ కూరగాయాలతో కలిపి వండిన అన్నం).

**అల్పాహారాలు:** లడ్డు, వడ, అప్పం, దోసె

స్వామి మెనూ ఇది.

ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపిన తర్వాత అప్పుడే తీసిన చిక్కని వెన్న నురుగు తేలే ఆవుపాలు సమర్పిస్తారు. తోమాల, సహస్రనామ అర్చన సేవల తరువాత నువ్వులు, శొంఠి కలిపిన బెల్లం నైవేద్యంగా పెడతారు. ఆ తరువాత బాలభోగం సమర్పిస్తారు. దీంతో ప్రాతఃకాల ఆరాధన పూర్తవుతుంది. సర్వదర్శనం మొదలవుతుంది. అష్టోత్తర శతనామ అర్చన తరువాత రాజభోగం సమర్పణ జరుగుతుంది. మళ్ళీ సర్వదర్శనం మొదలవుతుంది. సాయంకాల ఆరాధన తర్వాత గర్భాలయం శుద్ధి చేసి స్వామిని తాజా పూలతో అలంకరిస్తారు. అష్టోత్తర శతనామ అర్చన తర్వాత శయనభోగం సమర్పిస్తారు. అంతటితో అయిపోయినట్లు కాదు, అర్ధరాత్రి తిరువీశం పేరుతో బెల్లపు అన్నం (శుద్ధాన్నం, గుడాన్నం) పెడతారు.

ఇక పవళించే సమయం దగ్గర పడుతుంది. ఏకాంత సేవలో భాగంగా నేతిలో వేయించిన బాదం, జీడిపప్పులు వంటివి, కోసిన పండ్ల ముక్కలు, వేడిపాలు స్వామికి సమర్పిస్తారు.

**ఇదీ ప్రసాదం:** బియ్యం, ధాన్యాలు, ఆవుపాల పదార్థాలు, ఔషధ గుణాలున్న వస్తువులు, వనస్పతులు, లవంగాలు, యాలకులు, తులసి, మిరియాలు.. ఇవన్నీ శ్రీవారి ప్రసాదాల తయారీకి వినియోగిస్తారు. హింసలేని ప్రపంచాన్ని కోరుకున్న మహర్షులు నిర్దేశించిన ప్రసాదాలు ఇవి. ప్రసాదం అంటే ఆకలి తీర్చే ఆహారం కాదు. పవిత్రంగా పరిమితంగా స్వీకరించవలసిన పదార్థం. ఈ అంశాలను భక్తజనానికి వివరించడమే ఈ పుస్తక పరమోద్దేశం.

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు. ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథం యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము. (హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)**

శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
పుల్లగూర్ల సాయిరెడ్డి
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు వ్యవహారములందు చాకచక్యముగా మసలుకొనిన ఆకస్మిక ధనలాభము. ఇతరుల విషయంలో తలదూర్చరాదు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి పూజల వలన శత్రుబలం తగ్గును. స్త్రీల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండగలరు. వినాయక పూజలు చేయండి.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులు చాలా జాగ్రత్తగా ఉండాలి. మీ నాలిక పదునుగా మాట్లాడినందువలన మానసికముగా బాధపడగలరు. బంధుమిత్రుల విషయంలో చాలా తక్కువగా మాట్లాడగలరు. ఆదాయ వనరులు ఉండగలవు. వినాయకుని హోమం చేయించండి అనుకూలంగా ఉంటుంది.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు మానసిక సంబంధమైన ఇబ్బందులు రాగలవు. స్నేహితులు మీ విలువలను గుర్తించగలరు. సంఘంలో గౌరవ మర్యాదలు పొందుతారు. కొన్ని విధములుగా ఏమి జరిగినా అంతా మనమంచికే అనుకొని ముందుకు సాగండి. మీరు హుందాతనంగా ఉండండి. శనికి తైలాభిషేకం నువ్వుల దానం ఇవ్వండి.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు సంఘంలో వినయ విధేయత వలన శత్రువులు మిత్రులగుదురు. బంధుమిత్రుల ఆదరాభిమానములు, పిల్లల విషయంలో శ్రద్ధ ఉంచండి. ధనసంబంధమైన విషయములు అనుకూలంగా ఉండగలవు. శుభ పరిణామములు. ఇష్టదేవతా ఆరాధన చేయండి.

## సింహరాశి

**మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు వివాహ ప్రయత్నములు చేయండి ఫలితం పక్కనే ఉంటుంది. జాతకం చూడకుండా వివాహములు చేయరాదు. మేనరికాలు చేయరాదు. అనారోగ్య సమస్యలు ఉన్నవి. జాగ్రత్తలు తీసుకొనగలరు. వినాయక లక్ష్మీనారాయణులకు యజ్ఞం చేయండి.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు విఘ్నేశ్వర పూజలు చేయుట వలన విఘ్నములు తొలగును. నూతన ప్రయత్నములకు శ్రీకారం చుట్టండి. పితృదేవతల ఆరాధన వలన పెండింగ్‌లో ఉన్న పనులు నెరవేరగలవు. ఆర్థికంగా సంతృప్తి ఉం టుంది. స్కందగిరి దేవాలయం దర్శనంతో అనేక లాభములు.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు కొంత జాగరూకత కలిగి సామరస్యంగా మెలిగితే ఆకస్మిక వ్యవహార లాభము. న్యాయస్థానంలో అడుగిడు సమయం. ఆవేశానికి ఆగ్రహానికి గురికాగలరు. ఏమరుపాటు కలిగి ఉండరాదు. శరవణభవ అనే నామం నిరంతరం చేయండి. పితృదేవతల అమావాస్య పండుగ.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. ఇతరులతో తక్కువగా మాట్లాడగలరు. ఆకస్మిక ధనలాభము కలిగి ఉన్నారు. అనారోగ్య సమస్యలు కలిగి ఉన్నారు. పిల్లల విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకొనగలరు. శనిదేవునికి తైలాభిషేకం చేయండి. పితృ తర్పణలు చేయండి.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ పురుషలుకు అనుకూలంగా ఉంటుంది. తల్లిదండ్రుల ఆరోగ్యం విషయంలో శ్రద్ధ పెట్టవలసి వస్తుంది. సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి అన్నిరకముల పండ్ల రసములతో అభిషేకము, పంచామృతాభిషేకం, హోమం, శరవణభవ అనే నామ జపం చేయండి.

## మకరరాశి

**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ట 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు అధిక శ్రమతో ముందుకు సాగుటకు అవకాశములు ఉన్నవి. ఆర్భాటములకు సమయం కాదు. విఘ్నేశ్వరుని, పార్వతి పరమేశ్వరులను, సుబ్రహ్మణ్యేశ్వర పూజలు, లక్ష్మీగణపతి హోమం చేయుట వలన ఒడిదుడులు లేకుండా గడిచిపోతుంది.

## కుంభరాశి

**ధనిష్ట 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు కొన్ని విషయములలో అనుకూలంగా ఉంటుంది. చాకచక్యంగా మాట్లాడి ముందుకు సాగండి. నిర్లక్ష్యం వలన అనేక సమస్యలు ఉన్నవి. ఏరోజు పని ఆరోజు కావాలి అనే ధోరణ కలిగి ఉండండి. విఘ్నేశ్వర పూజలు, పితృదేతలకు పూజలు చేయండి.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూల వాతావరణంలాగ ప్రగతిపథంలో ముందుకు సాగండి. ప్రోత్సాహకరంగా విందు వినోదములు. విఘ్నేశ్వరుని ఆరాధన సంతృప్తినిస్తుంది. లక్ష్మీగణపతి హోమం చేసి గృహోపకరణ వస్తువాహనములు పొందుటకు అనుకూలం. పితృదేవతలకు సంతృప్తి చేయండి.

# మీ విజ్ఞానం

నిర్వహణ: **డా.పి. లలితవాణి**



శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com

ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. గరుడుని తల్లి ఎవరు?
2. వజ్రాయుధాన్ని అణచిన ముని ఎవరు?
3. శ్రీకృష్ణుని విశ్వరూపం చూసిన మహర్షి ఎవరు?
4. "మంగం" అంటే ఏమిటి?
5. జటాయువు ఎవరి సోదరుడు?
6. అంజనాదేవి భర్త ఎవరు?
7. త్రివిక్రమమూర్తికి 21 ప్రదక్షిణలు చేసిందెవరు?
8. తుంబురునికి వీణ ఇచ్చింది ఎవరు?
9. సంపాతి, జటాయువు ఎవరి పుత్రులు?
10. బ్రహ్మ ఆవలింత వలన పుట్టినవాడు ఎవరు?
11. గోపికలు చేసిన వ్రతం ఏది?
12. కనకదాసు అసలు పేరేమిటి?
13. శ్రీకృష్ణదేవరాయల గురువు ఎవరు?
14. రామధ్యాన చరిత – వ్రాసిందెవరు?
15. కంసుని తండ్రి ఎవరు?

1. ____________________
2. ____________________
3. ____________________
4. ____________________
5. ____________________
6. ____________________
7. ____________________
8. ____________________
9. ____________________
10. ____________________
11. ____________________
12. ____________________
13. ____________________
14. ____________________
15. ____________________

## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. అవిక్షిత్తు, 2. ప్రాణం పోసిన వాడితో, 3. బృహస్పతి, 4. శ్వేతుడు, 5. సంవర్తుడు, 6. బ్రహ్మాండ పురాణంలో, 7. సురథుడు, 8. మేరు సావర్ణి, 9. తారాతి, 10. వేదనిధి, 11. సర్వాబద్ధుడు, 12. కౌత్సుడు, 13. వృంద, 14. పూరీ జగన్నాథుడు, 15. విష్ణువు పుత్రిక

## సరైన సమాధానాలు రాసినవారు

1. వనమాల రామలింగాచారి, 2. బలుసు రాంబాబు, 3. వి. వసుంధర, 4. చిల్లర సీతారామారావు, 5. సూరి సౌభాగ్యలక్ష్మి, 6. జె. ఇందిర, 7. పి. యశోద, 8. చింతలపాటి శివశంకరశాస్త్రి

పేరు: ____________________

చిరునామా: ____________________

____________________

____________________

____________________

పిన్‌కోడ్: ____________________

ఫోన్: ____________________

## లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

**సూరి సౌభాగ్యలక్ష్మి**

తేది 27-08-2024 గోకులాష్టమి రోజున తిరుమల శ్రీవేంకటేశ్వరునికి

## 22వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ దృశ్యమాలికలు











Postel Registration No: HSE/879/2022-2024

Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month

RNI No.: APTEL/2008/23122

# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక







**If Un delivered please return to:**

**SRI VENKATESHAM, (Sri Venkateshwara Maha Mantra Peetham)**

H.No: 1-1-53, Street No. 1, Habsiguda, Hyderabad-500007. Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు https://www.srivenkatesham.org లో చదవండి

Srivenkatesham Magazine in Google Drive https://drive.google.com/drive/folders/1jOWBeoUHjF4Qhn4wl-d9eUGIh6kVYyLq